




www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

బుధవారం
26-06-2024

సంపుటి : 01 | సంచిక : 53 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్


V3 NEWS

## రాజీనామాపై వెనక్కి
# తగ్గిన జీవన్ రెడ్డి

ఎమ్మెల్సీతో భట్టి, మంత్రి శ్రీధర్ రెడ్డి చర్చలు

జీవన్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ వదులుకోదు : భట్టి

కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదు..



**విశ్వంభర, జగిత్యాల:**

అధికార కాంగ్రెస్ పార్టీలో ఇతర పార్టీల నుంచి నేతల చేరికలు చిచ్చు రేపుతున్నాయి. బీఆర్ఎస్ పార్టీకి చెందిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కాంగ్రెస్ పార్టీలో చేరడం పట్ల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో ఆయన ఎమ్మెల్సీ పదవికి, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసేందుకు సిద్ధమయ్యారు. ఆయన్ను బుజ్జగించేందుకు మంత్రి శ్రీధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పెద్దలు రంగంలోకి దిగారు. అయినా వెనక్కు తగ్గని జీవన్ రెడ్డి.. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. దీంతో మంగళవారం ఉదయం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు మరోసారి జీవన్ రెడ్డితో భేటీ అయ్యారు.

**జీవన్ రెడ్డి సేవలు కాంగ్రెస్ కు అవసరం**

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డితో భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబులు సుదీర్ఘంగా చర్చలు జరిపారు. అనంతరం జీవన్ రెడ్డి నివాసం వద్ద భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సీనియర్ నాయకులు. మా అందరికీ ఆయన మార్గదర్శకులు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అనుభవాన్ని ప్రభుత్వం నడపడంకోసం తప్పనిసరిగా వినియోగించుకుంటామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోలేని పది సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ జెండాను భుజాన మోస్తూ పార్టీ భావజాలాన్ని చట్టసభల్లో వినిపించిన సీనియర్ నాయకులు జీవన్ రెడ్డి అని భట్టి అన్నారు. ఈ ప్రభుత్వం నడవడంకోసం వారి ఆలోచనలను తప్పనిసరిగా పరిగణలోకి తీసుకుంటామని, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సీనియార్టీకి ఎలాంటి భంగం కలిగించకుండా పార్టీ సముచిత ప్రాధాన్యమిస్తూ గౌరవిస్తుందని భట్టి తెలిపారు. సీనియర్ నాయకులను ఎట్టి పరిస్థితుల్లో వదులుకోవడానికి పార్టీ అధిష్టానం సిద్ధంగా లేదని, పార్టీలో ఉన్న సీనియర్ నాయకులు మనస్థాపం చెందితే మేమందరం బాధపడతామని భట్టి అన్నారు.

**నేను కాంగ్రెస్ పార్టీని వదిలే ప్రసక్తే లేదు..**

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. నేను కాంగ్రెస్ పార్టీని వదిలే ప్రసక్తే లేదు. కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతా. చేరికల విషయంలో మనస్థాపం చెందాను.

మిగతా2లో...



నో డౌట్ కేసీయార్ భయపడుతున్నారన్న విషయం అర్థమైపోయింది. విద్యుత్ రంగంలో అవినీతి జరిగినట్లు వచ్చిన ఆరోపణలను విచారిస్తున్న జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ను రద్దుచేయాలని కేసీయార్ హైకోర్టులో పిటీషన్ దాఖలుచేశారు. కేసీయార్ అధికారంలో ఉన్నపుడు ఛత్తీస్ ఘడ్ నుండి విద్యుత్ కొనుగోలుతో పాటు యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటులో పెద్దఎత్తున అవినీతి జరిగిందనే ఆరోపణలు అందరికీ తెలిసిందే. అన్నీ కోణాల నుండి వినిపిస్తున్న ఆరోపణల్లో నిజాలు తెలుసుకునేందుకు ప్రభుత్వం జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ను నియమించింది. ఈ కమిషన్ ఇప్పటికే కేసీయార్ హయాంలో జెన్కో, డిస్కంల్లో పనిచేసిన విద్యుత్ ఉన్నతాధికారులతో పాటు అప్పట్లో విద్యుత్ ఒప్పందాల్లో కీలకంగా వ్యవహరించిన ఉన్నతాధికారులను కూడా విచారించింది. విద్యుత్ రంగంలోని నిపుణులతో పాటు సంబంధమున్న అనేకమంది ఇంజనీర్లు, రిటైర్డ్ ఉన్నతాధికారులు కూడా విచారణకు హాజరై తమ వాగ్మూలాలను ఇచ్చారు. కేసీయార్ ఒంటెత్తుపోకడల వల్ల ప్రభుత్వంపై సుమారు రు. 6 వేల కోట్ల అదనపు భారం పడిందన్న విషయాన్ని నిపుణులు ఉదాహరణలతో సహా కమిషన్ కు అందించారు. ఇందులో భాగంగానే కమిషన్ విచారణకు హాజరుకావాలంటు కేసీయార్ కు నోటీసు ఇచ్చింది. అయితే కమిషన్ నోటీసు ప్రకారం కేసీయార్ విచారణకు హాజరుకాలేదు.

# కేసీఆర్‌లో భయం.. భయం!

## జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ విచారణపై ఆందోళన?

కమిషన్‌ను రద్దు చేయాలని హైకోర్టులో పిటిషన్

ఛత్తీస్ గడ్ విద్యుత్ కొనుగోలు,

యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్ల అవినీతిపై ఎంక్వైరీ

కమిషన్ ఎదుట హాజరుకాని మాజీ ముఖ్యమంత్రి

జస్టిస్ నరసింహారెడ్డిని తప్పుబడుతూ 12 పేజీల లేఖ

తాజాగా కమిషన్‌ను రద్దు చేయాలని న్యాయస్థానంలో పిటిషన్



**విశ్వంభర, హైదరాబాద్ :**

విచారణకు హాజరుకాకపోవటం ఒకఎత్తయితే కమిషన్ ఛైర్మన్ నరసింహారెడ్డి వ్యక్తిత్వాన్ని ప్రశ్నిస్తు కేసీయార్ 12 పేజీల లేఖ రాశారు. ఆ లేఖలో నరసింహారెడ్డి పైన అనేక ఆరోపణలు చేశారు. కమిషన్ ఛైర్ పర్సన్ గా ఉండే అర్హత నరసింహారెడ్డికి లేదని కేసీయార్ తేల్చేశారు. అంతటితో ఆగని కేసీయార్ నరసింహారెడ్డిని ఛైర్మన్ గా దిగిపోవాలని కూడా డిమాండ్ చేశారు. నరసింహారెడ్డికి లేఖ రాయటమే కాకుండా దాన్ని మీడియాకు లీక్ కూడా చూశారు. దాంతో కేసీయార్ విచారణ వ్యవహారంపై అందరిలోను ఆసక్తి పెరిగిపోయింది. కేసీయార్ లేఖ నేపధ్యంలో ఛైర్మన్ ఏమిచేస్తారనే సస్పెన్స్ పెరిగిపోతోంది. లేఖపైన జస్టిస్ స్పందిస్తు ప్రొసీజర్ ప్రకారమే నడుచుకుంటానని చెప్పారు. బహుశా కమిషన్ అధికారాల పరిధిపై కేసీయార్ కూడా న్యాయనిపుణులతో చర్చించినట్లున్నారు.

మిగతా2లో...

## హెల్ప్ ప్లీజ్..

- తెలంగాణ సీఐడీ సహకారం కోరిన సీబీఐ
- నీట్ పేపర్ లీక్ కేసులో రిక్వెస్ట్
- తెలంగాణ ఎంసెట్ పేపర్ లీక్ కేసుతో సారూప్యత ఉండటంతోనే..

నీట్ పేపర్ లీక్ కేసులో తెలంగాణ సీఐడీ సహకారం కోరింది సీబీఐ. 2016లో తెలంగాణ ఎంసెట్ పేపర్ లీక్ అయ్యింది. తెలంగాణ ఎంసెట్ పేపర్ లీక్ కేసులో బీహారీ గ్యాంగ్ సభ్యులు నిందితులుగా ఉన్నారు.




2

## కేటీఆర్ నిర్లక్ష్యం వల్లే చేనేత రంగం కుదేలు

- జౌళిశాఖ మంత్రిగా ఉన్నప్పటికీ ఏమాత్రం శ్రద్ధ చూపలే
- చేనేత ఉత్పత్తుల మార్కెటింగ్‌ను పట్టించుకోలే..
- బీఆర్ఎస్ ప్రభుత్వం తీరు వల్లే చేనేతలో సంక్షోభం
- రూ.400 కోట్ల బడ్జెట్‌ను వినియోగానికి సీఎం అంగీకారం
- వెల్లడించిన చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



2

పార్టీ ఫిరాయింపులపై

తొలిసారి స్పందించిన

# కేసీఆర్

- పోచారం మారడాన్ని ఏ మాత్రం పట్టించుకోవద్దు
- కొంతమంది మారినంత మాత్రాన నష్టమేం లేదు
- వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో కూడా ఇలా జరిగాయి
- భవిష్యత్తులో బీఆర్ఎస్ పార్టీకి మంచి రోజులు
- పార్టీ ముఖ్య నాయకులను తరచూ కలుస్తా..
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలో మాజీ సీఎం కేసీఆర్

6

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



# రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన

ముగ్గురు కేంద్ర మంత్రులతో భేటీ

వైద్యారోగ్య, గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి సమస్యల పరిష్కారంపై దృష్టి..

లోక్‌సభలో రాష్ట్ర ఎంపీల ప్రమాణస్వీకారానికి హాజరు

సమాఖ్య స్ఫూర్తిని చాటుతున్న ముఖ్యమంత్రి

**విశ్వంభర ఢిల్లీ:**

తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి ముగ్గురు కేంద్ర మంత్రులతో సమావేశం కావడంతో పాటు తెలంగాణ నుంచి ఎంపీకైన లోక్‌సభ సభ్యుల ప్రమాణ స్వీకారానికి హాజరయ్యారు. కేంద్రంలో కాంగ్రెస్‌కు వైరి పక్షమైన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కొలువుదీరినప్పటికీ తెలంగాణ ప్రజల ప్రయోజనాలే ప్రాధాన్యంగా సమాఖ్య స్ఫూర్తిని అనుసరించి కేంద్ర మంత్రులను కలిసి సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో తొలి రోజైన సోమవారం రక్షణ శాఖ

మిగతా2లో...

# నయవంచనకు ప్రతిరూపమే కాంగ్రెస్

రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాస్తూ పార్టీ ఫిరాయింపులు

పార్లమెంట్‌లో రాజ్యాంగం ప్రదర్శలు

కాంగ్రెస్‌పై మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహం



**విశ్వంభర, హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడ్డారు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఓవైపు రాజ్యాంగ పరిరక్షణ అంటూనే మరోవైపు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తోంది అంటూ కాంగ్రెస్ పై ధ్వజమెత్తారు. ఎమర్జెన్సీ నాటి నుంచి ఇప్పటివరకు నయవంచనకు ప్రతిరూపం కాంగ్రెస్ అంటూ ట్వీట్ చేశారాయన. ''పౌర, ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ ప్రజల గొంతులను అణిచివేస్తూ 49 సంవత్సరాల క్రితం ఇదేరోజు కాంగ్రెస్ పార్టీ దేశంలో ఎమర్జెన్సీ విధించింది. ఇన్ని దశాబ్దాలు గడిచినా కాంగ్రెస్ పార్టీ

మిగతా2లో...



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 119 | ₹ 142 |
| **స్కిన్** | **స్కిన్‌లెస్** |
| ₹206 | ₹234 |

# జై పాలస్తీనా..

- లోక్‌సభలో నినాదించిన అసదుద్దీన్ ఒవైసీ
- తీవ్ర అభ్యంతరం తెలిపిన బీజేపీ ఎంపీ
- రికార్డుల నుంచి తొలగిస్తామన్న సభాపతి
- 'భారత్ మాతాకీ జై' అనరు కానీ జై పాలస్తీనా అంటారా..?
- హైదరాబాద్ ఎంపీపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం



2

## తెలంగాణ ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ మార్పు

- వాయిదా పడిన ఈఏపీసెట్ కౌన్సెలింగ్
- జూన్ 27 నుంచి జులై 4వ తేదీకి చేంజ్
- ప్రకటించిన ఉన్నత విద్యా మండలి



2

## తెలంగాణ రాష్ట్రంలో 16 ఉత్పత్తులకు జీఐ ట్యాగ్

- బాలానగర్ సీతాఫలం స్పెషాలిటీ గుర్తింపు కోసం దరఖాస్తు
- జీఐ ట్యాగ్ కోసం శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం కసరత్తు



6

# జై పాలస్తీనా..

**విశ్వంభర, హైదరాబాద్:** లోక్‌సభలో ఎంపీల ప్రమాణస్వీకారం ఈరోజుతో ముగిసింది. తెలంగాణ ఎంపీలతో పలువురు సభ్యులు ఈరోజు ప్రమాణం చేశారు. ప్రమాణస్వీకారం సందర్భంగా ఎంపీలు కొంత మంది నినాదాలు చేశారు. సురేష్ షెట్కర్, రఘునందన్‌రావు, ఈటల రాజేందర్, అసదుద్దీన్ ఒవైసీ, మల్లు రవి, కుందూరు రఘువీర్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, కడియం కావ్య, బలరాం నాయక్, రామసాయం రఘురాంరెడ్డి.. జై తెలంగాణ అని నినదించారు. జై సమ్మక్క సారలమ్మ అని ఈటల, జై లక్ష్మీనర్సింహస్వామి అని కిరణ్‌కుమార్ రెడ్డి, జై భద్రకాళి అని కడియం కావ్య, జై తుల్జాభవాని అంటూ బలరాం నాయక్ నినదించారు.

**కలకలం రేపిన ఒవైసీ**

ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రమాణం పూర్తి చేసిన తర్వాత జై పాలస్తీనా అని నినదించడంతో లోక్‌సభలో కలకలం రేగింది. అసదుద్దీన్ వ్యవహారంపై పలువురు మంత్రులు, బీజేపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. నిబంధనలు పరిశీలించి.. రికార్డుల నుంచి తొలగించే విషయాన్ని పరిశీలిస్తానని సభాపతి స్థానంలో ఉన్న రాధామోహన్ సింగ్ హామీయివ్వడంతో వివాదం సద్దుమణిగింది.

**జై పాలస్తీనా అంటే తప్పేంటి?**

తన వ్యాఖ్యలను అసదుద్దీన్ ఒవైసీ సమర్థించుకున్నారు. జై పాలస్తీనా అంటే తప్పేంటని ప్రశ్నించారు. "ప్రమాణస్వీకారం సందర్భంగా అందరూ ఏదో ఒక నినాదం చేశారు. నేను కేవలం జై భీమ్, జై మీమ్, జై తెలంగాణ, జై పాలస్తీనా అన్నాను. ఇది ఎలా రాజ్యాంగ వ్యతిరేకం అవుతుంది? అలాంటి నింబంధన ఏదైనా ఉంటే చూపాల"ని అసదుద్దీన్ ఒవైసీ అన్నారు.

**అసదుద్దీన్ చేసింది తప్పు: కిషన్‌రెడ్డి**

అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి స్పందించారు. సభా నిబంధనలకు విరుద్ధంగా అసదుద్దీన్ వ్యవహరించారని విమర్శించారు. పార్లమెంట్‌లో 'జై పాలస్తీనా' నినాదం చేయడం పూర్తిగా తప్పు. ఇది సభా నిబంధనలకు విరుద్ధం. భారత్‌లో ఉంటూ 'భారత్ మాతాకీ జై' అనరు కానీ రాజ్యాంగ విరుద్ధమైన పనులు చేస్తున్నారని.. ప్రజలు అర్థం చేసుకోవాల"ని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## రాజీనామాపై వెనక్కి తగ్గిన జీవన్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

నేను ఇప్పుడు ఎమ్మెల్సీగా ఉన్నాను. ఎమ్మెల్సీగా అసెంబ్లీకి వెళ్లే హక్కు నాకు ఉందని అన్నారు. శాసనమండలి చైర్మన్ అందుబాటులో లేకపోవడం వల్లనే నేను రాజీనామా సమర్పించలేదని, కార్యకర్తలతో చర్చించిన తరువాత ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసే విషయంపై క్లారిటీ ఇస్తానని చెప్పారు.

**జీవన్ రెడ్డికి కేసీ వేణుగోపాల్ ఫోన్?**

ఇదిలాఉంటే.. జీవన్ రెడ్డితో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఫోన్ లో మాట్లాడారని తెలుస్తోంది. పార్టీలో సముచిత స్థానం దక్కుతుందని, రాజీనామా నిర్ణయంపై వెనక్కుతగ్గి, పార్టీ బలోపేతంకోసం ఎప్పటిలాగే పనిచేయాలని సూచించినట్లు సమాచారం. దీనికితోడు మంత్రి పదవినిసైతం జీవన్ రెడ్డికి ఆఫర్ చేసినట్లు ప్రచారం జరుగుతుంది.

## కేసీఆర్‌లో భయం.. భయం!

**(మొదటి పేజీ తరువాయి)**

అందుకనే ముందుజాగ్రత్తగా కమిషన్ ఏర్పాటునే చాలెంజ్ చేస్తు కోర్టులో పిటీషన్ వేశారు. కమిషన్ తనను అరెస్టు చేస్తుందేమో అన్న భయం కేసీయార్లో పెరిగిపోతున్నట్లుంది. లేకపోతే కమిషన్ ఏర్పాటును ప్రశ్నించటమే కాకుండా ఛైర్మన్ గా నరసింహారెడ్డిని తప్పుకోమని డిమాండ్ చేసిన కేసీయార్ ఇంత సడన్ గా కోర్టులో పిటీషన్ వేయాల్సిన అవసరం ఏమొచ్చింది ? తనను విచారించే విషయంలో కమిషన్ కున్న అధికారాలపై కేసీయార్ కు క్లారిటి వచ్చుంటుంది. అందుకనే కమిషన్ ఏర్పాటుకు వ్యతిరేకంగా పిటీషన్ వేశారు. తనపైన వస్తున్న ఆరోపణలకు కమిషన్ ముందు హాజరై తన వాదన వినిపించే అవకాశం కేసీయార్ కుంది. ఉన్న అవకాశాన్ని ఉపయోగించుకోకుండా కమిషన్ ఏర్పాటును ప్రశ్నించటం, నరసింహారెడ్డిని ఛైర్మన్ గా దిగిపోమనటం నిజంగా అనవసరం. లేఖ రాసి మీడియాకు రిలీజ్ చేసి నానా కంపుచేసిన కేసీయార్ చివరకు కోర్టులో పిటీషన్ వేశారంటేనే ఎంత భయపడుతున్నారో అర్థమైపోతోంది. మరి కేసీయార్ పిటీషన్ పై కోర్టు ఏ విధంగా స్పందిస్తుందో చూడాలి.

## తెలంగాణ ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ మార్పు

**విశ్వంభర, హైదరాబాద్, జూన్ 25:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల్లో 202425 విద్యా సంవత్సరానికి బీటెక్, బీఈ కోర్సుల్లో ప్రవేశాలకు రేపటి నుంచి జరగవల్సిన ఈఏపీసెట్ కౌన్సెలింగ్ వాయిదా పడింది. ఈ మేరకు ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశాల కౌల్సింగ్ షెడ్యూల్‌లో మార్పులు చోటు చేసుకున్నట్లు ఉన్నత విద్యా మండలి ప్రకటించింది. మొత్తం మూడు విడతలుగా జరగాల్సిన ఇంజినీరింగ్ కౌన్సిలింగ్ జూన్ 27 నుంచి ప్రారంభం కావాల్సి ఉండగా.. అది వాయిదా పడింది. ఈ సందర్భంగా కొత్త షెడ్యూల్‌ను విడుదల చేసింది. తాజా షెడ్యూల్ ప్రకారం తొలివిడత ప్రవేశాల ప్రక్రియ జులై 4 నుంచి ప్రారంభం కానున్నట్లు అధికారులు తెలిపారు.

**తెలంగాణ ఈఏపీసెట్ 2024 కొత్త షెడ్యూల్ ఇదే..**

- జులై 4 నుంచి ఇంజినీరింగ్ తొలివిడత రిజిస్ట్రేషన్లు ప్రారంభం
- జులై 6 నుంచి 13 వరకు తొలి విడత సర్టిఫికెట్ వెరిఫికేషన్
- జులై 8 నుంచి 15 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం
- జులై 19న తొలివిడత సీట్ల కేటాయింపు
- జులై 26 నుంచి రెండో విడత కౌన్సిలింగ్లు
- జులై 27న సర్టిఫికెట్ వెరిఫికేషన్లు
- జులై 27, 28 తేదీల్లో రెండో విడత వెబ్ ఆప్షన్లకు అవకాశం
- జులై 31న రెండో విడత సీట్ల కేటాయింపు
- ఆగస్టు 8 నుంచి మూడో విడత కౌన్సిలింగ్ ప్రక్రియ
- ఆగస్టు 9న సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ఆ
- గస్టు 9,10 తేదీల్లో వెబ్ ఆప్షన్లకు అవకాశం
- ఆగస్టు 13న 3వ విడత సీట్ల కేటాయింపు
- ఆగస్టు 21 నుంచి కన్వినర్ కోట ఇంటర్నల్ స్లైడింగ్ కి అవకాశం

కాగా ఈ ఏడాది జరిగిన టీఎస్ ఈఏపీసెట్ పరీక్షకు 2,54,814 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో ఇంజనీరింగ్ విభాగంలో 2,40,618 మంది విద్యార్థులు.. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో 91,633 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షకు హాజరైన వారిలో అగ్రికల్చర్, ఫార్మసీలో 89 శాతం, ఇంజినీరింగ్ విభాగంలో 74.98 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. మరో రెండు రోజుల్లో కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుందనంగా ఇంతలో కొన్ని కారణాల రిత్య కౌన్సెలింగ్ తేదీల్లో మార్పులు చోటు చేసుకున్నాయి.



# కేటీఆర్ నిర్లక్ష్యం వల్లే చేనేత రంగం కుదేలు

**విశ్వంభర, హైదరాబాద్ :**

మరమగ్గాల, చేనేత మగ్గాల ఆధునీకరణకు బీసీ వెల్ఫేర్ శాఖ ద్వారా 202425 సంవత్సరానికి కేటాయించిన రూ.400 కోట్ల బడ్జెట్ వినియోగించడానికి తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీనికి అంగీకరించారు. ఈ విషయాన్ని వ్యవసాయ, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. గతంలో కేటీఆరే చేనేత జౌళిశాఖ మంత్రిగా ఉన్నప్పటికి చేనేత ఉత్పత్తుల మార్కెటింగ్ మీద ఏ మాత్రం శ్రద్ధ చూపలేదేని, ఆ ప్రభుత్వం మార్కెటింగ్ ను మెరుగుపరిచి ఉంటే ఇప్పుడు సంక్షోభం వచ్చేది కాదని ఆయన అన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల వారు టెస్కో ద్వారా వస్త్రాలు కొనుగోలు చేయుటకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని, ఈ ఆదేశాల ప్రకారం టెస్కో నుండి ఎన్ఓసీ (నాన్ అవైలబులిటీ సర్టిఫికెట్) లేకుండా ఏ ప్రభుత్వ శాఖ కూడా ప్రైవేటు మార్కెట్ ద్వారా వస్త్రాలు కొనుగోలు చేయకుండా చర్యలు తీసుకున్నామని మంత్రి తెలిపారు. దీనివలన వివిధ ప్రభుత్వ శాఖల నుండి సుమారుగా 255.27 కోట్ల విలువైన ఆర్డర్లు టెస్కోకు వస్త్ర సరఫరా కోసం రావడం జరిగిందని, వాటి ఉత్పత్తి కోసం ఆర్డర్స్ ఇవ్వటం జరిగిందని మంత్రి వెల్లడించారు."మా ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రంలోని మొత్తం ప్రాథమిక చేనేత సహకార సంఘాల సభ్యులకు పని కల్పించుటకు, నేటివరకు సుమారుగా 53 కోట్ల విలువైన వస్త్రాలు కొన్నాం, అన్ని ప్రాథమిక చేనేత సహకార సంఘాలలో సర్వసభ్య సమావేశాలు ఏర్పాటు చేసి సభ్యులందరికీ పని కలిపించుటకు చర్యలు తీస్కోవటం జరిగింది,అని మంత్రి వెల్లడించారు. డిసెంబర్ 2023 నుండి కొనుగోలు చేసిన వస్త్రములకు సంబంధించి పేమెంట్లను వెంటవెంటనే విడుదల చేస్తున్నామని, సమగ్ర శిక్షణ పథకం కింద యూనిఫాం సరఫరా నిమిత్తం 50 శాతం అడ్వాన్సు సుమారుగా రూ. 50 కోట్లు, నూలు కొనుగోలు, సైజింగ్ కోసం విడుదల చేశామన్నారు. దీని ద్వారా నాణ్యమైన నూలు కొనుగోలు చేసి వస్త్ర ఉత్పత్తులకు సుమారుగా 20.00 కోట్లు విలువైన నూలు సరఫరా చేయటమైనది.ఎన్హెచ్‌డీసీ ద్వారా కొనుగోలు చేసిన నూలు ఖరీదుకు సంబంధించి 2.96 కోట్లు అడ్వాన్సుగా విడుదల చేయటం జరిగిందన్నారు.మంగళవారం సచివాలయంలోని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యవసాయ మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల అధికారులతో వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఫైనాన్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్ రావు తదితరులు హాజరయ్యారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ... చేనేతలకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నేరవేర్చడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. సోమవారం కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డికి రాసిన బహిరంగ లేఖ దొంగే.. దొంగ, దొంగ అన్నట్లు ఉందని ఎద్దేవా చేశారు. గత పదేళ్ళలో చేనేత రంగాన్ని అన్నిస్థాయిలలో అస్తవ్యస్తం చేసి, స్వంత



లాభాలకు వాడుకుని ఇప్పుడు లేఖ పేరిట రాజకీయం చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

**చేనేత ఉత్పత్తులకు ఈ - మార్కెటింగ్**

గతంలో మంత్రిగా పనిచేసిన ఐటి మంత్రిగా ఉన్న కేటీఆరే చేనేత జౌళిశాఖ మంత్రిగా ఉన్నప్పటికి చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ విషయంలో ఏ మాత్రం చొరవ చూపించకపోవటం వలన వారి హయాంలో చేనేత ఉత్పత్తులకు ఈ - మార్కెటింగ్ అమలు కాబడలేదు. మా ప్రభుత్వం ద్వారా ఈమార్కెటింగ్ చేయుటకు కృతనిశ్చయంతో ముందుకు సాగుతూ, చేనేత కార్మికుల ఉత్పత్తుల అమ్మకాలకుగాను వెసులుబాటు కల్పించి వారికి పూర్తి స్థాయిలో వృత్తిపై ఆదాయం పెంచే ప్రయత్నం చేయుచున్నామని మంత్రి పేర్కొన్నారు.

**బీఆర్ఎస్ నాయకులు నేతన్నలకు చేసిన మోసాలు ఇవే....**

2023 బతుకమ్మ చీరల పథకము క్రింద టెస్కో కు చెల్లించవలసిన 351.52 కోట్లు గత ప్రభుత్వం చెల్లించలేదు, వీటిని మా ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.100 కోట్లు విడుదల చేయనుంది. సమగ్ర శిక్ష 202324 పథకము కింద గత ప్రభుత్వం బకాయి ఉన్న రూ. 108 కోట్లు, వీటిని మా ప్రభుత్వం వచ్చిన తర్వాత విడుదల చేయనుంది. గత ప్రభుత్వం నవంబర్ 2023 వరకు సుమారుగా 488.38 కోట్లు వివిధ ప్రభుత్వశాఖలకు సరఫరా గావించబడిన వస్త్రముల బకాయిలు టెస్కోకు చెల్లించవలసి ఉన్నది.

**ఎన్ని లేఖలు రాసినా ప్రజలు పట్టించుకోరు...**

గత ప్రభుత్వ హయాంలోని అవినీతి, అవలంభించిన అస్తవ్యస్త విధానాల ద్వారా జరిగిన నష్టాన్ని నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం మీద రుద్దాలని చూస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. అందులో భాగంగానే బిఆర్ఎస్ నాయకులు పూటకో మాట మాట్లడుతూ నేతన్నలను, రాష్ట్రప్రజలను తప్పుదారి పట్టించాలనుకుంటున్నారన్నారు. కానీ రాష్ట్ర ప్రజలకు మీరు చేసిన మోసాలు అన్ని తెలుసని అందుకనే ప్రస్తుతం మీకు ఈ గతి పట్టిందని మంత్రి విమర్శించారు. మీరెన్ని అబద్దాలు చెప్పినా, ఎన్ని లేఖలు రాసిన మిమ్మల్ని ప్రజలు పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. జనవరి 2024 నుండి ఇప్పటి వరకు సిరిసిల్లలో ఆత్మహత్య చేసుకున్న 6 మంది చేనేత కార్మికుల ఆత్మహత్యలపై విచారణ జరిపి అర్హులైన వారికి ఎక్స్ గ్రేషియా చెల్లించుటకు తగుచర్యలు చేపట్టడం జరుగుతుందని మంత్రి తెలిపారు. నేత కార్మికులు, మరమగ్గ కార్మికులు స్వయంసమృద్ధి సాధించుట కొరకు దీర్ఘకాలికంగా లబ్ధి చేకూరే పథకాల రూపకల్పన కొరకు చర్యలు తీసుకోవడం జరుగుతోందని అన్నారు. తాత్కాలికమైన రాజకీయ లబ్ధికోసం ఈ ప్రభుత్వం కార్యక్రమాలు చేపట్టదని కేవలం నేత కార్మికుల దీర్ఘకాలిక లబ్ధికోసమే ఈ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి పేర్కొన్నారు. తమ రాజకీయ పబ్బంకోసం వివిధ రాజకీయ పార్టీలు వారు లేనిపోని ఆరోపణలు చేస్తూ నేత కార్మికుల ఆత్మస్థైర్యము దెబ్బతీసే ప్రయత్నాలు మానుకోవాలని లేకపోతే ప్రజాజీవితంలో వారికి గుణపాఠం తప్పదని మంత్రి తెలియజేశారు.

**గతంలో నామమాత్రంగానే నేతన్న బీమా...**

గత ప్రభుత్వం నేతన్నభీమా పథకాన్ని ప్రకటించి నామమాత్రంగా కేవలం 5 కోట్లు మాత్రమే విడుదల చేశారు. ఇంకా 16 కోట్లు బకాయిల కింద విడుదల కావాల్సి ఉన్నది. తెలంగాణ రాష్ట్రంలోని 10,652 పిట్ లూమ్ లను ఫ్రేమ్ లూమ్ లుగా ఆధునికరించడానికి చేనేత మగ్గం పథకాన్ని 2023 నందు ప్రారంభించి నిధులను విడుదల చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అమలులో ఉన్న 50 శాతం పవర్ సబ్సిడీ పథకాన్ని బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసి 2016 సంవత్సరం నుండి 59 కోట్ల రూపాయలు విడుదల చేయకుండా బకాయి పెట్టింది అని మంత్రి తుమ్మల అన్నారు.

### నేతన్నకు చేయూత...

నేత కార్మికులకు పొదుపు అలవాటు కల్పించుటకు గాను నేతన్నకు చేయూత పథకం ద్వారా నేత కార్మికులు మరియు ప్రభుత్వం 1:2 నిష్పత్తిలో, 8 శాతం కార్మికుల వేతనంలో చేసిన పొదుపునకు గాను రాష్ట్రప్రభుత్వంచే 16 శాతం నిధులు విడుదల కాబడతాయి. గత ప్రభుత్వం ఈ పథకాన్ని సెప్టెంబర్ 2021లో ప్రారంభించినప్పటికి కేవలం 60 కోట్లు మాత్రమే విడుదల చేశారు. ఇవి కేవలం సెప్టెంబర్ 2022 వరకు మాత్రమే కార్మికుల పొదుపు ఖాతాలలోకి జమ కాబడినవి. అక్టోబర్ 2022 నుంచి బడ్జెట్ విడుదల కాకపోవడం వలన 77.80 కోట్ల రూపాయలు అక్టోబర్ 2023 వరకు గత ప్రభుత్వం ద్వారా ఇవ్వబడలేదు. గత ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవటం వలన 36,133 మంది చేనేత కార్మికుల పొదుపు ఖాతాలు నిలిచిపోయే అవకాశం ఉంది. నేత కార్మికులకు వేతనాలలో అదనపు వెసులుబాటు కొరకు 2018 లో చేనేత మిత్ర పథకం ప్రారంభించడం జరిగింది. ఆనాటి ప్రభుత్వం రూ. 100 కోట్లు ప్రతిపాదించడం జరిగింది. కానీ కేవలం రూ. 40 కోట్లు మాత్రమే విడుదల చేయడం జరిగింది. ఇది నేత కార్మికునికి వారి యొక్క బ్యాంకు ఖాతాలకు నేరుగా బదిలీ చేయడం జరిగినది. ఇవి 2018 నుండి మే 2023 వరకు మాత్రమే 20,501 నేత కార్మికులకు ఇవ్వడం జరిగినది. సెప్టెంబర్ 2023 నుండి ఈ పథకంలో కొంతమార్పు చేసి ప్రతి నేత కార్మికునికి రూ. 2000, అనుబంధ కార్మికులకు రూ. 1000 చొప్పున ఇవ్వడానికి సూచించడం జరిగింది. ప్రభుత్వం నుండి జూన్ 2023 వరకు మాత్రమే నిధులు విడుదల కాబడినవి. గత ప్రభుత్వంలో అక్టోబర్ 2023 వరకు రూ. 19 కోట్లు బకాయిలు ఉన్నవి.

# రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా..



**(మొదటి పేజీ తరువాయి)**

మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిశారు. హైదరాబాద్ నగరంలో రహదారుల విస్తరణ, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన రక్షణ శాఖ భూములు రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని కోరారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తొలినాళ్లలోనే రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నగరంలో ఎలివేటెడ్ కారిడార్లకు అవసరమైన రక్షణ శాఖ భూముల బదలాయించాలని కోరారు. నాడు ముఖ్యమంత్రి చేసిన విజ్ఞప్తికి స్పందించిన రక్షణ శాఖ మంత్రి పలు ప్రాంతాల్లో భూముల బదలాయింపునకు అంగీకరించడంతో నగరంలో పలు ఎలివేటెడ్ కారిడర్లకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ప్రస్తుత పర్యటనలో మరో 2,450ఎకరాల భూముల బదలాయింపు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజ్‌నాథ్ సింగ్‌ను కోరారు. ఆ భూములు రాష్ట్ర ప్రభుత్వానికి దక్కితే నగరంలో పలు ప్రాంతాల్లో రహదారుల విస్తరణతో పాటు ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు మార్గం సుగమమవుతుంది. అనంతరం కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. రాష్ట్రంలో ప్రతి పేదవాని ఇంటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుట్టినట్లు కేంద్ర మంత్రి దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పట్టణ)పీఎంఏవై (యూ) కింద కేంద్రం ఇళ్లను మంజూరు చేస్తున్నందున, తెలంగాణకు 2.70 లక్షల ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. పీఎంఏవై (యూ) కింద గ్రాంటుగా తెలంగాణకు రావల్సిన రూ.784,88 కోట్ల బకాయిలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

**వరంగల్.. కరీంనగర్ సమస్యలపైనా...**

హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలో ఇతర నగరాలైన వరంగల్, కరీంనగర్ సమస్యలపైనా కేంద్ర మంత్రి ఖట్టర్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్చించారు. స్మార్ట్ సిటీ మిషన్ కింద వరంగల్, కరీంనగర్ పట్టణాల్లో చేపట్టిన పనులు పూర్తికాలేదని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆ పనులు పూర్తయ్యే వరకు స్మార్ట్ సిటీ మిషన్ కాలపరిమితిని పొడిగించాలని కేంద్ర మంత్రిని కోరారు.

**ఎన్‌హెచ్‌ఎం బకాయిలు రాబట్టేందుకు కృషి....**

తెలంగాణలో ప్రజారోగ్య రంగంపై తమ ప్రభుత్వం పెడుతున్న ప్రత్యేక శ్రద్ధను కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి.నడ్డాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనలో రెండో రోజైన మంగళవారం కేంద్ర మంత్రి నడ్డాతో భేటీ అయ్యారు. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద తెలంగాణకు రావల్సిన బకాయిలు రూ.693.13 కోట్లు వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఆరోగ్య సేవలకు అంతరాయం కలగకుండా కేంద్రం వాటా నిధులను రాష్ట్ర ప్రభుత్వమే విడుదల చేసిందని, ఆ మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

**లోక్‌సభలో....**

లోక్‌సభలో మంగళవారం జరిగిన ఎంపీల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఎన్నికల్లో ఏ పార్టీ నుంచి గెలుపొందినా, రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా లోక్‌సభలో పోరాడాలని ఎంపీలకు సూచించారు. ప్రమాణ స్వీకారం చేసిన ఎంపీలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయ వైరుధ్యాలు వేరు, రాష్ట్ర ప్రయోజనాలు వేరు అనే గుర్తించి ముందుకు సాగాలని, రాష్ట్ర ప్రయోజనాల సాధనకు పార్లమెంట్‌ను వేదికగా చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంపీలకు సూచించారు.

### మూసీ రివర్ ఫ్రంట్... మెట్రో రైలు..

హైదరాబాద్ నగరానికి ఒకనాడు జీవనాడిగా ఉన్న మూసీ నది ప్రస్తుతం మురికి కూపంగా మారిపోయింది. మూసీ కాలుష్యంతో నగరంతో పాటు ఉమ్మడి నల్గొండ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూసీ ప్రక్షాళనను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూసీ రివర్ ఫ్రంట్‌కు కృతనిశ్చయంతో ఉన్నారు. ఇప్పటికే లండన్‌లో థేమ్స్ నది రివర్ ఫ్రంట్‌ను పరిశీలించారు. మూసీని ప్రక్షాళన చేయడంతో పాటు నది ఒడ్డున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి స్థానికులకు ప్రయోజనం చేకూర్చేలా తీర్చిదిద్దుతామని, ఇందుకు సహకరించాలని కోరారు. నగరంలో మెట్రో రైలు విస్తరణకు సహకరించాలని కేంద్ర మంత్రిని కోరారు. పాతబస్తీ మీదుగా మెట్రో రైలు విస్తరణకు సంబంధించిన అంశాలపై కేంద్ర మంత్రితో ఆయన చర్చించారు. ఈవిషయంలో తమకు చేయూతనివ్వాలని కోరారు.

# హెల్ప్ ప్లీజ్..

**విశ్వంభర, హైదరాబాద్ :** నీట్ పేపర్ లీక్ కేసులో తెలంగాణ సీఐడీ సహకారం కోరింది సీబీఐ. 2016లో తెలంగాణ ఎంసెట్ పేపర్ లీక్ అయ్యింది. తెలంగాణ ఎంసెట్ పేపర్ లీక్ కేసులో బీహారీ గ్యాంగ్ సభ్యులు నిందితులుగా ఉన్నారు. ఇప్పుడు నీట్ పేపర్ లీక్ కేసులోనూ బీహారీ గ్యాంగ్ కీలక పాత్ర పోషించింది. రెండు కేసులకు సారూప్యత ఉండటంతో సీఐడీ నుంచి వివరాలు తీసుకుంటున్నారు సీబీఐ అధికారులు. ఎంసెట్ కేసులో 200 మందికిపైగా విద్యార్థులకు ముందే పేపర్ లీక్ చేసింది బీహారీ గ్యాంగ్. నీట్ పరీక్ష పేపర్ లో ఇదే తరహాలో లీక్ చేసింది బీహారీ గ్యాంగ్. ఎంసెట్ పేపర్ లీకేజీ కేసు నిందితుల వివరాలను సీఐడీ నుంచి సేకరిస్తోంది సీబీఐ. నీట్ పరీక్ష పేపర్ లీక్ దేశంలో తీవ్ర సంచలనంగా మారింది. నీట్ పరీక్ష పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతోంది. ప్రతిపక్షాలు కేంద్రాన్ని టార్గెట్ చేశాయి. కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఈ క్రమంలో పేపర్ లీక్ వ్యవహారంలో సీబీఐ దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ కేసులో 10మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. 2016లో తెలంగాణ ఎంసెట్ పేపర్ లీక్ కేసులో సీబీఐ అధికారులు 83మందిని అరెస్ట్ చేశారు. ఇటీవలి కాలంలో చార్జిషీటు కూడా దాఖలు చేశారు. 2016లో తెలంగాణ రాష్ట్రంలో ఎంసెట్ పేపర్ ఏ విధంగా లీక్ అయ్యిందో.. అదే తరహాలో నీట్ పరీక్ష కూడా లీక్ అయినట్లు సీబీఐ అధికారులు కొన్ని ఆధారాలు సేకరించారు. ఇందులో భాగంగానే సీబీఐ అధికారులు తెలంగాణ సీఐడీ అధికారుల సహకారం తీసుకున్నారు. గతంలో ఎంసెట్ పేపర్ లీక్ స్కామ్ కు సంబంధించిన వివరాలు కావాలని సీబీఐ అధికారులు సీఐడీ పోలీసులకు విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. ఎంసెట్ పేపర్ లీక్ కేసులో బీహారీ గ్యాంగ్ పాత్ర ఉందని, సింగ్ అనే వ్యక్తి కీలక సూత్రధారిగా ఉన్నాడు, అతడు ఎక్కడి నుంచి పేపర్స్ తీసుకొచ్చాడు? ఎవరెవరు ఏజెంట్లుగా ఉన్నారు? ఎవరెవరు కమిషన్లు తీసుకున్నారు? ఈ వివరాలన్నీ సీబీఐ అధికారులు కోరారు.

## నయవంచనకు ప్రతిరూపమే కాంగ్రెస్

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రజాస్వామ్యంపై అదే దాడిని కొనసాగిస్తూనే ఉంది. ఓవైపు రాజ్యాంగ పరిరక్షణ అంటూ పార్లమెంట్ లో రాజ్యాంగ కాపీలను ఆ పార్టీ నేతలు చేత పట్టుకొని ప్రదర్శన చేస్తారు. మరోవైపు అదే పార్లమెంట్ కు కొద్ది దూరంలోనే ఉన్న వాళ్ల పార్టీ ఆఫీస్ లో రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాసే విధంగా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తారు. ఏ రాజ్యాంగం గురించి మాట్లాడతారో.. అదే రాజ్యాంగ స్ఫూర్తినే దెబ్బతీసేలా వ్యవహరించే కాంగ్రెస్ పార్టీ హిపోక్రసీ చూస్తుంటే ఆవేదన కలుగుతోంది. నయవంచనకు ప్రతిరూపమే కాంగ్రెస్" అని ట్వీట్ చేశారు కేటీఆర్.



## వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి పనులు

# త్వరలో పూర్తి చేయాలి

### ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**విశ్వంభర, ఎల్బీనగర్ :** రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని నియోజకవర్గ పరిధిలో జరుగుతున్నటువంటి అభివృద్ధి పనులు యుద్ధపాధి పథకంగా పూర్తి చేయాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి వెల్లడించారు. మంగళవారం ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాల మీద జిహెచ్ఎంసి అధికారులచే క్యాంప్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్నటువంటి మురికి నీటి కాలువలలో పేరుకుపోయిన సిల్ట్ తీయించాలని వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ఇటు అధికారులకు నాకు బాధ్యత ఉన్నదని ఈ విషయంపై ఇటీవల జిహెచ్ఎంసి చీఫ్ ఇంజనీర్ జియా ఉద్దిన్‌ను కలవడం జరిగిందని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి వెల్లడించారు. కనుక నియోజకవర్గ పరిధిలోని ఇతర అధికారులతో సమన్వయం చేసుకొని పనులు చేపట్టాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. మురికి కాలువలో తీస్తున్నటువంటి చెత్తాచెదారం వలన ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీపై ఎంతో ఉండదని గతంలో నిర్మించిన ఎస్ ఎన్ డి పి, బాక్స్ డ్రైన్స్ ట్రంక్ లైన్స్ నిర్మాణ పనుల వలన మంచి సత్ఫలితాలు వచ్చాయని సుధీర్ రెడ్డి వెల్లడించారు. కాలనీలలో నిర్మిస్తున్నటువంటి సిసి రోడ్లు ఎత్తుపల్లాలని సరిగా చూసుకొని రోడ్లు వేయాల్సిన బాధ్యత మీపై ఉన్నదని సుధీర్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు రమేష్ బాబు, దామోదర్ రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేసే

# దిశగా అభివృద్ధి పనులు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్



**విశ్వంభర, గద్వాల :** జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేసే దిశగా అభివృద్ధి పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. మంగళవారం రాష్ట్ర మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ జిల్లా కలెక్టర్లు, సంక్షేమ శాఖ అధికారులతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అన్ని జిల్లాలలో గల అంగన్వాడీ కేంద్రాల పేర్లను పూర్వ పాఠశాలగా మార్చాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలకు అవసరమైన మరమ్మతులు చేపట్టి కలరింగ్, పెయింటింగ్ పనులు చేయించా లని తెలిపారు. అంగన్వాడి కేంద్రాలను బలోపేతం చేసే దిశగా పిల్లలకు మంచి పౌష్టికాహారం తో పాటు యూనిఫారాలు అందజేయాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ సంబంధిత అధికారులతో మాట్లాడు తూ...అంగన్వాడీ కేంద్రాల పేర్లను పూర్వ పాఠశాలలుగా వెంటనే మార్చాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల్లో 3 నుండి 6 సంవత్సరాల లోపు పిల్లలకు మంచి విద్య అందించేందుకు అంగన్వాడి టీచర్లకు ట్రేట్కనర్లచే శిక్షణ తరగతులు నిర్వహిం చాలని సూచించారు. జిల్లాలోని దాదాపు 8,500 అంగన్వాడి కేంద్ర విద్యార్థులకు యూనిఫారాలు అందించేందుకు డి.ఆర్.డి.ఓ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల ద్వారా యూనిఫారాలు కుట్టించి మూడు రోజులలో అందజేయాలన్నారు. జిల్లాలో పిల్లలకు పౌష్టిక ఆహారం అందించే విధంగా న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం సర్వేను వేగవంతంగా 100 శాతం పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే జిల్లాలో 60 శాతం సర్వే పూర్తయిందని తెలిపారు. జిల్లాలో వయోవృద్ధులకు అవసరమైన ఒక ఓల్డ్ ఏజ్ హోమ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు వెంటనే సమర్పిం చాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారిని సుధారాణి, సిడిపిఓలు, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.



## పేకాటరాయుళ్ల అరెస్ట్ 12 మంది పై కేసు

**విశ్వంభర, మోత్కూరు:** మున్సిపల్ కేంద్రంలో ఒక ఇంట్లో పేకాట ఆడుతున్న విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం సాయంత్రం దాడి చేసి పేకాట ఆడుతున్న 12 మందిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు మోత్కూరు ఎస్ఐ ఎం రెడ్డి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఇందిరా నగర్ సమీపంలోని అన్నెపు మురళి ఇంటి నందు పేకాట ఆడుతుండగా పట్టుకొని వారి వద్ద నుండి 27040/- రూపాయల నగదు, 5 మోటార్ సైకిల్ లను సీజ్ చేయడం జరిగిందని ఎస్ఐ పేర్కొన్నారు.



## విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలి

### ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**విశ్వంభర, వర్ధన్నపేట :** విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి బావి తరాలకు ఆదర్శంగా నిలవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో పర్యటన సందర్భంగా రోడ్డు మార్గంలో వెళుతూ ఆకస్మికంగా ప్రభుత్వ గిరిజన బాలికల పాఠశాలను సందర్శించారు. అనంతరం విద్యార్థుల భోజనశాల ను పరిశీలించారు. బాలికలకు మరింత మెరుగైన విద్యను అందించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు తెలిపారు. పదవ తరగతి బాలికలతో ముచ్చటించారు. ఈ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ రచయిత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మార్గంలో పయనిస్తూ ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొని రావాలని కోరారు. ఒకసారి పరీక్షల్లో తప్పితే మరల ప్రయత్నించాలి తప్ప ఆత్మహత్యల దృశ్య పోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ లీగల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, వర్ధన్నపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆబ్బిడి రాజిరెడ్డి, మండలాధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, జిల్లా నాయకులు పోశాల వెంకన్న గౌడ్, ఏకలవ్య చైర్మన్ రాయపురం సాంబయ్య తో పాటు పాఠశాల సంబంధిత విద్యార్థినీలు పాల్గొన్నారు.



## ఆక్టీవాలో పెట్టిన డబ్బులు మాయం

**విశ్వంభర, భీంగల్:** అవసరం నిమిత్తం తన బ్యాంకు అకౌంట్ లో ఉన్న రెండు లక్షలు డ్రా చేసుకొని నగదు తన హోండా ఆక్టీవా డిక్కీలో పెట్టగా బస్టాండ్ లో మాయమైన సంఘటన భీంగల్ లో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కమ్మర్ పల్లి మండలం కొనసాముందర్ గ్రామానికి చెందిన కొప్పెర సాంబయ్య తన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ లోని అకౌంట్ నుంచి రూ. 2 లక్షలు విత్ డ్రా చేసాడు. అట్టి నగదును తన టూవీలర్ హోండా ఆక్టీవా డిక్కీలో పెట్టుకొని స్థానిక బస్టాండ్ కు వచ్చాడు. బస్టాండ్ ఆవరణలో గల ఓ ఎలక్ట్రికల్ షాప్ వద్ద ఆగి తన పని పూర్తి చేసుకుని అక్కడ నుండి మళ్ళీ బైక్ పై కొబ్బరి బొండాల దుకాణం వద్ద ఆగాడు. అక్కడ బొండం త్రాగి తన డబ్బులను ఒక్కసారి చెక్ చేసుకుందామని డిక్కీ లాక్ తీసి చూడగా అందులో ఉంచిన డబ్బులు కాస్త మాయమవడం తో బాధితుడు లబోదిబోమని మొత్తుకున్నాడు. విషయాన్ని భాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసాడు. బాధితుని ఫిర్యాదు స్వీకరించిన ఏఎస్సై చిరంజీవి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఎస్బీఐ లోని సీసీ ఫుటేజ్ లను పరిశీలించారు. డబ్బులు డ్రా చేసేటప్పుడు బ్యాంక్ లో పక్కన, లోపల ఎవరున్నారు. ఎవరు పరిశీలిస్తున్నారు, భాధితుడు బయటికి వెళ్ళినప్పుడు ఎవరు వెళ్లారు. ఆయన్ని ఎవరు ఫాలో చేశారన్న దాన్ని పోలీసులు సీసీ ఫుటేజ్ ల సహాయంతో పరిశీలిస్తున్నారు.



## పశువులు, గొర్రెలు, మేకలకు వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించాలి

### పశుసంవర్ధక శాఖ సమీక్షలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**విశ్వంభర, రాజన్న సిరిసిల్ల :** వర్షాకాలం నేపథ్యంలో పశువులు, గొర్రెలు, మేకలకు వచ్చే వ్యాధులపై పెంపకందారులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. పశుసంవర్ధక శాఖ పై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాలులో పశుసంవర్ధక శాఖ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పాడి పరిశ్రమ, పాడి ఉత్పత్తులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం నేపథ్యంలో పశువులు, గొర్రెలు, మేకలకు వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించాలని, రోగాల నివారణకు వ్యాక్సిన్లు, మందులు అందుబాటులో ఉంచాలని, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కొమురయ్య, ఏడి డా.రమణ మూర్తి, డా. అంజిరెడ్డి ఇతర వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు పాఠశాలలు బంద్ :ఏబీవీపీ

**విశ్వంభర, నాంపల్లి :** జూన్ 12వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా స్కూల్స్ రీ ఓపెన్ అయిన విషయం తెలిసిందే. గవర్నమెంట్ స్కూల్స్‌లో మొదటిరోజే 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు టెక్స్ బుక్స్, వర్క్ బుక్స్ పంపిణీ చేశారు. ముందుమాటలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేరు మార్చకుండానే ముంద్రించడంతో%ా% పంపిణీ చేసిన పుస్తకాలను వెనక్కి తీసుకున్నారు. ముందు మాట మార్చి మళ్లీ తిరిగి పుస్తకాలు పంపిణీ చేయనున్నారు. అయితే జూన్ 26న పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చింది ఏబీవీపీ. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల అక్రమ ఫీజులను అరికట్టి ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ పాఠశాలలకు బంద్‌కు పిలుపునిస్తున్నట్లు తెలిపింది. పాఠశాల విద్యలో నెలకొన్న ఇతర సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ జూన్ 26న పిలుపునిచ్చి పాఠశాలల బంద్‌కు అందరూ సహకరించాలని కోరింది. డీఈఓ, ఎంఈఓ పోస్టులు భర్తీ చేయకుండా%ా% పాఠశాల విద్య పర్యవేక్షణ ఎలా సాధ్యమో చెప్పాలని.. ఏబీవీపీ డిమాండ్ చేస్తోంది.








## తిరుమల తిరుపతి దేవస్థానంలో

# భక్తుల అగచాట్లు

కోరిన కోర్కెలు తీర్చే కోనేటి రాయుడు కలియుగ వైకుంఠ దైవం శ్రీనివాసులుని దర్శించుకోవాలంటే ప్రతి ఒక్కరికి కష్టతరంగా మారింది. ఉచిత దర్శనానికి 24 గంటల నుండి 36 గంటల వరకు క్యూ లైన్ లలో దాదాపుగా ఐదు నుండి పది కిలోమీటర్లు నడవడం కాంప్లెక్స్ లో కూర్చోవడం జరుగుతుంది.దివ్య మంగళ రూపాన్ని చూడడానికి మూడు నాలుగు సెకండ్లు మాత్రమే పశువుల కన్నా హీనంగా చూస్తున్న విజిలెన్స్ డిపార్ట్మెంట్ 58, 59 సంవత్సరాలు ఉన్నవారికి మరియు సీనియర్ సిటిజన్ వర్తించదు, సంవత్సరం దాటిన 13 నెలల పాప, బాబు కు సుపదం వర్తించదు. కాళ్ళ వేళ్ళ పడ్డ కనికరించని ఉద్యోగులు, సిజేరియన్ , హార్ట్ ఆపరేషన్లు జరిగి బ్రతికి బయటపడ్డ వారు మొక్కులు తీర్చుకోవాలని వెళితే ప్రత్యేక దర్శనాలు అంటూ ఏవీ లేవు క్యూలైన్ మధ్యలో నుండి దైవ దర్శనం చేయకుండానే వెళ్లవలసి వస్తుంది. ముఖ్యంగా హోటల్స్ లో తిన్న, షాపింగ్ మాల్స్ లలో ఏది కొన్నా కొన్న నిలువు దోపిడీ చేస్తున్నారు. భక్తులు ఇచ్చే కానుకల పై ఉన్న శ్రద్ధ భక్తులకు సౌకర్యాలు చేపట్టడంలో తిరుమల తిరుపతి దేవస్థానం అధికారుల నిర్లక్ష్యమే కనిపిస్తుంది. ఇకపై కొండపైకి వెళ్లే బస్సులు, ఏసీ బస్సులను ఏర్పాటు చేసిన ఏపీఎస్ఆర్టీసీ టికెట్టుతో సహా వాంటింగ్స్ (వాంతుల )కొరకు ప్లాస్టిక్ కవర్ ని ఉచితముగా ఇస్తున్నది. ఏసీ పడకపోవడం అత్యధిక మూలమలుపులు ఉండడం వల్ల ఏసీ బస్సు ప్రయాణం మహాదుర్భరంగా ఉన్నది. అలాగే ప్రయాణికుల ప్రాణాలకు గ్యారెంటీ లేని బస్సులు, ఎప్పుడైనా ప్రమాదం జరుగుతే ఉపయోగించవలసిన ఎమర్జెన్సీ డోర్లకు అదనముగా వైర్లతో బంధించారు. ప్రమాదము సంభవిస్తే అంతే సంగతులు సెక్యూరిటీ చెకింగ్ నామ మాత్రమే. ఎవరైనా ఏమైనా తీసుకుపోవచ్చు స్కానర్లు పనిచేయడం లేదు నిత్యం లక్షల మంది వచ్చే తిరుమల తిరుపతి దేవస్థానం భక్తుల భద్రతను గాలికి వదిలేసిందనే చెప్పుకోవచ్చు. తిరుమల కొండ పై అన్య మతస్తులు కూడా విచ్చలవిడిగా కనిపిస్తున్నారు .

నూతనంగా ఎన్నికైన టిటిడి బోర్డు ఈ. ఓ పలు సమస్యలపై దృష్టి సారించి భక్తుల వైకుంఠపురం అయినా తిరుమల కొండకు వందల సంఖ్యలో ఉన్న వీఐపీల కంటే నిత్యం లక్షలాదిమంది సామాన్య భక్తులు రావడానికి సౌకర్యాలు కల్పించవలసిందిగా భక్తుల విన్నపం. పూర్వపు రోజులలో మనులు మాన్యాలు స్వామివారికి సమర్పించిన వారిని రాజ పోషకులు, మహారాజ పోషకులు అని ప్రత్యేక దర్శనాలు ఇచ్చేవారు. ఇప్పుడున్న కాలంలో విఐపి పేరుతో అడ్డమైన ప్రతి వారు స్పెషల్ దర్శనాలు చేసుకోవడం పరిపాటి గా మారింది

పవిత్రమైన తిరుమల కొండపై సబ్ కుచ్ మిల్ తా హై తిరుపతి శ్రీవారి పాదాలు వద్దనుండి తిరుమలకు వెళ్ళు నడకదారి లో పటిష్టమైన సెక్యూరిటీ చెకింగ్ లేనందున ఏమైనా తీసుకు వెళ్ళవచ్చు అని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

ఆన్లైన్ బుకింగ్ మన తెలుగు రాష్ట్రాలలో అంతగా చదువుకొని స్మార్ట్ ఫోన్లు మెయింటెన్ చేయువారు 40% మాత్రమే. 60 శాతం మంది డబ్బా ఫోన్లు ఆన్లైన్ పరిజ్ఞానం లేని వారు తిరుమల వచ్చి నానా కష్టాలు పడుతున్నారు. జిల్లాస్థాయి, డివిజన్ స్థాయి పట్టణాలలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి కళ్యాణ మండపాలు ఆన్లైన్ బుకింగ్ సెంటర్లు ఉన్నా రోజులలో చాలామంది ప్రజలు వినియోగించుకున్నారు. ఏ కారణం చేతనయినా వాటిని తిరుమల తిరుపతి దేవస్థానం నడపడం లేదు. కొన్ని కొన్ని కళ్యాణ మండపాలు శిథిలావస్థకు చేరాయి. వాటిని పట్టించుకునే నాధుడే లేడు కొత్తగా ఎన్నికైన టిటిడి బోర్డు సభ్యులు తిరుమల తిరుపతి ఆస్తులను కాపాడుచూ భక్తులకు అసౌకర్యం కలగకుండా వారి మదిలో నిత్యం శ్రీ వెంకటేశ్వరుడు మెదిలేలా చూడాలని సామాన్య భక్తుల విన్నపం.

**ధర్మో రక్షతి రక్షత**

**- రవి రాజ్ మెట్పల్లి**

## మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీజీకి

# బహిరంగ లేఖ

**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేలు,ఎంపీలు, ఎమ్మెల్సీ లు వంటి ప్రజా ప్రతినిధుల పార్టీ మార్పులను ప్రోత్సహిస్తూ, న్యాయపత్రను పరిగణలోకి తీసుకోకుండా, భారత రాజ్యాంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ డా. బీఆర్ అంబేద్కర్ చట్టాన్ని ధిక్కరిస్తున్నారు. రేవంత్ రెడ్డి ఈ రాజ్యాంగ వ్యతిరేక చర్యలను నియంత్రించడం మరియు నిలుపుదల చేయడం బదులు, మీరు ఇద్దరు ఈ defections కి మద్దతు తెలుపుతూ, defections ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని సమావేశమై మద్దతు, ఐక్యత చూపారు.**

నేను మిమ్మల్ని గుర్తు చేయదలచిన 13వ ప్రామిస్ న్యాయపత్రలో స్పష్టంగా చెప్పబడింది: "మేము రాజ్యాంగంలోని పద్దెనిమిదవ షెడ్యూల్ ను సవరించి, ఎమ్మెల్యే లేదా ఎంపీ ఎన్నికైన అసలు పార్టీని విడిచిపెట్టినప్పుడు, అసెంబ్లీ లేదా పార్లమెంట్ సభ్యత్వానికి స్వయంచాలక డిస్క్వాలిఫికేషన్ చేస్తామనే వాగ్దానం చేస్తున్నాము." ఈ ఘన వాగ్దానాన్ని రేవంత్ రెడ్డి బహిరంగంగా ప్రజా ప్రతినిధుల defections ను ప్రోత్సహించడం ద్వారా నిర్లక్ష్యం చేస్తున్నారు.

ఇది న్యాయపత్రకు వ్యతిరేకంగా ఉండడమే కాకుండా, దాని ప్రధాన విలువలు మరియు నైతికతలను నిర్లక్ష్యం చేయడం. రాహుల్ గాంధీ మరియు మల్లికార్జున ఖర్గే జీ ఇలాంటి చర్యలకు మద్దతు తెలపడం ద్వారా ఈ సమస్యను మరింత గందరగోళానికి గురిచేస్తోంది, పార్టీ తన స్వంత విలువలపై వాస్తవపరంగా నిలబడలేదని ప్రశ్నలను లేవనెత్తుతోంది.

మహాత్మా గాంధీ చెప్పినట్లుగా, "ప్రజాస్వామ్యం యొక్క మూలం ప్రతి పౌరుడికి స్వేచ్ఛ మరియు సమానత వాణి హామీ ఇచ్చే సామర్థ్యం." అయినప్పటికీ, రేవంత్ రెడ్డి defections ను బహిరంగంగా ప్రోత్సహించడం ద్వారా ఈ మూలాన్ని దిగజారుస్తూ, ప్రజల నియమాన్ని వెక్కిరిస్తున్నారు. ఏదైనా ప్రజా ప్రతినిధి, ఎమ్మెల్యేలు లేదా ఎంపీ లు, రేవంత్ రెడ్డి విధానాలను మెచ్చుకుంటే, వారు తమ అసలు పార్టీని విడిచి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రాజ్యాంగ స్వేచ్ఛను కలిగి ఉంటారు. అయితే, ఇది తమ అసలు పార్టీ ప్రాథమిక సభ్యత్వం మరియు ఆ పార్టీ సభ్యుడిగా ఉన్న ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడం ద్వారా ప్రాథమిక సమర్థనతో చేయాలి. లేనిపక్షంలో, రేవంత్ రెడ్డి ప్రోత్సహిస్తున్న రాజకీయ defections ను రాజ్యాంగ నేరాలుగా చూడాలి, మరియు వాటిని తగ్గించాలి.

మీ పార్టీ మీ ఎంపీలను ఇతర పార్టీలకు defections చేస్తే మీ పార్టీకి నైతిక అధికారం ఏమి ఉంటుంది?

రాజీవ్ గాంధీ ఒకసారి "Defections ప్రజల నియమాన్ని విరోధించటం మరియు ప్రజాస్వామ్య ప్రక్రియను దిగజార్చటం" అని అన్నారు. అయినప్పటికీ, ఈ రాజ్యాంగ వ్యతిరేక చర్యలు ఎమ్మెల్యేలను ఆకర్షించటం ద్వారా, దివంగత రాజీవ్ గాంధీ ప్రోత్సహించిన ప్రజాస్వామ్య సూత్రాలను తీవ్రంగా విరోధించాయి. TPCC అధ్యక్షునిగా ఉన్నప్పుడు, రాజకీయ defections ను తీవ్రంగా విమర్శించిన మరియు అన్ని defections ఎమ్మెల్యే లపై రాళ్లతో దాడి చేయాలని పిలుపునిచ్చిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు ఆయన మునుపు విమర్శించిన చర్యలను అనుసరిస్తున్నారు.

ఈ అన్యాయపద్ధతులు, ఆయన రాజీవ్ గాంధీ నియమించిన రాజకీయ అవకాశవాదాలను నిరోధించటానికి రూపొందించిన చట్టపరమైన చర్యలను గౌరవించడంలో తన గౌరవాన్ని చూపుతాయి.

భారత రాజ్యాంగంలోని పద్దెనిమిదవ షెడ్యూల్ ప్రకారం, ఒక ఎమ్మెల్యే లేదా ఎంపీ మరో రాజకీయ పార్టీలోకి మారితే, స్వయంచాలకంగా డిస్క్వాలిఫికేషన్ గా ఉంటుందని స్పష్టం చేయబడింది. అయినప్పటికీ, ఖైరతాబాద్ అసెంబ్లీ నుండి ప్రస్తుత బిఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్, సికింద్రాబాద్ పార్లమెంట్ కు భారత జాతీయ కాంగ్రెస్ టికెట్ పై పోటీచేయడానికి తయారు చేయబడ్డారు. మరొక నాలుగు ప్రస్తుత ఎమ్మెల్యే లు, అందుకే, మల్లికార్జున ఖర్గే , పోచారం శ్రీనివాస్ రెడ్డి, టి. వెంకట్ రావు, మరియు మరికొందరు ఎమ్మెల్సీ లు, ఎంపీ లు మరియు ఇతర బిఆర్ఎస్ సభ్యులు నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ద్వారా భారత జాతీయ కాంగ్రెస్ లో చేరేలా చేశారు. ఈ స్పష్టమైన ఉల్లంఘనల క్షమించటానికి, అన్ని భారత జాతీయ కాంగ్రెస్ కమిటీలు, లేదా ఎన్నికల కమిషన్ లేదా తెలంగాణ శాసనసభ స్పీకర్ చర్య తీసుకోలేదు, ఈ రాజ్యాంగాల యొక్క దుర్వినియోగాన్ని నివారించటానికి మరియు ఈ అన్యాయపద్ధతులపై కళ్ళు మూసుకోవటానికి ప్రతిరూపాలు ఇచ్చారు.

రాజకీయ defections ను ప్రోత్సహించడం ద్వారా, రేవంత్ రెడ్డి తెలంగాణ రాజకీయాలను ఒక అనైతిక వ్యాపార వ్యవస్థగా మార్చుతున్నారు, సామాజికరాజకీయ ప్రశాంతత మరియు రాజ్యాంగ బాధ్యతను నాశనం చేస్తున్నారు, ఈ చర్యలను భూతకాలంలో జరిగిన defections ను సమర్థిస్తూ అన్యాయపద్ధతులను సమర్థించటానికి దుర్వినియోగం చేస్తున్నారు. అదనంగా, పార్టీ లో తనకున్న బలాన్ని పెంచుకోవటానికి, ఇతర పార్టీల నుండి ఎన్నికైన ఎమ్మెల్యే లను defections చేసి, పార్టీ యొక్క క్రమం మరియు పాత నాయకత్వాన్ని, ముఖ్యంగా అఖండ విధేయతతో ఉండిన సీనియర్ నాయకులు మరియు పాత క్యాడర్ ను నిర్లక్ష్యం చేస్తున్నారు.

తదుపరి, ఆయన చేసిన ఎన్నికల వాగ్దానాలను పూర్తి చేసి, ప్రభుత్వాన్ని మరియు ప్రజా సేవను బలపరచటానికి బదులుగా, రేవంత్ రెడ్డి రాజ్యాంగ వ్యతిరేక చర్యల్లో పాల్గొంటున్నారు, రాజకీయ ప్రత్యర్థులను అస్థిరంగా చేయటం మరియు ప్రజల దృష్టిని తప్పిస్తున్నారు. ఈ defections మరియు ద్రోహ రాజకీయ వ్యూహాలు గాంధీ మరియు నెహ్రూ తత్వాలకు వ్యతిరేకంగా ఉన్నాయి.

ఎన్నికలు వస్తాయి పోతాయి; పార్టీలు వస్తాయి పోతాయి; నాయకులు వస్తారు పోతారు; కానీ రాజ్యాంగ విలువలు మరియు రాజకీయ నైతికతలు శాశ్వతంగా నిలవాలి. మనం అలా చేయకపోతే, భవిష్యత్తు తరాలకు తప్పుడు ప్రతిరూపాలను స్థాపించిన దోషంతో నిలబడతాం. డా. బి. ఆర్. అంబేద్కర్ తెలివిగా చెప్పారు, "రాజ్యాంగం ఎంత మంచిదైనా, దాన్ని అమలు చేసే వారు మంచివారు కాకపోతే, అది చెడు ఉంటుంది. రాజ్యాంగం ఎంత చెడ్డదైనా, దాన్ని అమలు చేసే వారు మంచివారు అయితే, అది మంచి అవుతుంది."

కావున, మీరు ఇద్దరూ పార్టీ మరియు రాజ్యాంగ సంబంధిత ప్రాథమిక సూత్రాలను ఉల్లంఘించే చర్యలకు మద్దతు ఎలా ఇస్తారో ప్రశ్నించడం అత్యవసరం. ఈ మద్దతు న్యాయపత్రను మరియు మా ప్రజాస్వామ్యానికి పునాదిని దెబ్బతీస్తుంది. ఈ తప్పులను సవరించటం మరియు రాజ్యాంగ విలువల పట్ల మా నిబద్ధతపై నమ్మకాన్ని పునరుద్ధరించడం అత్యవసరం.

ఈ బాధ్యత ఇప్పుడు మీరే తీసుకోవాలి, న్యాయపత్ర పూర్ణతను కాపాడాలి, భారత రాజ్యాంగ తాత్త్వికతను మరియు ప్రజాస్వామ్య విలువలను తెలంగాణ లో పునరుద్ధరించాలి. మీ చర్యలు మా పార్టీ ఎలా పరిగణించబడుతుందనే విషయాన్ని నిర్ణయిస్తాయి మరియు మనం మా సూత్రాల పై నిలబడి ఉన్నామో లేదా రాజకీయ సౌలభ్యం పై పడిపోయామో నిర్ణయిస్తాయి.


ధన్యవాదాలు & శుభాకాంక్షలు,



**-డా. శ్రవణ్ దాసోజు,**
**బిఆర్ఎస్ , హైదరాబాద్**

# సాహిత్య ప్రభావం దృష్టికోణం రచనా సామర్థ్యం

> సాహిత్యం పాఠకులపై ప్రభావం వేస్తుంది. వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతుంది. చాలామంది విద్యావంతులు, మేధావులు పుస్తకాలు తీర్చిదిద్దిన మనిషిని నేను అని చెప్తుంటారు. గోర్కీ రాసిన 'అమ్మ' నవల చదివి ఎందరో ఉద్యమాల్లోకి నడిచారు. తెలంగాణ సాధన పాటలు, ప్రసంగాలు, దళిత బహుజన పాటలు, ప్రసంగాలు, విప్లవ పాటలు, ప్రసంగాలు విని, కథలు, నవలలు చదివి లక్షలాది మంది ప్రభావితులయ్యారు. ఉద్యమాల్లోకి ఉరికారు. ఇలా సాహిత్యం బలమైన ప్రభావం వేస్తుంది. ఇలా సాహిత్యానికి ఒక ప్రయోజనం ఉంటుంది. ప్రయోజనం లేని సాహిత్యం కాలక్షేప సాహిత్యం. కాలక్షేపం కూడా ఒక ప్రయోజనమే. సాహిత్యంలో జీవితం ఉంటుంది. మానవ సంబంధాలు ఉంటాయి. సెంటిమెంట్స్ ఉంటాయి. కష్టాలు, కన్నీళ్లు ఉంటాయి. పాఠకుల్లో, ప్రేక్షకుల్లో ఎలాంటి స్పందనలు కలిగించాలో అనే దృష్టికోణం ఉంటుంది. ఉండాలి. అలా సాహిత్య ప్రయోజనంలో జీవితాన్ని చూపే దృష్టికోణం ఉంటుంది.



సాహిత్య ప్రయోజనం గురించి చూసే చూపు ప్రధానంగా పాఠకులవైపు నుండి, సమాజంవైపు నుండి చూసే చూపు రచన రచయిత సామర్థ్యాన్ని బట్టి వుంటుంది. వస్తువు గొప్పదైనపుడు రచయిత సామర్థ్యం చాలకపోతే ఫేలవుతుంది. సాహిత్య విలువలు సౌందర్యాత్మకత అనేవి ఈస్థటిక్స్ కోణంలో పరిశీలన. జీవిత వాస్తవికత ఏమేరకు వుంది అని చూడడం మరో పద్ధతి. జీవిత వాస్తవికత ఎలా వున్నదో చెప్పడంతోపాటు ఎలా వుంటే బాగుంటుందో అని ఆదర్శ చిత్రణ సోషలిస్టు వాస్తవికత. భయానక, బీభత్స సంఘటనలు, మరిచిపోవాల్సిన రేపులు చిత్రహింసలు అంతే భీతావహంగా చిత్రిస్తే ఆ దశ ఊహించే, ఎదురయ్యే పాఠకులు భయంతో వణికిపోతారు. దయ్యాలు భూతాల కథలు చదివి పిరికివాల్లయిన వారున్నారు. ఇవన్నీ సామాజిక చరిత్ర, సంస్కృతి, సెంటిమెంట్స్, మానవ సంబంధాల పరిణామాల చిత్రణ, సాహిత్య ప్రయోజనం అనే సంశ్లేషణతో కూడి ఉంటాయి.

**ఆత్మాశ్రయ సబ్జెక్టు విజం**

ఆత్మాశ్రయంగా తన భావాలు అనుభవాలు అనే దృష్టికోణంతో రాయడం మరొక రీతి. దళితవాదులు, స్త్రీవాదులు, బహుజనవాదులు మొదలైనవాళ్లు ఇతరుల భావాలు అనుభవాలు స్వీకరించి వారి ప్రతినిధిగా రాయడం మరొక తీరు. ఈ అనుభవాలు నావి అంటే ఆత్మాశ్రయం. సబ్జెక్టివ్ థింకింగ్ దృష్టి కోణం. నా వంటి వాల్లందరివి అన్నపుడవి ఆ వర్గ వ్యక్తీకరణ. నా బాధ నీకు తెలియదు అంటే పాఠకుడు అర్థం చేసుకోవడం కష్టం. కనక ఆ రచన అలాంటి పాఠకుల కోసం రాయబడలేదు. అలాంటి అనుభవాలున్నవాళ్లే అర్థం చేసుకోగలరు. కనక ఆ సాహిత్యం అందరికోసం కాకుండా తమ వంటి వారికోసం తమ వర్గం, కులం, లింగం, ప్రాంతం తమ వంటి సిచ్యువేషన్లో ఉన్నవారికి పరిమితం ఆ రచన. దళిత సాహిత్యం, తెలంగాణ రాష్ట్ర సాధన సాహిత్యం, స్త్రీవాద సాహిత్యం, బహుజన సాహిత్యం తమలో తాము, తమ కొరకు తాము రాసుకోవడం ఒక పద్ధతి. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమలో తాము స్ఫూర్తి, చైతన్యం పొందడం కోసం రాస్తే అదొక కర్తవ్యం. అలాగే కుల సంఘాలు, దళిత సంఘాలు, స్త్రీవాద సంఘాలు తమలో తాము తమ కొరకు తాము రాసుకునేవి ఈ కోవలోకి వస్తాయి.

**స్వీయ మానసిక ధోరణి రచయితలు**

ఇలా సాహిత్యంలో అనేక కోణాలు. మా అంటరానితనం గురించిన బాధ మీకేం తెలుసు, మా స్త్రీల బాధల గురించి మీ మగవారికేం తెలుసు. మీకివి అర్థం కావు అనడంలో వాస్తవం వుంది. అయితే తమ రచనను సమర్థించుకోవడం, పాఠకులకు తమ బాధలను స్పందించే విధంగా రాయలేకపోవడం కూడా కావచ్చు. అతి కూడా కావచ్చు. తెలంగాణ రాష్ట్రం ఎంత అవసరమో అని ఆంధ్ర ప్రాంత ప్రజలు ఆమోదించే విధంగా రాయండి అచ్చు వేస్తానన్నాడు ఒక ప్రముఖ పబ్లిషర్. ప్రయత్నించి చూసాను. నాతో సాధ్యం కాలేదు. కొన్ని సందర్భాలు ఇలా కూడా వుంటాయి. అంటరాని తనం, వివక్ష, ఇతరులకా బాధ తెలియదు, స్త్రీల బాధ అణిచివేత మగవారికి అర్థం కాదు అనేమాట కూడ ఆలోచించ దగినదే. అయితే నీ అనుభవాలు కానివి నీవే అనినట్టు రాస్తే మొదట చెప్పినట్టు అది ఆ వర్గ ప్రాతినిధ్య సాహిత్యం అవుతుంది. ఇతరుల బాధను తన బాధగా మార్చుకొని చెప్పడం అవుతుంది. అలా కన్సర్న్ ఉన్న ఇతరులు కూడా అర్థం చేసుకోవడం రాయడం, వారి విముక్తికోసం ఉద్యమించడం కూడ సాధ్యమే. మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, రాజా రామ్మోహన్ రాయ్, కందుకూరి వీరేశలింగం వంటి మహనీయుల సంఘ సంస్కరణలు అందుకు ఉదహరించవచ్చు.

**సాహిత్యంలో వాస్తవిక పరిమితులు**

సాహిత్యం ఇంద్రియ సంవేదనల ద్వారా ప్రభావితం చేస్తుంది. ఏం జరిగిందో ఎలా జరిగిందో చిలవలు పలవలుగా రేప్ లు చిత్రహింసలు, అవమానాలు అణిచివేతలు మొదలైనవి.

ఎలా చిత్రిస్తే ఎలాంటి ప్రభావం వేస్తుంది అనేదే ముఖ్యం. రేప్ చేశారని అదంతా చిత్రిస్తే భయంకరంగా మహిళా పాఠకులను మరింత భయపెడుతాయి. పూలన్ దేవి పై వచ్చిన హిందీ సినిమాలో రేప్ ను యధాతథంగా చిత్రించారు. నేనా సినిమా చూసినపుడు సినిమా హాల్లో ఒక్క మహిళ లేదు. ఆ సన్నివేశం తమను అవమానించినట్టు భయపడిపోయారు. ఒక స్త్రీ దయనీయ గాథను స్త్రీలే భరించలేక పోయారు. చిత్రీకరణ ఎవరిపై ఎలా ప్రభావితం చేస్తుంది అనేది గమనించి జీవితం పట్ల భయం స్థానంలో ఆత్మవిశ్వాసం కలిగించే నైపుణ్యం విధంగా రాసే సామర్థ్యాన్ని పెంచుకోవాలి. పెళ్లి గురించి, పెళ్లి అయ్యాక గృహ హింస, భర్తల క్రూర శృంగార హింస గురించి భయానకంగా రాస్తే పెళ్లి కావాల్సిన ఆడపిల్లలు చదివినప్పుడు అది వారిపై ఎలాంటి ప్రభావం వేస్తుంది? పెళ్లి పట్ల, భర్త పట్ల ప్రెజిడీస్తో కుంచించుకుపోతారు. కాపురంలో ఆనందానికి బదులు ప్రతీక్షణం నెగెటివ్ ఫీలయి దుఃఖాన్ని, వేదనను వెతుక్కునే దుస్థితికి గురవుతారు. ఇలా కుల వివక్ష, స్త్రీ వివక్ష మొదలైనవి అత్యంత భయానకంగా చిత్రిస్తే ఎవరికోసం రాస్తున్నారో వారిపట్ల అణచివేతగా మనోసిజంగా పరిణమిస్తాయి. అందువల్ల మితిమీరిన ఇలాంటి వర్ణనలు, సంఘటనలు మంచిది కాదు.

ఇండియా, పాకిస్తాన్ గా దేశం మూడు ముక్కలైనప్పుడు 20 లక్షల మంది హిందువులు, ముస్లింలు హత్యలకు గురయ్యారు. ఆ విషయాలను యధాతథంగా చిత్రిస్తే ఈ సమాజం భరించలేదు. అలా చరిత్ర, మనిషిలోని జ్ఞాపకశక్తిని అవి మరిచిపోవాలని కోరుకుంటారు. సామూహిక మానభంగానికి గురైన మహిళకు ఆ విషయం జ్ఞాపకం చేయడం ఒక శాడిజం. ఆత్మహత్య నుండి బయటపడిన వారిని ఆ విషయాన్ని పదే పదే జ్ఞాపకం చేస్తే అది ఒక శాడిజం. కమ్యూనిస్టులు, మార్క్సిస్టులు, స్త్రీవాదులు, మానవతావాదులు, దళిత బహుజనవాదులు ఈ విషయాలు గుర్తు పెట్టుకోలేకపోతే తమ కీర్తి ప్రతిష్ఠల కోసం పీడితులకు, బాధితులకు మద్దతుగా నిలబడినా నష్టం చేస్తారు. మైండ్సెట్లో ఒక భయాన్ని, ఫోబియాను చొప్పించి, పాఠకుల, ప్రేక్షకుల వ్యక్తిత్వాన్ని కుదిస్తారు. ఇలా సాహిత్య చిత్రణలో పలు అంశాలను దృష్టిలో వుంచుకోవడం అవసరం. రచయిత తన రచనా సామర్థ్యం అవగాహన పెంచుకోవడం అవసరం.

**పీడితులకు, బాధితులకు**
**బాసటగా నిలవాలి**

**పాఠకుల్లో ఆత్మవిశ్వాసం పెంచాలి కష్టజీవికి కుడి ఎడమల నేను ఉన్నానని ధైర్యం కలిగించాలి. సాహిత్యంలో చిత్రించిన పాత్రల జీవితాలకు స్ఫూర్తి, ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి ఎదగడానికి ఆత్మవిశ్వాసం, జీవితాన్ని గెలుచుకోగలను అనే ధైర్యం అందించడం ఒక దృష్టి కోణం. అలా కాకుండా పాఠకులను ఆకర్షించడమే ప్రధానంగా సాగితే ఆయా పాత్రల జీవితాలను సరుకుగా మార్చి ఇతరులకు అమ్ముకోవడం అవుతుంది. త్రిపురనేని గోపీచంద్ అసమర్థుడి జీవయాత్ర అందులోని పాత్రల కోసం రాయలేదు.**



**- బి. ఎస్.రాములు**
సామాజిక తత్వవేత్త
తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ ఛైర్మన్
ఫోన్ : 8331966987



## మూడు మేకలను సూపారి ఇచ్చి భర్తను హత్య చేయించిన భార్య

**విశ్వంభర, జడ్చర్ల :** కన్నకూతరి ప్రేమకు అడ్డువస్తున్నాడని కట్టుకున్న భర్తనే కడతేర్చింది భార్య. ఏకంగా సుపారీ ఇచ్చి మరీ ప్లాన్ ప్రకారం భర్తను కిరాతకంగా చంపించింది. తీరా ఏమీ ఎరగనట్టు భర్త మృతదేహం వద్ద మొసలి కన్నీరు కార్చింది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణ శివారులోని రాజీవ్ నగర్ కాలనీలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. కూతురు ప్రేమ వ్యవహారానికి అడ్డు చెప్పడమే ఆ తండ్రికి మరణ శాసనమయ్యింది. ప్రేమ పెళ్లి వద్దని కూతురిని గట్టిగా మందలిస్తే తండ్రిని పరలోకానికి పంపించేసింది తల్లి. కుటుంబంలో ఓ చిన్న సమస్య ఆ ఇంట పెద్ద హత్యకు దారీ తీసింది. ఈ ఘటన ఉమ్మడి పాలమూరు జిల్లాలో చోటు చేసుకుంది. ఇన్ స్టాగ్రాంలో పరిచయమైన వ్యక్తితో కూతురి ప్రేమ, పెళ్లి ప్రతిపాదనను కాదన్నందకు ఆ తండ్రిని కానరాని లోకాలకు పంపారు.

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఈ నెల 21న జరిగిన మర్డర్ దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగు చూశాయి. రాజీవ్ నగర్ లో ఉండే మెక్కం చిన్న అంజనేయులు మేకల కాపరిగా వృత్తి నిర్వర్తిస్తున్నాడు. ఆయన కుమార్తె అంజలికి హైదరాబాద్‌కు చెందిన పాండు అనే వ్యక్తితో సోషల్ మీడియా ప్లాట్ ఫాం ఇన్ స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయంతో ప్రతిరోజూ ఫోన్లో మాట్లాడడాన్ని తండ్రి చిన్న అంజనేయులు గమనించి మందలించాడు. తండ్రి మందలింపును లైట్ తీసుకున్న కూతురు పాండుతో పరిచయాన్ని అలానే కొనసాగించింది. ఈ క్రమంలో అదే వ్యక్తితో కూతురు ప్రేమ పెళ్లి ప్రస్తావన తీసుకురావడంతో ఆవేశానికి లోనైన తండ్రి అంజనేయులు గట్టిగా మందలించాడు. ఆ సందర్భంలో అడ్డుపడబోయిన భార్య భాగ్యలక్ష్మీపై చేయిచేసుకున్నాడు. అనంతరం కూతరు వద్ద తండ్రి చెడుగా ప్రవర్తించడంతో పాటు, ఆమె ప్రేమ వివాహన్ని నిరాకరించాడని భర్తపై కక్ష పెంచుకుంది భార్య భాగ్యలక్ష్మి. ఏకంగా భర్తను హత్య చేయించాలని డిసైడ్ అయి పక్కా ప్లాన్ చేసింది. భర్త హత్యపై ఎక్కడా, ఎలాంటి అనుమానం రాకుండా ఉండేందుకు వారు నివాసం ఉంటున్న ప్రాంతంలోని కాళ్ల మైసమ్మ అనే మహిళను ఆశ్రయించింది. హత్య చేసేందుకు సుపారీగా తమ వద్ద ఉన్న మేకల్లో మూడు మేకలు ఇస్తానని ఒప్పందం కుదుర్చుకుంది. కాళ్ల మైసమ్మకు ముత్యాలమ్మ, నర్సింహులు అనే మరో ఇద్దరు తోడయ్యారు. చిన్న అంజనేయులు హత్యకు పక్కాగా స్కెచ్ వేసి అమలు చేశారు.

### కాళ్లు, చేతులు అదిమి పట్టి.. గొంతుకోసి..

ముందస్తు ప్రణాళిక ప్రకారం భర్తకు మద్యం తాగించి మేకల షెడ్ వద్ద పడుకోబెట్టి వెళ్లిపోయింది భార్య భాగ్యలక్ష్మి. అనంతరం అర్ధరాత్రి సమయంలో మైసమ్మ, ముత్యాలమ్మ, నర్సింహులు స్పాట్‌కు చేరుకున్నారు. మైసమ్మ, ముత్యాలమ్మ.. అంజనేయులు కాళ్లు అదిమి పట్టుకోగా, నర్సింహులు తన వెంట తెచ్చిన చిన్న కత్తితో గొంతు కోశాడు. అనంతరం అక్కడి నుంచి పారిపోయి ఎవరికి వారు తలదాచుకున్నారు. భార్య భాగ్యలక్ష్మి కాల్ డేటాతో హత్య అసలు కోణం వెలుగులోకి వచ్చింది. కట్టుకున్న భార్యే.. తన భర్తను సుపారీ ఇచ్చి మరీ హత్య చేయించినట్లు తేలింది. భాగ్యలక్ష్మీతో పాటు మిగిలిన ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇంత జరిగినా తన భర్తను హత్య చేశారంటూ భార్య మొసలి కన్నీరు కాల్చడం గమనార్హం. కట్టుకున్న భార్యే ఇలా సుపారీ ఇచ్చి మరీ హత్య చేయించడం ఉమ్మడి పాలమూరు జిల్లాల్లో ఒక్కసారిగా కలకలం రేపింది.

## రంగునీటిలో ముంచి నగదు మాయం చేసిన కేటుగాళ్లు



**విశ్వంభర, నల్లగొండ :** మెగాస్టార్ చిరంజీవి నటించిన 'ఇంద్ర' సినిమాలో బంగారాన్ని నదిలో వేస్తే రెట్టింపు అవుతుందని మోసం చేసిన సీన్ తరహాలోనే అమాయకులను బురిడీ కొట్టించింది ఓ ముఠా. కాకపోతే ఆ సీన్‌లో బంగారం బదులు.. నగదును ఉంచి ఘరానా మోసానికి పాల్పడిన ఘటన నల్లగొండ జిల్లాలో వెలుగులోకి వచ్చింది. ఈ కేటుగాళ్లు చేసిన మోసాన్ని చూసి పోలీసులే షాక్ తిన్నారు. డబ్బులు రెట్టింపు చేస్తామంటూ బురిడి కొట్టించిన ముఠాను పోలీసులు కటకటాలపాలు చేశారు. బీహార్‌కు చెందిన రామ్ నరేష్ యాదవ్.. తాపీ మేస్త్రిగా నల్లగొండ మండలం చందనపల్లిలో పనిచేశాడు. ఆ సమయంలో గ్రామానికి చెందిన ఆర్ఎంపి డాక్టర్ రామాచారి ఇంటికి కూడా తాపీ మేస్త్రిగా పనిచేయడంతో ఇద్దరు మధ్య పరిచయం ఏర్పడింది. మూడు రోజుల క్రితం రామ్ నరేష్ యాదవ్ బీహార్‌కు చెందిన అతని ఫ్రెండ్స్ షేక్ సిరాజ్, షేక్ అఫ్తాబ్‌లు ఆర్ఎంపీ డాక్టర్ రామాచారి ఇంటికి వెళ్లారు. డబ్బులను రెట్టింపు చేసే లిక్విడ్ ఉందని చెప్పారు. మీ దగ్గర ఉండే డబ్బును రెట్టింపు చేసి ఇస్తామని ఆశ చూపించారు. వారి మాటలను నమ్మిన రామాచారి అతని బావమరిది భూమి కొనుగోలు చేసేందుకు తెచ్చిన రూ.33 లక్షల నగదును తన ఇంటి ఫస్ట్ ఫ్లోర్‌లో వారికి ఇచ్చారు.

### లిక్విడ్‌తో నగదు మాయం..

కేటుగాళ్లు తమ వెంట తెచ్చుకున్న లిక్విడ్‌ను బకెట్లో పోసి రూ. 33 లక్షలను అందులో ముంచి బయటకు తీసి బ్రౌన్ టేప్‌తో బండిల్స్‌గా కట్టారు. గంట తర్వాత వాటిని స్టవ్‌పై వేడిచేసి ఒక రోజు తర్వాత ఓపెన్ చేస్తే డబ్బులు రెట్టింపు అవుతాయని నమ్మించారు. లిక్విడ్‌లో ముంచి తీసిన బండిల్స్‌కు హైదరాబాద్‌కు వెళ్లి లేబుల్స్ కొనుక్కొస్తామని కేటుగాళ్లు చెప్పారు. ఇంతలోనే అమరేంద్ర చారి తన ఇంటికి వెళ్ళగా, పేషెంట్ వచ్చాడని రామాచారి మొదటి ఫ్లోర్ నుండి కిందికి దిగాడు. ఇదే అదునుగా దుండగులు తమ ప్లాన్‌ను ఆచరణలో పెట్టారు. అప్పటికే రామ్ నరేష్ యాదవ్, సిరాజ్‌లు తమవద్ద ఉన్న బ్యాగులో కింద ఒకటి.. పైనఒకటి ఒరిజినల్ రూ.500 నోట్లు పెట్టి.. మధ్యలో తెల్లటి కాగితాలతో ప్యాక్ చేసి ఉంచిన డబ్బు కట్టలను తెచ్చుకున్నారు. వీటిని అసలైన కరెన్సీ నోట్ల స్థానంలో ఉంచి వాటిని ఆ ముఠా తమ బ్యాగులో వేసుకున్నారు. హైదరాబాద్‌కు వెళ్లి లేబుల్స్ తీసుకుని ఉదయం వస్తామని చెప్పి కేటుగాళ్లు పరారయ్యారు. మరుసటి రోజు జాదూగాళ్లు రాకపోవడంతో నకిలీ కరెన్సీ బండిల్స్‌ను ఓపెన్ చేసిన రామాచారి, తన బావమరిది అమరేంద్ర చారిలు అవాక్కయ్యారు. మోసపోయామని గ్రహించిన రామాచారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. నల్గొండ రైల్వే స్టేషన్‌లో బిహార్‌కు పారిపోయేందుకు అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరి బ్యాగ్‌లను చెక్ చేశారు. వారిపై కేసు నమోదు చేసి విచారించగా ఘరానా మోసం బయటపడిందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ తెలిపారు. నిందితుల నుంచి రూ.24 లక్షల నగదు, మూడు సెల్ ఫోన్లు, కలర్ సీసాలు, తెల్ల కాగితాల పేపర్ కట్టలను స్వాగతం చేసుకున్నామని చెప్పారు. పరారీలో ఉన్న నిందితుడిని త్వరలో పట్టుకుంటామని ఆయన తెలిపారు. ఇలాంటి ఘరానా మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇలాంటి కేటుగాళ్లు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

## పార్టీ ఫిరాయించిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టము

### మాజీ మంత్రి జగదీష్ రెడ్డి



**విశ్వంభర, బంజారహిల్స్ :** ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారం తెలంగాణ పాలిటిక్స్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అధికార కాంగ్రెస్ పార్టీ ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరలేపడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలోకి క్యూ కడుతున్నారు. 4 రోజుల వ్యవధిలోనే ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ వీడటంపై మాజీ మంత్రి జగదీష్ రెడ్డి రియాక్ట్ అయ్యారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలు సంజయ్ కుమార్, పోచారం శ్రీనివాసరెడ్డి బీఆర్ఎస్ బీ ఫామ్‌పై గెలిచి కాంగ్రెస్‌లో చేరారని, పార్టీ ఫిరాయించిన వారి సభ్యత్వం రద్దు చేయాలని కోరారు. పోచారం శ్రీనివాసరెడ్డి, సంజయ్ కుమార్ పార్టీ ఫిరాయింపుపై పిటిషన్ ఇవ్వడానికి స్పీకర్‌ను సమయం కోరామని తెలిపారు. ఈ రోజు లేదా రేపు సమయమిస్తానని స్పీకర్ చెప్పారని ఆయన తెలిపారు. గతంలో పార్టీ మారిన ముగ్గురు ఎమ్మెల్యేలతో పాటు వీరిద్దరి సభ్యత్వాలు రద్దు కావాలని జగదీష్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పిటిషన్ ఇచ్చేందుకు స్పీకర్ సమయం ఇస్తారని భావిస్తున్నామని అన్నారు. పాంచ్ న్యాయ్ తీర్మానం ప్రకారం ఫిరాయింపులు ప్రోత్సహించవద్దని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చెబుతుంటే, ఫిరాయింపులపై రాహుల్ బీజేపీపై దాడి చేస్తుంటే ఇక్కడ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీజేపీకి తోకలా వ్యవహరిస్తున్నాడని విమర్శించారు. మోదీ విధానాలను రేవంత్ ఫాలో అవుతున్నాడని మండిపడ్డారు. పార్టీ ఫిరాయించిన ఏ ఒక్కరినీ మేము వదిలిపెట్టమని, ప్రజల ముందు దోషిగా నిలబెడతామని అన్నారు .స్పీకర్ న్యాయంగా ప్రవర్తిస్తారని ఆశిస్తున్నామని ఆయన అన్నారు.



## థాంక్యూ మల్కాజ్ గిరి అంటూ ఈటల ఎమోషనల్ ట్వీట్..!

**విశ్వంభర, ఢిల్లీ :** దేశంలో 18వ లోక్ సభ కొలుదీరిన సందర్భంగా ఎంపీల ప్రమాణ స్వీకారం రెండు రోజు కొనసాగుతోంది. ఇవాళ సీనియర్ లీడర్, బీజేపీ నేత, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ 'థాంక్యూ మల్కాజిగిరి' అంటూ ఎమోషనల్ ట్వీట్ చేశారు. ఈ మేరకు ప్రమాణం చేస్తున్న వీడియోను ప్రజలతో పంచుకున్నారు. 'ప్రియమైన మల్కాజిగిరి ప్రజలారా, ఈ రోజు న్యూఢిల్లీలో జరిగిన 18వ లోక్ సభలో మీ పార్లమెంటు సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసినందుకు నేను ఎంతో గౌరవంగా భావిస్తున్నాను. మీ తిరుగులేని మద్దతు, విశ్వాసం, నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించడానికి నాకు శక్తినిచ్చాయి. కలిసి అభివృద్ధి ప్రయాణాన్ని ప్రారంభించాము. మీ పట్ల నా నిబద్ధత తిరుగులేనిది, మీ సమస్యలను పరిష్కరించడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. మోడీ నాయకత్వంలో రాబోయే ఐదేళ్లలో భారత్ అపూర్వమైన అభివృద్ధి సాధించగలదని నేను విశ్వసిస్తున్నాను. మోడీ సర్కార్ నిబద్ధత వల్ల ఇప్పటికే ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాదిని ఏర్పాటు చేసింది.



## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారడానికి కారణం అతనే : ప్రభాకర్

**విశ్వంభర, నాంపల్లి :** తెలంగాణలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, రాష్ట్రంలో హత్యలు, అత్యాచారాలు జరుగుతుంటే సమీక్షించే నాథుడేలేరని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ విమర్శించారు. మంగళవారం నాంపల్లిలోని పార్టీ స్టేట్ ఆఫీస్ లో మీడియాతో మాట్లాడిన ఆయన.. ప్రజా పాలన అందిస్తామని అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి పరిపాలనను గాలికి వదిలేసి ఢిల్లీ టూర్లకు వెళ్తుండటం వల్లనే రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని మండిపడ్డారు. ఆరు నెలల వ్యవధిలో 11 సార్లు ఢిల్లీకి వెళ్లిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కరేనని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు అవుతున్నా ముఖ్యమంత్రి ఇంకా పాలనపై పట్టు సాధించలేదని విమర్శించారు. పాలనలో మూడు బదిలీలు.. ఆరు సస్పెన్స్ లుగా సాగుతోందని.. ఆరు నెలల కాలంలో మూకుమ్మడి బదిలీల పేరుతో ఐఏఎస్, ఐపీఎస్ లను బదిలీ చేశారని దీంతో అధికారులు తమ శాఖలపై పట్టు సాధించలేకపోతున్నారన్నారని విమర్శించారు. కేసీఆర్ కనుసన్నల్లోనే ఎమ్మెల్యేల ఫిరాయింపు జరగుతోందని, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కేసీఆరే కాంగ్రెస్ లోకి పంపిస్తున్నారని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆరోపించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం కొత్త ప్రయోగం చేస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వం నియోజకవర్గానికి ఒక గురుకులం అని పనులు మొదలు పెట్టారని వీటి పనులు ఏ దశలో ఉన్నాయో సమీక్షించకుండానే ఇండిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు ఏంటని ప్రశ్నించారు.

## 50 మంది హాస్టల్ విద్యార్థినిలకు ఫుడ్ పాయిజన్


### ఆరుగురి పరిస్థితి విషమం..!



**విశ్వంభర, చందానగర్ :** సాధారణంగా ప్రస్తుతం చదువుకు మార్కెట్ మంచి గిరాకీ ఉంది. ఉన్నత చదువులు చదువుకుంటే భవిష్యత్ లో ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చని తల్లిదండ్రులు తమ పిల్లలను దూరంగా హాస్టల్స్ లో ఉంచి చదివిస్తుంటారు. ఇలా ఎందరో విద్యార్థులు తాము ఉన్న ఊరికి, కన్నవారికి దూరమై హాస్టల్స్ లో ఉండి ఉన్నత చదువులు చదువుకుంటున్నారు. కొన్ని హాస్టల్స్ లో నిర్వాహకుల నిర్లక్ష్య ధోరణికి ఆశయాల బాటలో అడుగులు వేయాల్సిన విద్యార్థులు అనారోగ్యంతో అసుపత్రుల పాలవుతున్నారు. కొందరు ప్రాణాలను సైతం కోల్పోతున్నారు. ముఖ్యంగా విద్యార్థులకు అందించే ఆహారంలో నాణ్యత లేకపోవడంతో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయిన సంఘటనలు చాలానే చోటు చేసుకున్నాయి. తాజాగా అలాంటి ఘటనే చందానగర్ లోని సుమన్ హాస్టల్లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చందానగర్ లోని మహిళా దక్షిత సమితి బన్సీలాల్ మలానీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు చందానగర్ లోని సుమన్ హాస్టల్ ఉంటూ చదువుకుంటున్నారు. తాజాగా హాస్టల్ లోని విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయ్యింది. 50 మందికి వాంతులు, విరోచనాలు కాగా స్థానిక ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నట్టు సమాచారం. కాగా వారిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది.

## డ్రగ్స్ వినియోగం విష ప్రయోగం లాంటిది

### డిప్యూటీ సీఎం భట్టి



**విశ్వంభర, ఖైరతాబాద్ :** రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు కాంగ్రెస్ సర్కార్ కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డులో జలవిహార్ వద్ద డ్రగ్స్ నిర్మూలన ర్యాలీని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. డ్రగ్స్ వినియోగం విష ప్రయోగం లాంటిదని.. ఇది అత్యంత ప్రమాదకరమని భట్టి అన్నారు. కుటుంబ వ్యవస్థలను విచ్ఛిన్నం చేస్తుందని.. డ్రగ్స్ సరఫరా చేస్తున్న సంఘ విద్రోహశక్తుల చేతిలో యువత జీవితాలు చిన్నాభిన్నమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. "తెలిసీ తెలియని వయసులో వాటి బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. కొందరు కావాలనే తమ అక్రమ సంపాదన కోసం యువతకు డ్రగ్స్ అంటగడుతున్నారు. దేశాన్ని బలహీనపరిచేందుకు దేశద్రోహులు చేస్తున్న ప్రయత్నంగానూ దీన్ని చూడొచ్చు. రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యత మనపైనే ఉంది. డ్రగ్స్ నిర్మూలనకు నార్కోటిక్ బ్యూరోకు ఎంత బడ్జెట్ అయినా కేటాయిస్తాం. వాటి వినియోగం, రవాణా లేకుండా చేయాల్సిన బాధ్యత ఆ అధికారులదే. పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగమే కాకుండా ప్రజల నుంచి కూడా సహకారం అందాలి." అని భట్టి విక్రమార్క అన్నారు.




## కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన మంత్రి సీతక్క

**విశ్వంభర, ఢిల్లీ:** ఏఐసీసీ పిలుపు మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పలువురు మంత్రులు ఢిల్లీకి వెళ్లారు. ఈ క్రమంలోనే ఇవాళ ఢిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తండాలతో పాటు అనుబంధ గ్రామాలు ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పడ్డ విషయం తెలిసిందే. అయితే చాలా గ్రామాల్లో నేటి వరకు పంచాయతీ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 6,176 గ్రామ పంచాయతీలకు భవనాలు లేవని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు మంత్రి సీతక్క తెలిపారు. అద్దె భవనాల్లో ప్రభుత్వ సిబ్బంది స్వేచ్ఛగా పని చేయకపోతున్నారని తెలిపారు. ఈ మేరకు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ పథకం ద్వారా పంచాయతీ భవనాల నిర్మాణం కోసం రూ.1,544 కోట్లు మంజూరు చేయాలని మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు మంత్రి సీతక్క వినతిపత్రం అందజేశారు.

## నేరేడుమెట్‌లో బాలికపై ఐదుగురు గ్యాంగ్ రేప్

**విశ్వంభర, కాచిగూడ:** నేరేడ్మెట్ లో దారుణం చోటు చేసుకుంది. మైనర్ బాలికపై ఐదుగురు యువకులు గ్యాంగ్ రేప్ నకు పాల్పడ్డారు. మైనర్ అమ్మాయిని ట్రాప్ చేసి నేరేడ్మెట్ తీసుకువెళ్లి గ్యాంగ్ రేప్ పాల్పడ్డారు యువకులు. కాచిగూడ లో ఉంటున్న మైనర్ అమ్మాయిని కి గంజాయి అలవాటు చేశారు యువకులు. మైనర్ అమ్మాయి గంజాయి మత్తులోకి దిగగానే అత్యాచారం చేశారు యువకులు. జరిగిన ఘోరాన్ని తల్లికి చెప్పకుండా దాచిపెట్టింది ఆ మైనర్ అమ్మాయి. ఇక మైనర్ అమ్మాయి శరీరంలో మార్పులు రావడంతో గమనించి నిలదీసింది తల్లి. అనంతరం జరిగిన ఘోరాన్ని తల్లికి వివరించింది మైనర్ బాలిక. దీంతో కాచిగూడ పోలీస్ స్టేషన్ లో బాధిత కుటుంబం ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు నేరేడ్మెట్ కు బదిలీ చేశారు. మైనర్ బాలికపై అత్యాచారం చేసిన యువకుల కోసం గాలిస్తున్న పోలీసులు వెంటనే పట్టుకుంటామని చెబుతున్నారు.



## రెస్టారెంట్ బిర్యానీలో పురుగులు

**విశ్వంభర, కూకట్‌పల్లి :** ప్రస్తుతం పిల్లలు పెద్దలు అనే తేడా లేకుండా ఇంట్లో తయారు చేసిన ఆహారం కంటే బయట ఫుడ్‌ని తినడానికి ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ఇందుకోసం ఇంట్లో కూర్చుని ఆన్ లైన్ లో ఆర్డర్ పెడతారు లేదా బయటకు వెళ్లి రెస్టారెంట్ లో హ్యాపీగా నచ్చిన మనసు మెచ్చిన ఆహారాన్ని ఆర్డర్ చేసి కడుపునిండా లాగించేస్తున్నారు. ఇలా ఆన్ లైన్ లో ఫుడ్ ఆర్డర్ పెట్టుకుని తినడం వలన టేస్ట్ కి టేస్ట్ ఉంటుందని సమయం అదా అవుతుందని ఎక్కువ మంది ఆలోచిస్తున్నారు. సాంకేతికత చాలా వేగంగా పెరుగుతోంది.. దీంతో క్షణాల్లో నచ్చిన మెచ్చిన వస్తువులు ఇంటికే చేరుకుంటున్నాయి. అయితే ఒకొక్కసారి సిబ్బంది తొందరపాటు కారణంగా అనేక విషయాలు తప్పుగా జరుగుతూ ఉంటాయి. అప్పుడు తమ వద్దకు డెలివరీ అయ్యిన వస్తువులను తిరిగి ఇవ్వవలసి ఉంటుంది. అలాంటి ఉదంతమే ఈ రోజుల్లో ప్రజల్లో చర్చనీయాంశమైంది. ఇది చూసిన తర్వాత ఎవరైనా షాక్ తింటారు. హైదరాబాద్ నగరం అంటే అందరికి ముందుగా గుర్తుకు వచ్చేది బిర్యానీనే.. ధమ్ బిర్యానీ ప్రపంచ ప్రసిద్ధి పేరుగాంచిందన్న సంగతి అందరికీ తెలిసిందే. ఇక్కడ బిర్యానీకి ఉన్న క్రేజ్ స్థానికులకే కాదు భారతదేశం నలుమూలల నుంచి ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తారు. అయితే ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసిన బిర్యానీలో ఎలుకలు, బొద్దింకలు, కప్పలు, బ్లేడ్‌లు దొరుకుతున్నాయనే ఫిర్యాదులు తరచుగా వినిపిస్తున్నాయి. ఎన్ని ఫిర్యాదులు వచ్చినా ఈ ట్రెండ్ ఆగకపోవడం ఆశ్చర్యకరం. ఇప్పుడు బయటకు వచ్చిన ఈ వార్త వింటే ఎవరైనా షాక్ తినాల్సిందే.. ఓ మహిళ ఆకలి వేసి తిందాం అని ఆన్ లైన్ లో బిర్యానీ ఆర్డర్ చేసింది. అయితే ఈ బిర్యానీలో పురుగు బయటికి వచ్చింది. భాగ్యనగరానికి చెందిన సాయి తేజ అనే వ్యక్తి తాను తినే ఆహారంలో పురుగు కనిపింన విషయాన్ని ప్రస్తావిస్తూ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లో ఒక చిత్రాన్ని పంచుకున్నారు. కూకట్‌పల్లిలోని 'మెహ్‌ఫిల్ బిర్యానీ' షాప్ నుంచి ఏ ఫుడ్ ఆర్డర్ చేయవద్దని ఇతర వినియోగదారులకు సూచించాడు కూడా. ఓవైపు సోషల్ మీడియాలో ఫోటో షేర్ చేస్తూ.. మరోవైపు ఈ విషయంపై ఎఫ్ఎస్ఎస్ఏఐకి కూడా ఫిర్యాదు చేశారు. ఈ పోస్ట్ ఇంటర్నెట్‌లో పోస్ట్ చేయడంతో నెట్టింట్లో ఓ రెంజ్ లో వైరల్‌గా మారింది.

## పార్టీ ఫిరాయింపులపై తొలిసారి స్పందించిన కేసీఆర్



**విశ్వంభర, గజ్వేల్ :** గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో డీలా పడ్డ తరువాత బీఆర్ఎస్ పార్టీ ఉనికి ప్రశ్నార్థకం అయిందంటూ రాష్ట్ర వ్యాప్తంగా జోరుగా చర్చ జరగుతోంది. స్థానికల ఎన్నికల కంటే ముందే మెజారిటీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్కెచ్ వేశారు.ఈ మేరకు ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు నియోజకవర్గ అభివృద్ధి పేరుతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ క్రమంలోనే సొంత పార్టీ ఎమ్మెల్యేను కాపాడుకునేందుకు, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మంగళవారం ఎర్రవల్లి ఫామ్‌హౌజ్‌లో వారితో భేటీ అయ్యారు. ఈ మేరకు ప్రస్తుతం పార్టీలో జరగుతున్న పరిణామాలపై కేసీఆర్ వారితో చర్చించారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి లాంటి వారు పార్టీ మారడాన్ని ఏ మాత్రం పట్టించుకోవద్దని ,కొందరు పార్టీ మారినంత మాత్రాన బీఆర్ఎస్ పార్టీకి వచ్చిన నష్టం ఏమి లేదంటూ కేసీఆర్ కామెంట్ చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఇలాంటివి చాలా జరిగినా.. తమ ఎమ్మెల్యేలు ఏ మాత్రం తొణకలేదని ఆయన గుర్తు చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా నేరాలు, ఘోరాల సంఖ్య విపరీతంగా పెరిగిందని మండిపడ్డారు.శాంతిభద్రతలు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయని కేసీఆర్ అన్నారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ పార్టీకి మంచి రోజులు వస్తాయని ఆశా భావం వ్యక్తం చేశారు. అప్పటి వరకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నాయకులను తరచూ కలుస్తానంటూ కేసీఆర్ అన్నారు.

## తడిబట్టలతో ప్రమాణం చేసిన పాడి కౌశిక్ రెడ్డి

- మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రమాణం చేయాలని డిమాండ్
- ఫ్లైయాజ్ తరలింపులో డబ్బులు తీసుకోలేదా..?
- అవినీతికి పాల్పడలేదని నిరూపించుకోవాలి



**విశ్వంభర, హుజూరాబాద్ :** హుజూరాబాద్ మండలం చెల్పూర్ హనుమాన్ దేవాలయం వద్ద పోలీసులు భారీగా మోహరించడంతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఫ్లై యాష్‌స్కామ్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రమేయం ఉందని చేస్తోన్న హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అవినీతి చేయలేదని గుడిలో ప్రమాణం చేయాలని.. కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ బాబు సవాల్ విసిరారు. సవాల్ స్వీకరించిన హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మంగళవారం ఉదయం 11 గంటలకు హనుమాన్ టెంపుల్ వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దాదాపు 200 మంది పోలీసులు ఆలయ ఆవరణతో పాటు గ్రామంలో కూడా మోహరించారు. పోలీసులు చెల్పూర్ వద్ద హుజూరాబాద్‌జమ్మికుంట ప్రధాన రహదారిపై బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతానికి రాజకీయ నేతలను అనుమతించడం లేదు. కౌశిక్ రెడ్డిని వీణవంకలోని ఆయన నివాసంలోనే గృహనిర్బంధం చేశారు.ఈ నేపథ్యంలో కౌశిక్ రెడ్డి ఇంటివద్దే తడిబట్టలతో తాను అవినీతికి పాల్పడలేదని దేవుడి ఫోటోపై ప్రమాణం చేశారు. అనంతరం కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. ఫ్లైయాష్ తరలింపు, ఓవర్ లోడ్ లారీల నుంచి డబ్బులు తీసుకోలేదని మంత్రి పొన్నం కూడా ప్రమాణం చేయాలన్నారు. అలా చేస్తే తాను క్షమాపణ చెప్తానన్నారు. పొన్నంపై తాను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానన్నారు.

### అసలేంటి వివాదం..?

రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎన్‌టీపీసీ రామగుండం నుంచి ఖమ్మంకు ఫ్లై యాష్‌ను అక్రమంగా తరలిస్తూ భారీ మొత్తంలో సంపాదిస్తున్నారని కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. దీనిపై స్పందించిన పొన్నం ఎమ్మెల్యేకు లీగల్ నోటీసు ఇచ్చారు. ఈ నోటీసుపై కౌశిక్‌రెడ్డి స్పందిస్తూ.. అక్రమంగా ఫ్లై యాష్ తరలింపులో మంత్రి ప్రమేయం లేకుంటే హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆయన ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే సవాల్‌పై ప్రణవ్ బాబు స్పందిస్తూ కౌశిక్‌రెడ్డి అవినీతికి పాల్పడకపోతే చెల్పూర్ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రమాణం చేయాలని ప్రతిసవాల్ విసిరారు. కాంగ్రెస్ నేత సవాల్‌పై స్పందించిన కౌశిక్ రెడ్డి మంగళవారం హనుమాన్ ఆలయంలో ప్రమాణం చేసేందుకు రెడీ అయ్యారు. చెల్పూర్ లోని హనుమాన్ దేవాలయంతో పాటు హుజూరాబాద్-జమ్మికుంట ప్రధాన రహదారి వరకు కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు ఫ్లెక్సీలు, పోస్టర్లు ఏర్పాటు చేసుకుని పరస్పర సవాళ్లు విసురుకున్నారు. ఈ క్రమంలో ఉద్రిక్త పరిస్థితులు లేవనెత్తకుండా పోలీసులు భారీగా మోహరించారు.

# తెలంగాణ రాష్ట్రంలో 16 ఉత్పత్తులకు జీఐ ట్యాగ్

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో తీయని బాలానగర్ సీతాఫలాలు,ఔషధ గుణాలున్న మేలైన పొడుగు నిజామాబాద్ పసుపుకొమ్ములు,ఫైబరుతో పాటు రుచిగా ఉండే నల్గొండ దోసకాయలు,సిద్ధిపేట అల్లం,తియ్యని అరుదైన అనాత్ ఈ షాహీ ద్రాక్ష,వరంగల్ చపాటా మిర్చి, కాల్షియంతో పాటు తియ్యదనం ఇచ్చే కొల్లాపూర్ మామిడి కాయలకు జియోగ్రాఫికల్ ఇండికేషన్ (జీఐ) ట్యాగ్ ఇప్పించేందుకు హైదరాబాద్ నగరంలోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో 16 ఉత్పత్తులకు ఇప్పటికే జీఐ ట్యాగ్ లభించింది. తెలంగాణలోని కొన్ని నిర్ణీత ప్రాంతాల్లోనే లభ్యమయ్యే అరుదైన పండ్ల రకాలకు జీఐ ట్యాగ్ ఇప్పించేందుకు యూనివర్సిటీ ప్రయత్నం చేస్తుంది.

**నిజామాబాద్ పసుపునకు డిమాండ్**

నిజామాబాద్ జిల్లా రైతులు అనాదిగా పండిస్తున్న పసుపు పంటకు దేశ, విదేశాల్లోనే మంచి పేరుంది.పొడుగ్గా ఉన్న పసుపు కొమ్ములతో పసుపు రంగు షైనింగ్ తో నిగనిగలాడే నిజామాబాద్ పసుపునకు స్థానికంగానే కాకుండా దేశంలోనే మంచి డిమాండ్ ఉంది. నిజామాబాద్‌లో తయారయ్యే పసుపు నాణ్యతకు ప్రసిద్ధి.ప్రపంచంలోని మొత్తం పసుపు ఉత్పత్తిలో ఈ ప్రాంతం నుంచి పసుపు 8 నుంచి 10 శాతం వరకు ఉంటుంది.ఈ పసుపునకు జీఐ ట్యాగ్ ఇప్పించడం ద్వారా పసుపు రైతులకు మేలు చేసేందుకు ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ముందుకు వచ్చారు.

**పసుపు సిటీగా నిజామాబాద్**

నిజామాబాద్ పసుపుకు జీఐ ట్యాగ్ తీసుకురావడం ద్వారా ప్రపంచ వ్యాప్త గుర్తింపు కల్పిస్తామని ఇటీవల ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు.నిజామాబాద్ నగరంలో జాతీయ పసుపుబోర్డును ఏర్పాటు చేయడంతోపాటు నిజామాబాద్ నగరాన్ని పసుపు సిటీగా మారుస్తామని ఇటీవల ప్రధాని మోదీ చెప్పారు.దీంతో పసుపు బోర్డు ఏర్పాటు పనులు సాగుతున్నాయి.

**తియ్యదనం ఇచ్చే బాలానగర్ సీతాఫలాలు**

పెద్ద పెద్ద కళ్లతో తియ్యదనంతోపాటు అత్యంత రుచిగా ఉన్న బాలానగర్ సీతాఫలాలు అంటే తెలంగాణ రాష్ట్రంలో ఇష్టపడని వారుండరు. మహబూబ్ నగర్ జిల్లాలోని బాలానగర్ గ్రామం కేంద్రంగా గిరిజన రైతులు పండిస్తున్న సీతాఫలాలకు ఎంతో గిరాకీ ఉంది. కొన్ని వందల ఏళ్ల నాటి నుంచి పండిస్తున్న ఈ సీతాఫలాలకు బాలానగర్ సీతాఫలాలని పేరు పెట్టారు.ఈ పండ్లకు జీఐ ట్యాగ్ ఇప్పించడం ద్వారా అవి పండిస్తున్న గిరిజన రైతులకు సహకారం అందించాలని యూనివర్శిటీ శాస్త్రవేత్తలు నిర్ణయించారు.

**వరంగల్ చపాటా మిరపకాయలు**

చపాటా మిరపకాయలు వరంగల్ జిల్లా ప్రత్యేకత. ఈ మిరపకాయలు ఆకుపచ్చ క్యాప్సికం లాగా ఉంటాయి. ఈ కాయలు ఎండిన తర్వాత ఎరుపు రంగులోకి మారుతాయి. చపాటా మిరపకాయలు ప్రత్యేకమైన తీపి, సువాసనతో ఎరుపు రంగులో ఉంటాయి. తియ్యటి మిరపకాయల్లో చపాటా ఒక రకం. ఊరగాయ తయారీదారులు చపాటా మిరపకాయలను కొనుగోలు చేస్తున్నారు. జపాన్, కొరియాకు కూడా ఈ మిరపకాయలు ఎగుమతి చేస్తున్నారు.వరంగల్ జిల్లాలో దాదాపు 15 వేల టన్నుల చపాటా మిర్చీని రైతులు పండిస్తున్నారు.

**జియోగ్రాఫికల్ ఇండికేషన్**

అరుదైన నాణ్యమైన పండ్లను పండిస్తున్న రైతులు, రైతులతో కూడిన సంఘాలకు మేలు చేసేలా ఉద్యాన వర్శిటీ అధికారులు వివిధ పండ్లకు జీఐ ట్యాగ్ ఇప్పించేందుకు కసరత్తు చేస్తున్నారు.జియోగ్రాఫికల్ ఇండికేషన్ కోసం రిజిస్టర్డ్ ప్రొప్రైటర్‌గా రైతులు, వారి సొసైటీల పేర్లను రిజిస్టర్ ఆఫ్ జియోగ్రాఫికల్ ఇండికేషన్‌లో నమోదు చేస్తారు. దీన్నే జీఐ ట్యాగ్ అంటారు.భౌగోళిక సూచిక (జీఐ)అనేది నిర్దిష్ట భౌగోళిక మూలం ఉన్న ఉత్పత్తులపై ఉపయోగించే సంకేతం.దీని మూలం కారణంగా వివిధ పండ్ల ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో ఖ్యాతి వచ్చింది.

**దరఖాస్తు చేయాలి...**

వస్తువులు లేదా పండ్ల ఉత్పత్తులకు సంబంధించి భౌగోళిక సూచనను నమోదు చేయాలనుకునే సంబంధిత వస్తువుల నిర్మాతలు లేదా ఉత్పత్తిదారుల సంఘం రాతపూర్వకంగా దరఖాస్తు చేయాలి.భారత దేశంలో జీఐ ట్యాగ్‌లను వస్తువులు,పంటల భౌగోళిక సూచనల రిజిస్ట్రేషన్, రక్షణ చట్టం 1999 ప్రకారం జారీ చేస్తారు.ఈ ట్యాగ్‌ను పరిశ్రమ ప్రమోషన్, అంతర్గత వాణిజ్య శాఖ,వాణిజ్యం,పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధీనంలో ఉన్న జియోగ్రాఫికల్ ఇండికేషన్ రిజిస్ట్రీ ద్వారా జారీ చేస్తారు.

**జీఐ ట్యాగ్ తో లాభాలెన్నో...**

జీఐ ట్యాగ్ వల్ల నకిలీ ఉత్పత్తులను అరికట్టడంతోపాటు తయారీదారులకు చట్టబద్ధమైన రక్షణ కల్పించడం జీఐ ట్యాగ్ ఉద్దేశం. జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ రిజిస్ట్రీ ద్వారా కేంద్ర ప్రభుత్వం దీన్ని అందిస్తోంది.ఏళ్లతరబడిగా పండిస్తున్న ఉద్యాన పంటల చరిత్రపై యూనివర్శిటీ శాస్త్రవేత్తలు సర్వే చేసి,దీని డీఎన్ఏ టెస్టు చేస్తారు. రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసిన జీఐ వల్ల లాభాలపై వారిలో చైతన్యం తీసుకువస్తారు. తెలంగాణ ఉద్యాన పంటలపై తాము మూడు నెలల్లో డాక్యుమెంట్ తయారు చేసి జీఐ ట్యాగ్ కోసం ప్రతిపాదనలను పంపిస్తామని వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి నీరజా ప్రభాకర్ 'ఫెడరల్ తెలంగాణ'కు చెప్పారు.తాము సమర్పించే డాక్యుమెంట్లను పరిశీలించాక జీఐ టెక్నికల్ టీం వచ్చి పరిశీలన చేసి సదరు ప్రతిపాదించిన పండ్లకు జీఐ ట్యాగ్ ఇస్తుందని నీరజా వివరించారు.

**తెలంగాణలో జీఐ ట్యాగ్ వచ్చిన వస్తువులివే...**

తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటి వరకు జీఐ ట్యాగ్‌లు సొంతం చేసుకున్న ఉత్పత్తుల సంఖ్య 16కి చేరుకున్నది.పోచంపల్లి ఇక్కత్ చీరలు, కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ, చేర్యాల్ స్రోల్ పెయింటింగ్, నిర్మల్ కొయ్య బొమ్మలు, చిత్రాలు, నిర్మల్ ఫర్నిచర్, హైదరాబాద్ హలీం, పెంబర్తి మెటల్ క్రాఫ్ట్. గద్వాల చీరలు, సిద్దిపేట గొల్లభామ చీరలు, నారాయణ్ పేట్ చేనేత చీరలు,పుట్టపాక తెలియా రుమాల్, ఆదిలాబాద్ డోక్రా,వరంగల్ డర్రీస్,నిర్మల్ పెయింటింగ్స్, లాడ్ బజార్ లక్క గాజులు,తాండూర్ కందిపప్పు వంటి ఉత్పత్తులు ప్రస్తుతం జీఐ ట్యాగ్ సొంతం చేసుకున్నాయి.

**పండ్ల రకాల డీఎన్ఏ నమూనాలు**

బాలానగర్ సీతాఫలాలు,నిజామాబాద్ పసుపు, కొల్లాపూర్ మామిడి, నల్గొండ దోసకాయలకు జీఐ ట్యాగ్ నమోదుకు ఉద్యాన విశ్వవిద్యాలయ నాబార్డు సహకారంతో కసరత్తు చేస్తోంది. నిజామాబాద్ పసుపు, బాలానగర్ సీతాఫలం, కొల్లాపూర్ మామిడి పండ్ల యొక్క విశిష్టతను గుర్తించడానికి వాటి డీఎన్ఏ నమూనాను రూపొందిస్తామని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.జీఐ రిజిస్ట్రేషన్ తర్వాత తెలంగాణ ప్రభుత్వం జీఐ బ్రాండింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వనుంది.

**జీఐ ట్యాగ్ తో ప్రత్యేక గుర్తింపు**

ప్రతీ ప్రాంతంలో ప్రత్యేకంగా తయారయ్యే లేదా ఉత్పత్తి అయ్యే వస్తువులు, పంటలు ,ఆహార పదార్థాలు ఉంటాయి.వీటిని ఆ ప్రదేశంలోనే తయారు చేస్తే సహజమైన నాణ్యత వస్తుంది.అందుకే ప్రత్యేకంగా ఒక భౌగోళిక ప్రాంతం నుంచి వచ్చే ఉత్పత్తులకు జియోగ్రాఫికల్ ఇండికేషన్ (జీఐ)ని వర్తింప చేస్తున్నారు.హైదరాబాద్ హలీం,తాండూరు కందిపప్పు సహా ఇప్పటికే 16 ఉత్పత్తులకు జీఐ ట్యాగ్ రాగా, త్వరలోనే మరికొన్ని ఉత్పత్తులకు ఆ గుర్తింపు రానుంది.



## రామగుండంలో ఆధునిక థర్మల్ పవర్ ప్లాంట్

- సింగరేణి ఆధ్వర్యంలో నిర్మాణానికి చర్యలు
- ఎమ్మెల్యేలకు స్పష్టం చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**విశ్వంభర, హైదరాబాద్ :** రామగుండంలో 62.7 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి స్థానం లో 800 మెగావాట్ల ఆధునిక థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నిర్మిస్తామని, ఎన్నికల హామీని పూర్తి చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. స్థానికంగా యువతకు ఉపాధి అవకాశాలు, రాష్ట్రంలో విద్యుత్ కొరతను అధిగమించేందుకు రామగుండంలో సూపర్ క్రిటికల్ టెక్నాలజీ తో థర్మల్ పవర్ స్టేషన్ నిర్మించాలని, సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న హామీని పూర్తి చేయాలని వారంతా కోరగా డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారు. నిజాం కాలంలో నిర్మించిన చారిత్రాత్మకమైన రామగుండం థర్మల్ పవర్ స్టేషన్ ను తిరిగి నిర్మిస్తామన్నారు. పిట్ హెడ్ ప్లాంటును సింగరేణి ఆధ్వర్యంలో నిర్మించేందుకు అన్ని రకాల చర్యలు చేపడతామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఈ మేరకు డిప్యూటీ సీఎంకు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ లక్ష్మణ్, ఎమ్మెల్యేలు ప్రేమ్ సాగర్ రావు, రాజ్ ఠాగూర్ సింగ్, ఆది శ్రీనివాస్, విజయ రమణారావు తదితరులు పాలొన్నారు.

## ఎన్‌హెచ్‌ఎం బకాయిలు రూ.693.13 కోట్లు విడుదల చేయండి

- కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి. నడ్డాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి

**ఢిల్లీ:** జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) కింద తెలంగాణకు రావల్సిన బకాయిలు రూ.693.13 కోట్లు వెంటనే విడుదల చేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి.నడ్డాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని మంగళవారం ఆయన కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైద్యారోగ్య రంగంపై తెలంగాణ ప్రభుత్వం పెడుతున్న ప్రత్యేక శ్రద్ధను కేంద్ర మంత్రికి వివరించారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనలన్నింటిని తాము ఈ ఏడాది జనవరి నుంచి అమలు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి నడ్డాకు తెలియజేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకుగానూ 5,159 బస్తీ దవాఖానాలు (ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు) సమర్థంగా నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

**మెరుగైన వైద్య సేవలకుగానూ...**

రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నందున కేంద్ర ప్రభుత్వం సహకరించాలని, ఎన్‌హెచ్‌ఎం బకాయిలు విడుదల చేయాలని కేంద్ర మంత్రి నడ్డాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఎన్‌హెచ్‌ఎం 2023 24 మూడు, నాలుగు త్రైమాసికాల నిధులు రూ.323.73 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, 2024-25 మొదటి త్రైమాసిక గ్రాంట్ రూ.138 కోట్లు మంజూరు చేయాల్సి ఉందని, ఆ మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. ఎన్‌హెచ్‌ఎం కింద చేపట్టిన మౌలిక వసతులు, నిర్వహణ కాంపోనెంట్ కింద 20232024 సంవత్సరానికి సంబంధించి రావల్సిన రూ.231.40 కోట్లు తక్షణమే రీయింబర్స్ చేయాలని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఎన్‌హెచ్ ఎంకు సంబంధించి కేంద్రం నుంచి రావల్సిన నిధులు ఆలస్యం కావడంతో అత్యవసర వైద్య సేవలకు అంతరాయం కలగకుండా, సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు రాష్ట్ర వాటాతో పాటు కేంద్రం నుంచి రావల్సిన వాటా మొత్తాన్ని 2023, అక్టోబరు నుంచి తామే విడుదల చేస్తున్నామని కేంద్ర మంత్రి నడ్డా దృష్టికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకెళ్లారు.

## రేవంత్ రెడ్డి సర్కారుకు మానవత్వం లేదు

- దివ్యాగులను మోసగించిన చరిత్ర కాంగ్రెస్‌దే
- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

**విశ్వంభర, హైదరాబాద్:** దివ్యాగులను మోసగించిన చరిత్ర ఈ దేశంలోనే లేదని, ఆ ఘనత ఈ కాంగ్రెస్ సర్కారుకే దక్కుతుందని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్, వికలాంగుల హక్కుల పోరాట సమితి సంయుక్త ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వృద్ధులు, వింతంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగుల పింఛన్లపై రేవంత్ సర్కారు అనుసరిస్తున్న తీరును ఎండగట్టారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయా వర్గాలకు పింఛన్లు ఇవ్వడంతో పాటు వాటిని పెంచి వారికి ఆసరా అందించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలల కావస్తుందని, ఇప్పటి వరకు పింఛన్లు చెల్లించకపోవడం అత్యంత విచారకరమన్నారు. సొంతంగా పనులు చేసుకోలేని దివ్యాంగులను సైతం విస్మరించారని, మానవత్వం లేని వారు మాత్రమే వారి విస్మరిస్తారన్నారు. రేవంత్ రెడ్డి సర్కారుకు మానవత్వం లేదని ఆరోపించారు. చేయూత పథకంలో అర్హులైన ప్రతి ఒక్కరిని చిన్న చూపుచూస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో చేయూత పింఛన్లు ఒకటని, ప్రభుత్వం ఏర్పడిన మొదటి నెల నుంచి చేయూత పింఛన్లు ఎందుకు అందించలేదని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం ఆయా లబ్దిదారులకు ఒకటి నుంచి పదో తేదీలోపు పింఛన్లు చెల్లించేవారని గుర్తు చేశారు. ఈ ఏడు నెలల కాలంలో నెలకు రూ.896 కోట్ల చొప్పున సుమారు రూ.6,300 కోట్లు చేయూత పింఛన్లు అందాల్సి ఉందని, పెంచుతామని చెప్పి ఆ పింఛన్లు ఎక్కడికిపోతున్నాయని ప్రశ్నించారు.

## తెలంగాణ విద్యుత్ కమిషన్ పై హైకోర్టును ఆశ్రయించిన మాజీ సీఎం కేసీఆర్



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ విద్యుత్ కమిషన్ పై మాజీ సీఎం కేసీఆర్, గులాబీ బాస్ కేసీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ ని రద్దు చేయాలని.. రిట్ పిటిషన్ ని మాజీ సీఎం కేసీఆర్ దాఖలు చేశారు. కమిషన్ ఏర్పాటు సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని కేసీఆర్ తన పిటిషన్ లో పేర్కొన్నారు. నిబంధనల మేరకే విద్యుత్ కొనుగోలు జరిగిందని కేసీఆర్ చెప్పారు. పిటిషన్ లో ప్రతివాదులుగా కమిషన్, జస్టిస్ నరసింహారెడ్డిలను చేర్చారు. తెలంగాణ విద్యుత్ కమిషన్ పై హైకోర్టును ఆశ్రయించారు మాజీ సీఎం కేసీఆర్. జస్టిస్ నర్సింహారెడ్డి ప్రెస్ మీట్లు పెట్టి మరీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్న కేసీఆర్. ప్రప్రతివాదులుగా విద్యుత్ కమిషన్, జస్టిస్ నర్సింహారెడ్డి, ఎనర్జీ విభాగం ని చేర్చారు. మరోవైపు మాజీ సీఎం కేసీఆర్ కి హైకోర్టులో ఊరట లభించింది. 2011 రైల్ రోకో కేసు విచారనపై ధర్మాసనం స్టేవిధించింది. ప్రతీవాదులకు నోటీసులు జారీ చేస్తూ.. జులై 18కి వాయిదా వేసింది.

## ఎంతో మంది ప్రాణాలను బలితీసుకుంది

- బీజేపీ సిటీ ఆఫీస్‌లో ఎమర్జెన్సీ వ్యతిరేక దినం
- ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన వారికి సన్మానం
- రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్

**విశ్వంభర, హైదరాబాద్:** కాంగ్రెస్ ఎంతో మంది ప్రాణాలను బలితీసుకుందని.. కాంగ్రెస్ పార్టీ ఆలస్యం చేయడం వల్ల తెలంగాణ కోసం 1200 మంది చనిపోయారని రాజ్యసభ సభ్యుడు డా. లక్ష్మణ్ అన్నారు. బీజేపీ సిటీ ఆఫీస్ లో ఎమర్జెన్సీ వ్యతిరేక దినం నిర్వహించారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన వారికి సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ మాట్లాడారు. కోదండ రామ్ లాంటి వాళ్ళు ఎమర్జెన్సీ గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కోదండ రామ్ దేనికోసం నోరు మెదపడం లేదని అడిగారు. కమ్యూనిష్టులు ఎమర్జెన్సీని సమర్థించారని..వారిని చరిత్ర క్షమించదని రాజ్యసభ సభ్యుడు డా. లక్ష్మణ్ మండిపడ్డారు. కాంగ్రెస్ వాళ్లు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి రాజ్యాంగానికి తూట్లు పొడిచారన్నారు. ప్రధాని మోడీ వచ్చాక అగ్రవర్ణ పేదలకు సైతం రిజర్వేషన్లు ఇచ్చామని గుర్తుచేశారు. రిజర్వేషన్ల రద్దు అంటూ కాంగ్రెస్ చేసిన దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మలేదని.. ఎమర్జెన్సీ నీ బ్లాక్ డే గా జరుపుకుంటూ ఆనాడు ఎమర్జన్సీకి వ్యతిరేకంగా పోరాడిన వారిని సన్మానించుకుంటున్నమ చెప్పారు. కాంగ్రెస్ చరిత్ర భవిష్యత్ తరాలకు తెలియాలన్నారు.





## భట్టితో ఉమ్మడి పాలమూరు
# జిల్లా ఎమ్మెల్యేల సమీక్ష

**విశ్వంభర, ఆమనగల్లు :** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షత న ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ట్రాన్స్ కో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించా రు. వివిధ ప్రాజెక్టులపై జిల్లాలోని ఎమ్మెల్యేలు అధికారులతో చర్చించారు. కొనసాగించాల్సిన ప్రాజెక్టులు మరియు ఆగిపోయిన ప్రాజెక్టులపై మంత్రులకు, ఎమ్మెల్యేలకు అధికారులకు వివ రించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయ ణరెడ్డి తన నియోజకవర్గంలోని కల్వకుర్తి ఎత్తి పోతల డి -82 కాలువ పనుల జాప్యానికి గల కారణాలను తెలిపాలని కోరారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూ పల్లి కృష్ణారావు, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారా యణరెడ్డి. మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంలో కలెక్టర్ పూజలు



**భూపాలపల్లి, విశ్వంభర :** భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వ ర ముక్తీశ్వర స్వామి వారిని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు రాజగోపురం నుండి పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామి వారి ఆలయంలో అభిషేకం, అమ్మవారి ఆలయంలో దర్శనం చేసుకున్నారు. అనంతరం అర్చక స్వాములు స్వామివారి శేష వస్త్రాలతో ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, ఆలయ కార్యనిర్వాహణ అధికారి మారు తి, కాళేశ్వరం ఎంపీటీసీ మమత నాగరాజు, వివిధ శాఖల అధికారులు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫలించిన కార్పొరేటర్ శ్రవణ్ పోరాటం

## నాలా పూడిక తీత ప్రారంభం



**మల్కాజ్గిరి, విశ్వంభర :** మల్కాజ్గిరి డివిజన్ బల రాంనగర్‌లో దాదాపు 15 లక్షల రూపాయల వ్యయంతో సీసీ రోడ్ పనులను మొదలు పెట్టడం జరిగింది. తదుపరి కృపా కాంప్లెక్స్ వద్ద గల మురుగు నీటి శుద్ధి కేంద్రం వద్ద జరుగుతున్న నాలా పూడిక తీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా త్వరితగతిన పనులు పూర్తి చేయాలనీ అధికారులకు, గుత్తే దారునికి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో డి.ఈ మహేష్, ఏఈ దీపక్, ప్రధాన కీటక పరిశోధకుడు దుర్గ ప్రసాద్, ఏ.ఈ వర్క్ ఇన్స్పెక్టర్ రమేష్, వనజ బీజేపీ సీనియర్ నాయకులు విజయ్‌కుమార్, సూరజ్, నాగరాజ్, ప్రశాంత్, గిరి పాల్గొన్నారు.

## సామాన్యుడికి న్యాయం జరిగేలా
# పోలీసింగ్ ఉండాలి : ఎస్పీ




**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా పరిధిలో సామాన్యుడిని దృష్టిలో పెట్టుకొని వారికి భరోసా కలిగించే విధంగా పోలీసింగ్ ఉండాలని, ప్రజలకు మార్గదర్శకంగా ఉండా ల్సిన పోలీసులు, అనైతిక చర్యలకు పాల్పడితే క్రమశిక్షణ చర్యలతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే హెచ్చరించారు. జిల్లా పోలీసు అధికారులు శాంతి భద్రతల విషయం లో కఠినంగా వ్యవరించాలని, నేరాల నియం త్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పోలీ సుస్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వ రమే పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ పాల్గొని మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కేసుల్లో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌ను పెంపొం దించి, కేసుల దర్యాప్తును పూర్తి చేయాలన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ తీవ్రమైన నేరాలకు సంబం ధించిన కేసుల్లో విచారణను త్వరగా పూర్తిచేసి చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. ప్రతీ కేసుకు సంబంధించి ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని, లక్ష్యం నిర్దేశించుకుని విధులు నిర్వహించాల న్నారు. చోరీ కేసుల్లో అన్ని కోణాల్లో విచారణ చేసి చోరీలకు పాల్పడిన వారిని గుర్తించి సొత్తు ను రాబట్టాలన్నారు. ప్రతీ రోజు వాహనాల తనిఖీలు నిర్వహించాలని ఎస్పీ పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేయాలని, జిల్లా పరిధిలో గంజాయి రవాణా దారులు, వినియోగదారు లపై పటిష్ట నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, చెడు పనులను ఎవరూ ప్రోత్సహించిన ఉపేక్షిం చేదిలేదని ఎస్పీ కిరణ్ ఖరే హెచ్చరిచారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి, కాటారం, సైబర్ క్రైమ్ డీఎస్పీలు సంపత్ రావు, రామ్మోహన్ రెడ్డి, సుభాష్ బాబు, జిల్లా పరిధిలోని సీఐలు ఎస్సైలు పాల్గొన్నారు.

# ఫ్లైఓవర్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**ఎల్బి.నగర్, విశ్వంభర :** ఎల్బీనగర్ నియోజక వర్గ పరిధిలోని పనామా వద్ద నూతనంగా నిర్మాణం చేపడుతున్న ఫ్లైఓవర్ పనులనుఎల్బీనగర్ శాసనసభ్యులు. దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ చింతలకుంటపై ఎలక్ట్రానిక్ మొబైల్స్ పరిధి నుండి ప్రా రంభం అయి సుష్మ జంక్షన్ పరిధి వరకు ఫ్లైఓవర్ నిర్మా ణం దాదాపు 850 మీటర్ల మేర ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్ట డం జరుగుతుందని తెలిపారు. ఫ్లైఓవర్ సకాలంలో పూర్తి అయితే ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవని తెలిపారు. అలాగే చంపాపేట డి మార్ట్ దగ్గర ఒక ఫ్లై ఓవర్, బి.ఎన్.రెడ్డి. నగర్ సర్కిల్ వద్ద మరో ఫ్లైఓవర్ నిర్మాణం కోసం ప్రతిపా దనలు చేయడం జరిగిందని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే ప్రధాన ట్రాఫిక్ సమస్యలు ఉన్న ప్రదేశా ల్లో ఫ్లైఓవర్లు, అండర్ పాస్ లు నిర్మించి తీవ్రమైన ట్రాఫిక్ సమస్యల నుంచి ప్రజలకు విముక్తి కల్గించేలా చర్యలు తీసుకుంటామని తెలియజే సారు. ప్రస్తుత ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో భాగంగా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, భద్రత విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.



# కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

## ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్

**విశ్వంభర, కడెం:** కాంగ్రెస్ తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ అన్నారు. మంగళ వారం మండలంలోని నవాబ్ పేట్, చిట్యాల, సారంగా పూర్, ధర్మాజీపేట్ గ్రామాల్లో బీటీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. అనంతరం కడెం ప్రాజెక్టును సందర్శిం చారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కడెం ప్రాజెక్టు ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందజేస్తామన్నారు. గత ప్రభుత్వం కడెం ప్రాజెక్టును పట్టించుకోకపోవడం వల్లే ఈ ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోయారని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి తొమ్మిది కోట్ల 21 లక్షల నిధుల ను మంజూరు చేసి కడెం ప్రాజెక్టు కు పూర్తిస్థాయి మర మ్మతులు చేయించిందన్నారు. గ్రామాల అభివృద్దే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపిటా వేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అలెగ్జాండర్, జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షుడు తుమ్మల మల్లేష్ యాదవ్ , యువజన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పొద్దుటూరి సతీష్ రెడ్డి, నాయకులు చంద్రశేఖర్, బొడ్డు గంగన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో రాష్ట్ర మంత్రుల భేటి



**న్యూఢిల్లీ, విశ్వంభర :** కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డిని ఢిల్లీలో ఆయన నివాసంలో తెలంగాణ మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించామని తెలియ జేసారు. తెలంగాణ నుండి వరసగా రెండవ సారి కేంద్ర మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం..రాష్ట్ర ప్రభుత్వానికి సహాయ సహకారాలు అందించాలని కోరడం జరిగింది అని తెలిపారు. అలాగే వారు కూడా సహృదయంతో రాష్ట్ర అభివృద్ధికి పార్టీలకు అతీతంగా అండగా ఉంటామని చెప్పా రని తెలంగాణ మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొం గులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు .ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి, రావాల్సిన నిధుల మంజూరు గురించి ప్రత్యేక చొరవ చూపాలని కోరగా..నా సంపూర్ణ సహకారం ఎప్పుడూ ఉంటుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.



## భూపాలపల్లి జిల్లాలో మహిళ దారుణ హత్య

**విశ్వంభర, కాటారం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో దారుణ సంఘటన జరిగింది. మహిళను చున్నీతో దారుణంగా హత్య చేసి ఆమెపై ఉన్న బంగారు నగలను దోచుకెళ్లిన సంఘటన భూపాలపల్లి పట్టణ కేంద్రంలోని ఫకీర్ గడ్డ ప్రాంతంలో మంగళవారం జరిగింది. ఫకీర్ గడ్డకు చెందిన ఇస్లావత్ సుమతి అనే మహిళను ఇంటి వద్దనే మెడకు చున్నీతో చుట్టి హత్య చేసి పక్కనే శవాన్ని పడేశారు. సుమతి శరీరంపై ఉన్న బంగారాన్ని హత్య చేసిన వ్యక్తి దోచుకెళ్ళినట్లు సమాచారం. కట్టుకున్న భర్తే కాలయముడై కాటికి పంపినట్లు చర్చించుకుంటున్నారు. మృతురాలు సుమతికి కొడుకు కూతురు ఉన్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పూర్తి వివరాలు సేకరించి కేసు నమోదు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇస్లావత్ సుమతిని ఎవరు హత్య చేశారు. అందుకు గల కారణాలను అన్వేషిస్తున్నారు.

## పాఠశాలల బంద్ విజయవంతం

**ఆమనగల్లు, విశ్వంభర :** ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం పాఠశాలల బంద్ కు పిలుపునిచ్చారు. ఆమనగల్లు ఏబీవీపీ నగర కార్యదర్శి పురుగుల శివ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదు-పాయాలు లేక విద్యార్థుల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వంపై మండిపడ్డారు. ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్లో ఫీజుల నియంత్రణ చట్టం చేయాలని ప్రైవేట్ స్కూళ్లలో బుక్స్ యూనిఫార్మ్స్ అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం డిఈఓ ,ఎంఈఓ లను నియమించాలని కోరారు. మధ్యాహ్నం భోజనం అవకతవకలపై విచారణ జరపాలని మెగా డీఎస్సీ ద్వారా 24 వేల ఖాళీలను భర్తీ చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళేందుకు బందుకు పిలుపునిచ్చినట్లు ఆయన తెలిపారు . ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోరటి భరత్ ,రాష్ట్ర నాయకులు లండం మల్లేష్ ,గోపిగిరి నరేష్, ఎడవెల్లి అభి, కాసోజు శివ చారి, నేనావత్ సుమన్ నాయక్, అనిల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## కొప్పుల రాజుని కలిసిన ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**న్యూ ఢిల్లీ, విశ్వంభర :** ఏఐసిసి ఎస్సి,ఎస్టీ,బీసీ,మైనారిటీ జాతీయ కోర్డినేటర్ కొప్పుల రాజుని వరంగల్ ఎంపీ కడియం కావ్య, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మర్యాద పూర్వకంగా ఆయన నివాసంలో కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కొప్పుల రాజు మాట్లాడుతూ వరంగ ల్ పార్లమెంట్ స్థానం నుండి తొలిసారి ఎంపీగా ఎన్నికై నేడు పార్లమెంట్ లో ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసిన డాక్టర్ కడియం కావ్యకి శు భాకాంక్షలు తెలిపారు. ఎంపీగా ప్రమాణ స్వీకారం కోసం తన తండ్రి కడియం శ్రీహరి తో కలిసి ఢిల్లీకి రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఇంతటి ఘన విజయాన్ని అందించి పార్లమెంట్ కి పంపించిన వరంగల్ ప్రజలకు ,తెలంగాణ కాంగ్రెస్ అధిష్టానికి ధన్యవాదాలు తెలిపారు .



## ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌గా హేమంత పాటిల్ కేశవ్

**ఎల్బీ నగర్ , విశ్వంభర :** బీ- తెలంగాణ రాష్ట్ర వ్యాప్తం గా జరుగుతున్నటువంటి బదిలీల నేపథ్యంలో ఎల్బీనగర్ నూతన జోనల్ కమిషనర్ గా హేమంత పాటిల్ కేశవ్ నియమితులయ్యారు. అంతకుముం దు హైదరాబాద్ అడిషనల్ కలెక్టర్, రెవెన్యూ విభాగంలో బాధ్యతలు నిర్వహించిన హేమంత పాటిల్ కేశవ్ బదిలీ అయ్యి ఎల్బీనగర్ జోనల్ కమి షనర్‌గా నియమితులయ్యారు. కార్యాలయం లోని సిబ్బంది ఆయనని మర్యాదపూర్వకంగా కలిసి శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా హేమంత పాటిల్ కేశవ్ మాట్లాడుతూ జోనల్ పరి ధిలోని సమస్యల పరిష్కారానికి కృషిచేసి సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా హయత్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్. తిప్పర్తి యాదయ్య తో పాటు జోనల్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.



నల్గొండ పట్టణం మర్రిగూడెం బైపాస్ రోడ్డు పక్కన కళ్యాణ కనకదుర్గమ్మ దేవాలయం మొదటి వార్షికోత్సవ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు, హైదరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ కొంపల్లి మాధవిలత హాజరయ్యారు.

– నల్గొండ, విశ్వంభర



# తన ఉనికి కోసమే దేవుడిపై ఒట్టేసాడు

**కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ప్రణయ్ బాబు**

**విశ్వంభర, హుజురాబాద్ రూరల్ :** హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తన ఉనికిని కాపాడుకోవడం కోసమే దేవుడిపై ఒట్టేసాడని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఓడితల ప్రణయ్ బాబు ఎద్దేవా చేశారు. చెల్పూర్ లో ఉద్రిక్తతల అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... అబద్ధాలు ఆడుతున్నానని తన అంతరాత్మకు తెలిసినా దేవుడి పై ఒట్టేయడం సిగ్గు చేటు అన్నారు. ఉద్యోగాల పేరుతో డబ్బులు తీసుకున్నాడని తాము సాక్షాధారాలతో వస్తే అతను అంతరాత్మను చంపుకొని దేవుడిపై ఒట్టేసాడని అన్నారు. ఎన్నికల సమయంలో కుటుంబాన్ని అడ్డుపెట్టుకొని గెలిచిన కౌశిక్ రెడ్డిని తాము ఎమ్మెల్యేగా చూడడం లేదని ఒక జోకర్‌గా చూస్తున్నామని పేర్కొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎలాంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుందని అన్నారు. గత ఆరు నెలల్లో కౌశిక్ రెడ్డి నియోజకవర్గంలో చిల్ల రాజకీయాలు తప్ప ఎలాంటి అభివృద్ధి చేయలేదని, బ్లాక్ మెయిల్ చేయడంలో కౌశిక్ రెడ్డి చరిత్ర సృష్టించాడని అన్నారు. ప్లాయుష్ ఓవర్ లోడ్ పేరుతో కౌశిక్ రెడ్డి ఓవర్ యాక్షన్ చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

**ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

**విశ్వంభర, గుడిహత్నూర్ :** ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని జిల్లా పరిషత్ సెకండరీ స్కూల్ మన్నూరు పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉపాధ్యాయులతో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం రుచికరమైనది, నాణ్యమైనది అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజనం వంట చేసే ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పాఠశాలలోని విద్యార్థులతో ముచ్చటిస్తూ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు.

ఉన్నత స్థానాలకు ఎదిగి పాఠశాలకు తమ తల్లిదండ్రులకు ఊరికి మంచి పేరు తేవాలన్నారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ కేంద్రే జ్ఞాను, నాయకులు తిరుమలగౌడ్, పాండురంగ్ తదితరులు ఉన్నారు.




## నాటు సారా, నల్లబెల్లం, గంజాయి
# నిర్మూలించడం ప్రతి ఒక్కరి బాధ్యత

**ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు**

**విశ్వంభర, దుమ్ముగూడెం :** సమాజంలో నాటు సారా, నల్లబెల్లం, గంజాయి వంటి నిషేధిత మత్తు పదార్థాలను నిర్మూలించడంలో ప్రతి ఒక్కరూ భాద్యతగా వ్యవహరించాలని భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు పేర్కొన్నారు. దుమ్ముగూడెం మండలంలోని ఎంపిడిఓ కార్యాలయంలో మంగళవారం నాటు సారా, నల్లబెల్లం, గంజాయి నిర్మూలనకై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడారు. మండలంలో పలు గ్రామాల్లో నాటుసారా విక్రయాలు అధికంగా జరుగుతున్నాయని వాటిని నియంత్రించేందుకు ఎక్సైజ్ శాఖ ఉక్కుపాదం మోపాలన్నారు. నాటు సారా, నల్లబెల్లం, గంజాయి రవాణా మూలాలను కనుక్కొని వాటిని అరికట్టే దిశగా సంబంధిత ఎక్సైజ్, పోలీస్ శాఖలు పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ చంద్రశేఖర్, సర్కిల్ ఇన్స్పెక్టర్ అశోక్, మండల అధికారులు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు పెంచాలి

- **సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన పెంచాలి**
- **జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్**

**విశ్వంభర, నంగునూరు:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలను పెంచాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం నంగునూరు మండలం గట్ల మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమైనందున సీజన్ లో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సిబ్బంది సమయం పాలన పాటించాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలో అందుతున్న సేవలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రతి మంగళవారం మహిళాల కోసం నిర్వహించే క్లినిక్ లపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే మహిళలకు అన్ని రకాల వైద్య సేవలు అందేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నందున ప్రజలకు సీజనల్ గా వచ్చే వ్యాధులపై అప్రమత్తం చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల గ్రామాల వారిగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. స్థానికంగా ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపి పెంచాలన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని, ఫార్మసీ స్టోర్‌ను పరిశీలించారు. గట్ల మల్యాలలో నిర్మాణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ ఓ డాక్టర్ కాశీనాథ్, పిహెచ్ సి వైద్యాధికారి డాక్టర్ అంజలి రెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణానికి ఏర్పాట్లు

- **భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు**
- **అధికారులు సమన్వయం చేసుకుంటూ కంట్రోల్ రూం ద్వారా నిరంతర పర్యవేక్షణ**
- **మంత్రి పొన్నం ప్రభాకర్**



**విశ్వంభర, హైదరాబాద్, జూన్ 25 :** ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టింది. ఇప్పటికే దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అన్ని విభాగాల ఉన్నతాధికారులతో రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఇక ముఖ్యమైన దేవాలయాల వారీగా సమావేశాలు కొనసాగుతుండడంతో జూలై 8,9,10 వ తేదీల్లో జరిగే బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం, ఉత్సవాల పై హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జూలై 8,9,10 తేదీల్లో జరిగే అమ్మవారి కళ్యాణం, రథోత్సవం, తదితర కార్యక్రమాల పై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ,భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈసారి మహ లక్ష్మి ద్వారా ఉచిత బస్సు ప్రయాణం ఉండడంతో గతంలో కంటే భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. గుడి చుట్టుపక్కల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ,గతంలో భారీకెడ్లు ఎత్తులో ఉండడం వల్ల భక్తులకు ఇబ్బందులు తలెత్తాయని ఈసారి భారీకెడ్ల ఎత్తు తగ్గించి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆర్ అండ్ బీ అధికారులకు సూచించారు.. సూచిక బోర్డులు , ఎమర్జెన్సీ ఎక్సిట్ గేట్లు , క్యులైన్ లలో భక్తులకు కొంత ప్లేస్ ఉండేవిధంగా ఏర్పాటు చేయడంతో పాటు వారికి తాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.. గత బోనాల సమయంలో వివిఐపి పాసులు అధికంగా ఇవ్వడం వల్ల భక్తులకు ఇబ్బందులు తలెత్తాయని పోలీసులు మంత్రి గారి దృష్టికి తీసుకొచ్చారు. ఈసారి ప్రతి గుడిలో వీవీఐపీ పాసులు తగ్గేలా దేవాదాయ శాఖ అధికారులు, సమన్వయం చేసుకోవాలని సూచించారు. తమ ప్రభుత్వం శాంతి భద్రతలకు తొలి ప్రాధాన్యత ఇస్తుందని మహిళా భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక షీ టీమ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. గుడికి చుట్టుపక్కల ఉన్న రోడ్లలో ట్రాఫిక్ డైవర్షన్ చేసుకునేలా ట్రాఫిక్ పోలీసులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. నిరంతర విద్యుత్ ఉండడంతో పాటు ప్రత్యేక జనరేటర్లు ,మొబైల్ ట్రాన్సఫర్మర్లు, ప్రత్యేక ఎలక్ట్రిక్ ఉద్యోగులు నిరంతరం అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మొబైల్ టాయిలెట్స్ , ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయాలి. బ్లీచింగ్ ద్వారా క్లోరినేషన్ చేయాలి. జీహెచ్ఎంసీ నిరంతర శానిటేషన్ బృందాలను పర్యవేక్షించాలి. 20 వాటర్ ట్యాంకర్లు అదనంగా నిరంతరం అందుబాటులో ఉంచాలి. జూలై 8,9,10 వ తేదీల్లో బల్కంపేట ప్రాంతంలో నిరంతం నీరు అందేలా వాటర్ వర్క్స్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కళ్యాణం తరువాత రథోత్సవం సమయంలో ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలి. హెల్త్ క్యాంప్‌లు ఏర్పాటు చేయాలి,చిన్న అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలి ప్రత్యేక సీపీఆర్ బృందాలకు శిక్షణ ఇచ్చి అందుబాటులో ఉంచాలి. ఫైర్ ఇంజన్లు ఏర్పాటు చేయాలి. టూ వీలర్ ఫైర్ వెహికిల్ శిక్షణ పొందిన ఫైర్ సిబ్బంది ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేయాలి. తెలంగాణ ఆర్టీసి బోనాల జాతర కి ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేసింది. ప్రయాణికులు అధికంగా వచ్చే అవకాశం ఉంది కాబట్టి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. బస్ స్టేషన్ లో వద్ద ఈవ్ టీజింగ్ కి తావు లేకుండా మహిళా పోలీసు బృందాలు ఏర్పాటు చేయాలి.. ఉత్సవాల సందర్భంగా 500 మంది ప్రత్యేక కళాకారుల వివిధ ప్రదర్శనలు చేయనున్నాయి. భక్తులకు సమాచారం అందించడానికి ఎల్ఈడి స్క్రీన్‌లు, దాదాపు కిలోమీటరు దూరం వరకు వినిపించే విధంగా మైక్ సిస్టం ఏర్పాటు చేయాలి. స్థానిక దేవాలయ కమిటీలు పలు సమస్యలను మంత్రి గారి దృష్టికి తీసుకొచ్చారు. ఉత్సవాల సందర్భంగా డీజే కి అనుమతి ఇవ్వదని వారు కోరగా పోలీసులు బల్కంపేట ఉత్సవాలకు డిజే అనుమతి ఇవ్వడం లేదని పోలీసులు అధికారులు తెలిపారు.. ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల సందర్భంగా భక్తుల సహకారం కూడా కావాలని ఒక్కో దేవాలయంలో ఒక్కోసారి ఉత్సవాలు జరుగుతున్నందున అధికారులు సమన్వయం చేసుకోవాలి. అమ్మవారి ఉత్సవాలు విజయవంతంగా జరిగే విధంగా అమ్మ వారి ఆశీర్వాదం ఇవ్వాలని మంత్రి కోరారు. ఈ సమీక్షా సమావేశంలో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయ లక్ష్మి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ ,కార్యదర్శి హన్మంతరావు,వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్ ,ట్రాఫిస్ డిసిపి రాహుల్ హెగ్డే, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంత్, సనత్ నగర్ కాంగ్రెస్ ఇన్చార్జి కోటా నీలిమ, స్థానిక కార్పొరేటర్, సరళ ముఖ్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బీసీలకు ఐదు మంత్రి పదవులు ఇవ్వాలి

**బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య**



**విశ్వంభర, హిమాయత్‌నగర్ :** త్వరలో జరగబోయే మంత్రివర్గ విస్తరణలో బీసీలకు 5 మంత్రి పదవులు ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేషనల్ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన 22 బీసీ కుల సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీ ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ గతంలో జరిగిన మంత్రివర్గ నిర్మాణంలో బీసీలకు కేవలం 2 మంత్రి పదవులు ఇచ్చి బీసీలకు అన్యాయం చేశారని అన్నారు. కనీసం ఇప్పుడు జరగబోయే విస్తరణలో 5 మందికి అవకాశం కలిపిస్తే న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ బీసీలకు జనాభా ప్రకారం రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తామని దేశవ్యాప్తంగా బహిరంగ సభలలో ప్రసంగిస్తుంటే ఇక్కడ రాష్ట్రంలో బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. ముఖ్యంగా బీసీ కులాలలో అత్యధిక జనాభా గల కురుమ గొల్లలు, ముదిరాజులు, మున్నూరు కాపు, విశ్వబ్రాహ్మణ, రజక, నాయి బ్రాహ్మణ, వడ్డెర, బలిజ తదితర కులాలకు ప్రాతినిధ్యం కల్పించలేదన్నారు. ఈ దఫ్ఫా బిసిలలో ఉన్న కులాలకు మంత్రివర్గ విస్తరణలో ఉన్న అన్ని కులాలకు ప్రాతినిధ్యం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బీసీలకు కేవలం 22 టికెట్లు కేటాయించి అన్యాయం చేశారని, అప్పుడు ప్రతిపక్షంలో ఉన్నారు.

అధికారంలోకి రావాలంటే గెలుపు గుర్రాలు నినాదం ఇచ్చి అర్థ బలం, అంగబలం బీసీలకు అన్యాయం చేశారన్నారు. ఇప్పుడు అధికారంలోకి పార్టీ బలపడ్డదని, కనీసం ఇప్పుడైనా బీసీలకు జనాభా ప్రకారం ఇవ్వాలని తెలిపారు. నామినేటెడ్ పోస్టుల్లో 50శాతం కోటా ఇవ్వాలన్నారు. కార్పొరేషన్ ప్రభుత్వ రంగ సంస్థల్లో ఇతర సంస్థల చైర్మన్, డైరెక్టర్ పోస్టులలో బీసీలకు 50శాతం కోటా ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర నేతలు చిల్లంపల్లి రమేష్, టి.నందగోపాల్, వేముల రామకృష్ణ, కోటేశ్వరి, మేడి రాందేవ్, అమృత, ఉమా, చిరంజీవి గౌడ్, ఆశిష్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల ఉనికిని కనుగొనడానికి
# పోలీసు జాగిలాలు

**జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్**



**విశ్వంభర, సంగారెడ్డి :** మాదక ద్రవ్యాల ఉనికిని కనుగొనడా నికి పోలీసు జాగిలాలు తోడ్పతాయని సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఉన్న డాగ్ స్క్వాడ్ ను ఎస్పీ సందర్శించి, జాగిలాల పని తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, నార్కోటిక్ డ్రగ్స్, ఓపియం, అల్ఫ్రాజోలం వంటి మాదక ద్రవ్యాల మూలాలు లేకుండా చేయడానికి జిల్లా పోలీసు శాఖ అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. గంజాయి, అల్ఫ్రాజోలం వంటి మాదక ద్రవ్యాల అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా జాగిలాల సేవలను వినియోగించుకొని మరిన్ని సత్ఫలితాలు రాబట్టాలన్నారు. డాగ్ హ్యాండ్లర్స్ విశ్వనాథమ్, మొగులయ్య, జగదీశ్వర్, అంజయ్యలతో మాట్లాడుతూ.. శిక్షణలో ఏమాత్రం ఏమరపాటు తగదని నాణ్యమైన శిక్షణను అందించి, మాదక ద్రవ్యాల ఆచూకీని గుర్తించే విధంగా ఉండాలని సూచించారు.



# ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలి

**ఎమ్మెల్యే యశస్వి రెడ్డి**

**విశ్వంభర, రాయపర్తి :** ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించి వైద్యాధికారుల సూచనలు సలహాల మేరకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకుని ఆరోగ్యంగా ఉండాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి కోరారు. మండలంలోని కొత్తూరు గ్రామంలో జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ ఆవరణలో మంగళవారం హనుమకొండ ఏకశిలా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరానికి ముఖ్యఅతిథిగా పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభిం చారు. అనంతరం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లా డుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవ కాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాల న్నారు. వైద్యుల సలహాల మేరకు వైద్య పరీక్షలు చేయించుకుని మందులు వాడాలన్నారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా అధికారులు ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టి శుభ్రం పరచాలన్నారు. ఏకశిలా హాస్పిటల్ వారు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయం అని వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.. ఈ వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలకు వచ్చిన వారితో ఎమ్మెల్యే కాసేపు ముచ్చటించారు. ఆమె వెంట ఏకశిలా హాస్పిటల్ వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హ్యామ్య నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, నాయకులు మాచర్ల ప్రభాకర్, రెంటాల గోవర్ధన్ రెడ్డి, కృష్ణారెడ్డి, ఊగ మునిత, యాదయ్య సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు,

# స్పీకర్ ఎన్నిక అనివార్యం!



- సభాపతి రేసులో ఇండియా కూటమి
- కేరళ ఎంపీ కె.సురేష్ నామినేషన్
- ఎన్డీయే తరపున ఓం బిర్లా
- దేశ చరిత్రలోనే తొలిసారి
- నేడు జరుగనున్న స్పీకర్ ఎన్నిక

**విశ్వంభర, ఢిల్లీ :** 18వ లోక్‌సభ స్పీకర్ ఎన్నిక విష యంలో అధికార, విపక్షాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. ఈ క్రమంలో స్పీకర్ పదవిపై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. విపక్ష కూటమి డిప్యూటీ స్పీకర్ పదవి ఆశించగా.. అది దక్కకపోవడంతో స్పీకర్ పదవి కోసం పోటీ పడుతోంది. అయితే, ఎప్పటిలాగే లోక్‌సభ స్పీకర్ పదవిని ఏకగ్రీవం చేసేం దుకు ఎన్డీయే) ప్రభుత్వం యత్నించగా.. కూటమి సై తం బరిలోకి దిగడంతో అది సాధ్యపడలేదు. తమకు డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వాలని పట్టుబట్టినా ఎలాం టి నిర్ణయం వెలువడకపోవడంతో సభాపతి స్థానం కోసం కూటమి బరిలో నిలిచింది.

### దేశ చరిత్రలోనే తొలిసారిగా..

ఈ క్రమంలో స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే తొలి సారిగా లోక్‌సభ స్పీకర్ పదవికి ఎన్నిక జరగనుంది. సభాపతి పదవి కోసం ఎన్డీయే తరపున ఓంబిర్లా కూటమి తరపున కేరళ కాంగ్రెస్ ఎంపీ కె.సురేశ్ బరిలో నిలిచారు. ఈ ఇద్దరు నేతలు స్పీకర్ పదవి కోసం మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. వాస్తవానికి లోక్‌సభలో స్పీకర్ పదవిని అధికార పక్షం, డిప్యూటీ స్పీకర్ పదవిని విపక్షం తీసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. గత హయాంలో డిప్యూటీ స్పీకర్ లేకుండానే సభలు నడిచాయి. అయితే, ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో దిగువ సభలో తమ బలాన్ని పెంచుకున్న ప్రతిపక్షాలు ఈసారి మాత్రం డిప్యూటీ స్పీకర్ పదవి కోసం పట్టుబట్టాయి. తమకు డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వాల్సిందేనని.. లేకుంటే సభాపతి స్థానం కోసం తాము అభ్యర్థిని నిలబెడతా మని చెప్పాయి. ఈ క్రమంలో బీజేపీ కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను రంగంలోకి దించింది. ఆయన మంగళవారం ఉదయం నుంచీ కూటమి నేతలు మల్లి కార్జునఖర్గే, ఎంకే స్టాలిన్, ఇతర నేతలతోనూ వరుస చర్చలు జరిపారు. స్పీకర్ పదవికి ఏకగ్రీవంగా ఎన్నిక య్యే సంప్రదాయాన్ని కొనసాగిద్దామని.. అందుకు సహకరించాలని కోరారు. అయితే, డిప్యూటీ స్పీకర్ పదవిని తమకు ఇవ్వాలని ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. ఇందుకు ఎన్డీయే ప్రభుత్వం అంగీకరించలేదు. ఈ క్రమంలో ప్రతిపక్షాలు సైతం లోక్ సభ స్పీకర్ పదవి కోసం బరిలో నిలిచాయి. మంగళవారంతో స్పీకర్ పదవి కోసం నామినేషన్ ముగుస్తుండగా.. ఎన్డీయే తరపున ఓం బిర్లా, కూటమి తరపున కేరళ ఎంపీ కె.సురేశ్ నామినేషన్ దాఖలు చేశారు. దీంతో స్పీకర్ ఎన్నిక అనివార్యమైంది. నేడు ఎన్నిక నిర్వహించనున్నారు.



### 1946 తర్వాత..

1925-1946 మధ్య ఆరుసార్లు స్పీకర్ పదవికి ఎన్నికలు అవసరమయ్యాయి. చివరిసారిగా 1946 లో ఎన్నికైన కాంగ్రెస్ నేత జి.వి.మౌలాంకర్.. అనం తరం పార్లమెంటుకు కూడా స్పీకర్‌గా కొన్నాళ్లు కొన సాగారు. 1952లో తొలి సార్వత్రిక ఎన్నికల తర్వాత లోక్‌సభ, రాజ్యసభలు ఏర్పాటయ్యాయి. 1956లో మౌలంకర్ మరణంతో డిప్యూటీ స్పీకర్ అయ్యంగార్.. స్పీకర్ అయ్యారు. అనంతరం 1957లో రెండో సాధా రణ ఎన్నికల తర్వాత కూడా స్పీకర్‌గా నియమితుల య్యారు. అప్పటి నుంచి స్పీకర్ ఎన్నిక అధికార, విపక్షాల మధ్య ఏకాభిప్రాయంతోనే జరుగుతోంది. కానీ ఈసారి, ఇరు పక్షాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో స్పీకర్ ఎన్నిక అనివార్యమైంది.

## పాలపై రూ.2 పెంచేసిన కర్ణాటక

- పెంచిన ధరలు నేటి నుంచే అమల్లోకి
- మండిపడుతున్న ప్రతిపక్షాలు



**విశ్వంభర, కర్ణాటక :** కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ (కెఎంఎఫ్) మంగళవారం లీటరు పాలకు రూ. 2 పెంచింది. అంతేకాదు ఇప్పుడున్న 500 మి.లీ, 1000 మి.లీ ప్యాకెట్లకు అదనంగా 50 మి.లీ వినియోగదారులకు ఇవ్వనున్నది. ఈ మార్పుతో నందినీ 550 మి.లీ టోన్డ్ మిల్క్ (బ్లూ) రూ.24, 1050 మి.లీ ప్యాకెట్ రూ. 44 కానున్నది. ఏడాదిలో ఇలా పాల ధరను పెంచడం ఇది రెండోసారి. కాగా కొత్తగా పెంచిన ధరలు బుధవారం అమల్లోకి రానున్నది. గతంలో 2023 జులైలో లీటరు పాలకు రూ. 3 పెంచారు. కాగా కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ ఇతర ఉత్పత్తులు అంటే పెరుగు తదితర పాల పదార్థాల ధరలలో మాత్రం ఎలాంటి మార్పు ఉండబోదు. స్టాకులో ఉన్న ప్యాకట్లపై ఉన్న రేట్లే వాటికి వర్తిస్తాయని, అవి అయిపోయాక వచ్చే కొత్త స్టాకు మీదే ధరల ప్రభావం ఉ ంటుందని కర్ణాటక పాల సమాఖ్య తెలిపింది. కర్ణాటక పాల ధరలు ఇతర రాష్ట్రాలు... కేరళ, ఢిల్లీ, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ తో పోల్చుకుంటే తక్కువేనని కర్నాటక మిల్క్ ఫెడరేషన్ పేర్కొంది. ఇదిలావుండగా కర్నాటక లోని ప్రతిపక్ష బీజేపీ నాయకుడు ఆర్. అశోక్ స్పందిస్తూ.. నందిని పాల ధరలను పెంచేశారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధికారంలోకి వచ్చిన 13 నెలలలోనే ఇలా పాల ధర పెంచడం ఇది రెండోసారి. గత ఆగస్టులో రూ.3 లీటరుకు పెంచారు. ఇప్పుడు మళ్లీ లీటరుకు రూ.2 పెంచారు. రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి వర్గం వారు ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధర పెంపుతో సతమతమవుతున్నారు. ఇలాంటి నేపథ్యంలో పుండు మీద ఉప్పు చల్లినట్టు పేద వారిపై పాల ధర రుద్దారు. మీకు పేద, మధ్య తరగతి వారిపై ఏమాత్రమైనా భావోద్వేగం ఉ ంటే వెంటనే పెంచిన ధర ఉత్తర్వును వెంటనే ఉపసంహరించండి అన్నారు.

## క్షీణించిన మంత్రి అతిషి ఆరోగ్యం!



**విశ్వంభర, ఢిల్లీ :** ఢిల్లీకి హర్యానా నుంచి నీటిని విడుదల చేయాలని కోరుతూ ఆప్ మంత్రి ఆతిశీ నిరాహార దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. అయితే ఈ క్రమంలో ఆమె ఆరోగ్యం క్షీణించింది. ఇవాళ తెల్లవారుజామున ఆతిశీని ఆప్ నేతలు లోక్నాయక్ జై ప్రకాశ్ ఆస్పత్రికి తరలించారు. షుగర్ లెవెల్స్ పడిపోవడం వల్లే ఆతిశీ ఆరోగ్యం క్షీణించిందని దిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ అన్నారు. సోమవారం రాత్రే ఆతిశీ షుగర్ లెవల్స్ తగ్గిపోయాయని.. రక్త నమూనాలను ఆస్పత్రికి పంపించినప్పుడు 36 కి పడిపోయాయి అని వైద్యులు చెప్పారని భరద్వాజ్ తెలిపారు. వెంటనే వైద్యుల వద్దకు తీసుకెళ్లగా.. ప్రస్తుతం ఆతిశీకి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఢిల్లీ ప్రజలకు నీరు అందించడం కోసం గత 5 రోజులుగా మంత్రి అతీశీ నిరాహార దీక్ష చేస్తున్నారని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ తెలిపారు. ఏమీ తినకపోవడం వల్ల మరింత ఆరోగ్యం క్షీణించిందని వెల్లడించారు. ఆతిశీ రక్తనమూనాలకు ఆస్పత్రికి పంపించగా రక్తపోటు, చక్కెర స్థాయిలు తగ్గుతున్నాయని వైద్యులు నిర్ధరించారని చెప్పారు.

# కేజ్రీవాల్‌కు దక్కని ఊరట

- బెయిల్ నిలుపుదల చేస్తూ ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులు
- అవే ఉత్తర్వులు కొనసాగుతాయని ఢిల్లీ హైకోర్టు తీర్పు



**విశ్వంభర, ఢిల్లీ :** ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో అరెస్ట్ అయిన సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు ఇటీవల ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు బెయిల్ మంజూరు చేసినా.. ఆయన మాత్రం తీహార్ జైలు నుంచి బయటికి రాలేదు. ఎందుకంటే ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన బెయిల్ తీర్పును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ - ఈడీ అధికారులు.. ఢిల్లీ హైకోర్టులో దాఖలు చేయడంతో స్టే విధించింది. దీంతో తనకు ఇచ్చిన బెయిల్‌పై స్టే విధించడాన్ని సవాల్ చేస్తూ.. ఢిల్లీ సీఎం సుప్రీంకోర్టు తలుపుతట్టారు. ఢిల్లీ హైకోర్టు విధించిన స్టేపై అత్యవసరంగా విచారణ జరపాలని కోరారు. అయితే ఇందుకు నిరాకరించిన సుప్రీంకోర్టు.. ఈ నెల 26 వ తేదీన విచారణ జరుపుతామని పేర్కొంది. అంతేకాకుండా ఢిల్లీ హైకోర్టు తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు జైలులోనే ఉండాలని ఆదేశించింది. ఈ క్రమంలోనే మంగళవారం ఢిల్లీ హైకోర్టు అరవింద్ కేజ్రీవాల్ బెయిల్‌పై కీలక ఉత్తర్వులు వెలువరించింది. ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన బెయిల్‌పై స్టే కొనసాగుతుందని ప్రకటించింది. ఈ క్రమంలోనే కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేస్తూ సెషన్స్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఢిల్లీ హైకోర్టు తప్పుపట్టింది. దీంతో కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టులో ఊరట దక్కకపోవడంతో ఆయన మరికొన్ని రోజుల పాటు తీహార్ జైలులోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు.. తన బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన స్టే పై విచారణను సుప్రీంకోర్టు బుధవారం (జూన్ 26వ తేదీన) జరపనుంది. ఈ నేపథ్యంలోనే బుధవారం సుప్రీంకోర్టు ఏం తీర్పు వెలువరించనుంది అనేది తీవ్ర ఉత్కంఠను రేపుతోంది. ఇక ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఇటీవల కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేస్తూ.. ఈ నెల 20 వ తేదీన ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు కీలక తీర్పును వెలువరించింది. రూ.1 లక్ష పూచీకత్తుతో కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేస్తున్నట్లు కోర్టు తెలిపింది. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన 15 రోజుల మధ్యంతర బెయిల్‌తో బయటికి వచ్చి లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కేజ్రీవాల్.. తిరిగి జూన్ 2 వ తేదీన తీహార్ జైలులో లొంగిపోయారు. ఈ క్రమంలోనే ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో గతంలోనే రెగ్యులర్ బెయిల్ కోసం అరవింద్ కేజ్రీవాల్ పిటిషన్ దాఖలు చేయగా.. బెయిల్ వచ్చింది. అయితే ఈ కేసులో అరవింద్ కేజ్రీవాల్‌కు రౌస్ అవెన్యూ కోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని సవాల్ చేస్తూ ఈడీ అధికారులు హైకోర్టు మెట్లు ఎక్కారు.

## ప్రజ్వల్ రేవణ్ణకు మరో షాక్

### ఆయనపై నాలుగో కేసు నమోదు



**విశ్వంభర, కర్ణాటక :** మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న జేడీఎస్ నేత మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు మరో షాక్ తగిలింది. తాజాగా ఆయనపై మరో కేసు నమోదు అయింది. ఇప్పటికే ఆయనపై మూడు కేసులు నమోదు కాగా, వీటిని దర్యాప్తును చేస్తున్న కర్ణాటక పోలీసుల ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ప్రజ్వల్‌పై నాల్గవ కేసు నమోదు చేసింది. గతంలో ఉన్న మూడు కేసులలో కూడా లైంగిక వేధింపులు, వేధింపులు, నేరపూరిత బెదిరింపులు ఉండగా ఇప్పుడు కొత్త కేసులో బాధితుల ఫొటోలను రహస్యంగా రికార్డ్ చేయడం, ఇతరులకు షేర్ చేయడం వంటి సెక్షన్ల కింద నమోదు చేశారు. అయితే ఈ నాల్గవ ఎఫ్ఐఆర్‌లో ప్రజ్వల్ కాకుండా మరో ముగ్గురు వ్యక్తుల పేర్లు ఉన్నాయి, వీరిలో హసన్ మాజీ బీజేపీ ఎమ్మెల్యే ప్రీతం గౌడ్ ఉన్నారు. వీడియో కాల్‌లో బాధితురాలిని లైంగికంగా వేధించిన సమయంలో ప్రజ్వల్ రేవణ్ణ రికార్డ్ చేసిన ఫొటోలను ప్రీతం గౌడ, కిరణ్, శరత్‌లు పంచుకున్నారని బాధితురాలు ఆరోపించింది. క్లిప్‌ను ఇతరులకు షేర్ చేయడం వల్ల తన కుటుంబమంతా ఇబ్బంది పడిందని, తమ పరువు పోయిందని తన ఫిర్యాదులో పేర్కొంది. నాల్గవ ఎఫ్ఐఆర్ ఐపీసీ సెక్షన్లు 354(ఎ), 354(డి), 354(బి), 506, 66 ఈ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం కింద కేసు నమోదు చేశారు. మూడు లైంగిక వేధింపుల కేసుల్లో ప్రజ్వల్ రేవణ్ణపై 21 రోజుల పాటు కస్టడీ విచారణ జరిపిన సిట్, ఇప్పుడు నాలుగో కేసును విచారించేందుకు కస్టడీని కోరింది.

## తెలుగులో ప్రమాణ స్వీకారం చేసిన తమిళనాడు ఎంపీ



**విశ్వంభర, ఢిల్లీ:** 18వ లోక్‌సభ సమావేశాలు వరుసగా రెండో రోజూ కొనసాగాయి. ఎంపీలతో ప్రొటెం స్పీకర్ బర్తృహరి మహతాబ్ ప్రమాణం చేయించారు. పలువురు ఎంపీలు తమ తమ మాతృ భాషల్లో ప్రమాణం చేస్తున్నారు. అయి తే, తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఓ ఎంపీ మాత్రం తన మాతృభాష తమిళ్‌లో కాకుండా తెలుగులో ప్రమాణం చేసి ఆశ్చర్యపరిచారు. తమిళనాడులోని కృష్ణగిరి లోక్‌సభ నియోజకవర్గం నుంచి గెలుపొందిన కాంగ్రెస్ ఎంపీ కె. గోపి నాథ్ లోక్‌సభ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భం గా రాజ్యాంగ ప్రతిని ఓ చేత్తో పట్టుకుని తెలుగులో ప్రమాణం చేసి ఆశ్చర్యపరిచారు. అయితే, చివర్లో మాత్రంవాజై తమిళనా డు అంటూ నినదించారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. కృష్ణగిరి జిల్లా తమిళనా డు, కర్ణాట క, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలుపుతుంది. ముఖ్యంగా ఈ జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సమీపంలో ఉంటుంది. ఈ జిల్లా ఆంధ్రప్ర దేశ్, కర్ణాటక రాష్ట్రాలకు దగ్గరగా ఉన్నందున ఇక్కడి ప్రజలు తమిళంతోపాటు తెలుగు, కన్నడ భాషలు కూడా మాట్లాడతారు.

# ప్రతిపక్ష హోదా ఇవ్వండి

- ఆ హోదాతో బలంగా వాయిస్ వినిపిస్తా
- ప్రజా సమస్యలపై మాట్లాడుతాం
- ప్రతిపక్ష హోదా ఇవ్వడానికి ఇన్ని సీట్లు ఉండాలని రూల్ లేదు
- ప్రమాణస్వీకారం తీరుపై అభ్యంతరం
- స్పీకర్ అయ్యన్నకు మాజీ సీఎం జగన్ లేఖ



**విశ్వంభర, విజయవాడ :** మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్‌రెడ్డి అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడుకి లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వకపోవడంపై ఆయన తన లేఖ ద్వారా అసహనం వ్యక్తం చేశారు. ఏపీ అసెంబ్లీ స్పీకర్ కు జగన్ తను రాసిన లేఖలో మంత్రుల తర్వాత తనతో ప్రమాణస్వీకారం చేయించడం పద్ధతులకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రతిపక్ష హోదాపై జగన్ లేఖ ప్రతిపక్ష నాయకుడు హోదా ఇవ్వకూడదని ముందుగానే నిర్ణయించుకున్నట్టున్నారు. అందులో భాగంగానే తమ పార్టీకి ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని అసహనం వ్యక్తం చేశారు. విపక్షంలో ఎవరికి ఎక్కువ సీట్లు ఉంటే వారికే ప్రతిపక్ష హోదా ఇవ్వాలని చట్టంలో నిర్వచించారని జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటే 10 శాతం సీట్లు ఉండాలని చట్టంలో ఎక్కడా లేదని దానిని ఇప్పటివరకు ఎవరు పాటించలేదని జగన్ తెలిపారు. చచ్చే దాకా కొట్టాలన్న స్పీకర్ మాటలు పార్లమెంటులో కానీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో కానీ ఎప్పుడూ ఈ నిబంధనను పాటించలేదని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని చేపట్టిన టీడీపీ అధికార కూటమి, స్పీకర్ ఇప్పటికే తన పట్ల శత్రుత్వాన్ని ప్రదర్శిస్తున్నారని ఆయన ఆరోపించారు. చచ్చేదాకా కొట్టాలంటూ స్పీకర్ మాట్లాడిన మాటలు వీడియోల ద్వారా బయట పడ్డాయని పేర్కొన్న వైఎస్ జగన్.. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో అసెంబ్లీలో తన గొంతు విప్పే పరిస్థితులు కనిపించడం లేదన్నారు. వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వాలని అభ్యర్ధన ప్రతిపక్ష హోదాతోనే బలంగా తమ వాయిస్ ను వినిపించే అవకాశం ఉంటుందని, ప్రజా సమస్యల కోసం తాము అప్పుడు మాట్లాడగలుగుతామని జగన్ తెలిపారు. ప్రతిపక్ష పార్టీ హోదాతో సభా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు చట్టబద్ధమైన భాగస్వామ్య లభిస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని లేఖను పరిశీలించాలని తాను కోరుతున్నానని జగన్ స్పీకర్‌కు రాసిన లేఖలో ఆయన వెల్లడించారు.

# మీరేమో రాజమహల్‌లో ఉంటారూ..

జగన్‌వి ప్యాలెస్‌లు అంటరా
- ఇద్దరి ఇంటిని మీడియా టూర్ చేద్దాం
- ఒక కమిటీ వేసి ఇద్దరి ఇళ్ల విలువలు కట్టిద్దాం
- లోకేష్‌కు మాజీ మంత్రి పేర్ని నాని సవాల్



**విశ్వంభర, తాడేపల్లి:** తాడేపల్లి క్యాంప్ ఆఫీసును జగన్ ప్యాలెస్ అంటూ టీడీపీ నేతలు చేస్తున్న ప్రచారంపై వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని మండిపడ్డారు. జనం దగ్గర దోచుకున్న సొమ్ముతో జగన్ ప్యాలెస్‌లు కడుతున్నారంటూ ఏపీ మంత్రి నారా లోకేశ్ చేసిన వ్యాఖ్యలపైనా ఆయన విరుచుకుపడ్డారు. ఖలేజా ఉన్న నాయకుడివి అయితే హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ఇంటి ఫొటోలు చూపించాలని సవాలు విసిరారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఉన్న చంద్రబాబు ఇంటికి మీడియా టూర్ పెట్టాలని పేర్ని నాని డిమాండ్ చేశారు. అలాగే జగన్మోహన్ రెడ్డి ఇంటికి కూడా మీడియా టూర్ పెడదామని అన్నారు. లేదంటే రిటైర్డ్ జడ్జితో ఒక కమిటీ వేసి ఇద్దరి ఇళ్ల విలువలను కట్టిద్దామని తెలిపారు. 2019 నుంచి 2024వరకు మీరు కాపురం ఉన్న మీ ఇంటి ఖరీదు ఎంత, మీ ఇంటి బయట గోడల ఎత్తు ఎంత? ఆ గోడలు ఎంత విశాలంగా ఉన్నాయి? ఇల్లు ఎన్ని వేల చదరపు అడుగుల్లో ఉంది? ఆ ఇంట్లో వాడిన రాయి ఏంటి? జగన్ ఇంట్లో వాడిన రాయి ఏంటి? దాని విలువ ఎంత? దీని విలువ ఎంత? జగన్మోహన్ రెడ్డి ఇంట్లో బాత్‌రూంలో గానీ, ఇంట్లో వాడుకునే సామాను విలువ ఎంత? మీ ఇంట్లోని సామాను విలువ ఎంత? జగన్మోహన్ రెడ్డి ఇంట్లో సోఫాల విలువ ఎంత? మీ ఇంట్లో వాడే సోఫాల విలువ ఎంత? అనేది మొత్తం ఆడిట్ చేయిద్దామని అన్నారు. మీరు రాసిన రెడ్ బుక్ నిజమైతే చంద్రబాబు, జగన్ ఇళ్లను ఆడిట్ చేయించండని సవాలు విసిరారు. అసలు మీ ఇంటి ఫొటోలు ఎందుకు బయటకు ఇవ్వరని చంద్రబాబు, నారా లోకేశ్‌పై పేర్ని నాని మండిపడ్డారు. జనసేన అధినే పవన్ కల్యాణ్ ఇంటికి వస్తే కూడా సోఫాలో ఉన్న ఫొటోలనే బయటకు ఇస్తారే తప్ప.. ఇల్లంతా ఎందుకు ఫొటోలు తీయనివ్వరని ప్రశ్నించారు. మీరేమో రాజమహల్‌లో ఉంటారు.. జగన్‌వి ప్యాలెస్‌లు అంటూ విమర్శలు చేస్తారా అని మాజీ మంత్రి పేర్ని నాని మండిపడ్డారు.

## అరకు కాఫీని
# దేశ విదేశాల్లో ప్రమోట్ చేస్తాం


**రాష్ట్ర వ్యాప్తంగా చైన్ షాపులు పెట్టబోతున్నాం : మంత్రి గుమ్మడి సంధ్యారాణి**



**విశ్వంభర, విశాఖపట్నం:** మంత్రి గుమ్మడి సంధ్యారాణి అరకు కాఫీపై కీలక వ్యాఖ్యలు చేశారు. అరకు కాఫీకి సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా చైన్ షాపులు పెట్టబోతున్నామన్నారు. జీసీసీ ద్వారా అరకు కాఫీ చైన్ షాపులు పెడతాం అన్నారు. అరకు కాఫీని గత టీడీపీ ప్రభుత్వం బ్రాండింగ్ చేసి.. ప్రమోట్ చేసింది. ఇప్పుడూ అదే తరహాలో అరకు కాఫీని మా ప్రభుత్వం ప్రమోట్ చేస్తుంది. అరకు కాఫీని దేశ విదేశాల్లో ప్రమోట్ చేసేలా ప్రణాళికలు రూపొందిస్తాం అని వెల్లడించారు. ఇక, నెలకోసారి గిరిజన హాస్టళ్లల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తాం. గత ప్రభుత్వం పెండింగ్ బిల్లులు పెట్టడం వల్ల పనులు చాలా వరకు జరగలేదు. 554 ట్రైబల్ స్కూళ్లల్లో ఏఎన్‌ఎంలను డెప్యూటేషన్ మీద నియమిస్తున్నాం. ఫీడర్ అంబులెన్స్, తల్లి-బిడ్డ ఎక్స్ ప్రెస్ వంటి సేవలను పునరుద్ధరిస్తున్నాం. హాస్టళ్లల్లో స్టడీ అవర్స్ తిరిగి ప్రారంభిస్తామని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ ద్వారా రిక్రూట్ అయ్యే పోస్టుల్లో 2 వేలకు పైగా పోస్టులు గిరిజన స్కూళ్లల్లోనే ఉన్నాయని తెలిపారు మంత్రి సంధ్యారాణి.. గిరిజన ప్రాంతాల్లో గత ప్రభుత్వం రేషన్ డిపోలను రద్దు చేసింది. గిరిజన ప్రాంతాల్లో రేషన్ డిపోలను తిరిగి ప్రారంభించే అంశంపై కసరత్తు చేస్తున్నాం. జీసీసీ ద్వారా నిర్వహించే సంస్థలను.. ఉత్పత్తులను మరింత ప్రోత్సహిస్తాం అన్నారు. ఇకపై గిరిజన విద్యార్థుల మరణాలు ఉండకూడదని అధికారులను ఆదేశించాం.. పౌష్టికాహారం అందక గిరిజన పిల్లలు చనిపోకూడదు. గిరిజన బాలికల హాస్టళ్లల్లో మహిళ వార్డెన్లనే నియమిస్తాం. గిరిజన హాస్టళ్లల్లో కంప్లైంట్ బాక్సులు పెడతామన్నారు. గంజాయి వల్ల ఎక్కువగా పిల్లలు, ఆడపిల్లలే బాధితులుగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి మత్తులో ఏం చేస్తున్నామో తెలియని విధంగా దారుణాలు చేస్తున్నారన్నారు. గిరిజన ప్రాంతాల్లో గంజాయి కట్టడికి చెక్ పోస్టులు పెట్టాలని ఆదేశించామని, గిరిజన ప్రాంతాల్లో తాగు నీటి సౌకర్యం కల్పించాలని ఐటీడీఏలకు ఆదేశాలిచ్చామని మంత్రి సంధ్యారాణి తెలిపారు.

# రౌడీయిజం చేస్తే..
## వారికి అదే చివరి రోజు

- అహంకారంతో విర్రవీగితే ప్రజలు ఊరుకోరు
- రాష్ట్ర భవిష్యత్తును తిరగరాయబోతున్నాం
- కుప్పంను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా
- కుప్పం నుంచి ఎయిర్ కార్గో ద్వారా విదేశాలకు పంపిస్తాం
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



**విశ్వంభర, కుప్పం:** మళ్లీ జన్మంటూ ఉంటే కుప్పం ముద్దు బిడ్డగానే పుడతానని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అన్నారు. తాను ఇక్కడకు వచ్చినా, రాకున్నా తనను ఆదరించారని తెలిపారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో పర్యటించిన ఏపీ సీఎం చంద్రబాబు., ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు. ఇప్పటి వరకు 8 సార్లు కుప్పం నుంచి గెలిచానని చెప్పారు. మొన్నటి ఎన్నికల్లో వైఎస్సార్సీపీని చిత్తుచిత్తుగా ఓడించారని పేర్కొన్నారు. అహంకారంతో విర్రవీగితే ప్రజలు చూస్తూ ఊరుకోరని చెప్పడానికి ఈ ఎన్నికలే నిదర్శనమన్నారు. 'రాష్ట్ర ప్రజల భవిష్యత్తును తిరగరాయబోతున్నాం. కుప్పం నియోజకవర్గం నా రాజకీయాలకు ప్రయోగశాల. యువత, మహిళలు, బలహీన వర్గాలకు అవకాశం ఇచ్చాం. మొన్నటి ఎన్నికల్లో సామాజిక న్యాయానికి పెద్దపీట వేశాం. కేబినెట్‌లో 8 మంది బీసీలకు అవకాశం ఇచ్చాం. ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే పోలవరం, అమరావతికి వెళ్లా. ప్రజాక్షేత్రంలోకి వెళ్లేముందు మీ ఆశీస్సుల కోసమే కుప్పం వచ్చా. వచ్చే ఐదేళ్లలో కుప్పం ప్రజల రుణం తీర్చుకుంటా. కుప్పంను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇస్తున్నా. కుప్పంను అన్నింట్లో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రయత్నిస్తానం. తాను వెనుకబడిన ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే కుప్పంను ఎంచుకున్నానని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. చిత్తూరు జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామని గుర్తు చేశారు. వైఎస్సార్సీపీ పాలన పీడకల అలాంటి దాన్ని ఎప్పుడూ చూడలేదని చెప్పారు. ఏ తప్పూ చేయకున్నా 30 మంది కార్యకర్తలను జైలులో పెట్టారని ఆవేదన చెందారు. కుప్పం ప్రశాంతమైన స్థలం ఇక్కడి హింసకు చోటు లేదని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో రౌడీయిజం చేసేవారికి అదే కడపటి రోజు జాగ్రత్త అని హెచ్చరించారు. ఐదేళ్లలో కుప్పంలో ఎలాంటి అభివృద్ధి లేదని ఆవేదన చెందారు. అయితే ఇప్పుడు కుప్పంను మోడల్ మున్సిపాలిటీగా తయారు చేస్తామని హామీ ఇచ్చారు. కుప్పంలో ఔటర్ రింగ్‌రోడ్ వేస్తాం, ఆధునిక రోడ్లు వేస్తామని ఏపీ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ నియోజకవర్గంలోని 4 మండల కేంద్రాలనూ ఆదర్శ పట్టణాలుగా అభివృద్ధి చేస్తామని మాటిచ్చారు. కుప్పం అభివృద్ధికి సంబంధించిన పనులు ఇవాళ్టి నుంచే ప్రారంభమవుతాయని చెప్పారు. తన నియోజకవర్గంలో ప్రతి ఊరిలో తాగునీరు, డ్రైనేజ్‌లు, వీధిదీపాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఏ కుటుంబంలోనూ పేదరికం ఉండకూడదన్నదే నా ఆశ యం. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా చేస్తాం. వీలైనంత తొందరలోనే కుప్పంకు విమానాశ్రయం వస్తుం ది. కుప్పం నుంచి ఎయిర్ కార్గో ద్వారా విదేశాలకు పంపిస్తాం. ఇంటికి రెండు ఆవులు ఇస్తే ఆ రోజు నన్ను ఎగతాళి చేశారు. ఇప్పుడు కుప్పంలో 4 లక్షల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయి. తాజాగా ఆ సంఖ్యను 10 లక్షల లీటర్ల ఉత్పత్తి అయ్యేలా చూస్తాం. పాడి పరిశ్రమ, కోళ్ల పరిశ్రమను మరింత ప్రోత్సహిస్తాం. కుప్పంలో తేనె ఉత్పత్తి మరింత పెరిగేలా చర్యలు. కుప్పం బస్టాండ్, డిపో రూపురేఖలు మారుస్తాం. మల్లన్న, రాళ్లమణుగూరును మండలాలు చేస్తాం. కుప్పంకు ఎలక్ట్రిక్ బస్సులు తీసుకువస్తామని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు.

# ఏపీ టెట్ ఫలితాలు విడుదల

- టెట్-2024లో 58.4 శాతం అభ్యర్థులు ఉత్తీర్ణత
- డీఎస్సీలో టెట్ మార్కులకు 20 శాతం వెయిటేజ్
- మెగా డీఎస్సీకి సన్నద్ధం కావాలి
- మరోసారి టెట్ నిర్వహిస్తామన్న మంత్రి లోకేష్

AP - TET

**విశ్వంభర, విజయవాడ :** ఏపీ టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్)-2024 ఫలితాలను విడుదల చేశారు. టెట్-2024లో మొత్తంగా 58.4 శాతం మంది అభ్యర్థుల ఉత్తీర్ణత సాధించారు. కాగా డీఎస్సీలో టెట్ మార్క్‌లకు 20 శాతం వెయిటేజ్ కల్పించనున్న విషయం విదితమే. అయితే, బీఈడీ, డీఈడీ పూర్తి చేసినవారికి త్వరలో మరోసారి టెట్ నిర్వహించేందుకు ఉన్నత విద్యామండలి ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో టెట్ షెడ్యూల్ విడుదల చేశారు. ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించారు. ఫిబ్రవరి 27 నుంచి మార్చి 6 వరకు టెట్ నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,67,789 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. వారిలో 2,35,907 మంది పరీక్షలు రాశారు.. అంటే దరఖాస్తు చేసిన వారిలో 88.90 శాతం మంది టెట్ రాశారు. వారిలో 1,37,904 మంది ఉత్తీర్ణులయ్యారు. అంటే 58.4 శాతం మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారు. టెట్ ఫలితాలు మార్చి 14నే విడుదల కావాల్సి ఉన్నా.. అసెంబ్లీ ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా పడగా.. ఇప్పుడు ఎన్నికలు పూర్తి కావడం.. కొత్త ప్రభుత్వం కూడా ఏర్పాటు కావడంతో.. ఫలితాలు విడుదల చేశారు. టెట్-2024 ఫలితాలను పూర్తిస్థాయిలో పరిశీలిస్తే పేపర్ 1(ఏ) ఎస్జీటీ రెగ్యులర్ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నవారి సంఖ్య 1,13,296గా ఉంది. వారిలో 78,142మంది అంటే 66.32 శాతం మంది అభ్యర్థులు అర్హత సాధించారు. పేపర్ 1(బి) ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్షకు 1700 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 790 మంది.. 46.47శాతం ఉత్తీర్ణత సాధించారు. పేపర్ 2(ఏ) స్కూల్ అసిస్టెంట్ రెగ్యులర్ పరీక్షలకు 1,19,500 దరఖాస్తు చేసుకుంటే.. వారిలో 60,846 మంది.. 60.93 శాతం అర్హత పొందారు.. పేపర్ 2(బి) స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్షకు 1,411మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 1,125 మంది.. 79.73 శాతం అభ్యర్థులు ఉత్తీర్ణులయ్యారు.

**క్వాలిఫై కాని అభ్యర్థులకు సర్కార్ గుడ్ న్యూస్**

టెట్ పరీక్షలో క్వాలిఫై కాని అభ్యర్థులకు మంత్రి నారా లోకేష్ గుడ్ న్యూస్ చెప్పారు. టెట్ లో అర్హత సాధించని వారికి మరో ఛాన్స్ ఇస్తామన్నారు. వారికి మరోమారు టెట్ నిర్వహిస్తామని చెప్పారు. అంతేకాదు కొత్తగా బీఎడ్, డీఎడ్ పూర్తైన వారికి టెట్ లో అవకాశం కల్పిస్తామన్నారు. టెట్ తర్వాత మెగా డీఎస్సీ నిర్వహిస్తామని వెల్లడించారు. టెట్ ఫలితాలను మంత్రి లోకేష్ విడుదల చేశారు. టెట్ పరీక్షలో 58.4శాతం మంది అర్హత సాధించినట్లు మంత్రి లోకేష్ తెలిపారు. ప్రజా ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీకి అందరూ సన్నద్ధం కావాలని కోరుకుంటున్నా. నిరుద్యోగ టీచర్లు గత 3 నెలలుగా ఎదురుచూస్తున్న ఏపీ టెట్ ఫలితాలను ఈరోజు విడుదల చేశాను. టెట్ లో అర్హత సాధిస్తేనే డీఎస్సీ రాసేందుకు అర్హులు కావడం, డీఎస్సీలో టెట్ మార్కులకు 20శాతం వెయిటేజీ ఉండటంతో ఈ ఫలితాల కోసం రాష్ట్రవ్యాప్తంగా 2.35 లక్షల మంది నిరుద్యోగ టీచర్ అభ్యర్థులు ఆతృతగా ఎదురు చూస్తున్నారు. టెట్ లో అర్హత సాధించిన అభ్యర్థులకు నా శుభాకాంక్షలు. ఈ టెట్ లో క్వాలిఫై కాని అభ్యర్థులకు, కొత్తగా బీఈడీ, డీఈడీ పూర్తి చేసుకున్న వారికి అవకాశం కల్పిస్తూ త్వరలోనే టెట్ నిర్వహించబోతున్నాం. ఆ తర్వాత మెగా డీఎస్సీ ఉండబోతుంది. ఈ లింక్ ద్వారా టెట్ రిజల్ట్స్ తెలుసుకోండని సూచించారు.



# నేటి నుంచి పవన్ వారాహి దీక్ష

**11 రోజుల పాటు దీక్ష చేయనున్న డిప్యుటీ సీఎం**

**విశ్వంభర, విజయవాడ:** జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నెల 26 నుంచి వారాహి విజయ దీక్ష చేపట్టనున్నారు. నేటి నుంచి ఆయన 11 రోజుల పాటు వారాహి విజయ దీక్ష చేపట్టనున్నారు. ఈ సమయంలో ఆయన పాలు, పండ్లు, నీరు మాత్రమే తీసుకుంటారని జనసేన పార్టీ వర్గాలు తెలిపాయి. గత ఏడాది జూన్ మాసంలో పవన్ కళ్యాణ్ వారాహి విజయ యాత్ర చేపట్టారు. ఆ యాత్ర సందర్భంలోనూ వారాహి అమ్మవారికి పూజలు నిర్వహించి దీక్ష చేపట్టారు. పవన్ కళ్యాణ్ ఇలాంటి ఆధ్యాత్మిక ప్రయత్నం చేయడం ఇదే మొదటిసారి కాదు. గత ఏడాది జూన్ లో వారాహి విజయయాత్రను ప్రారంభించి వారాహి అమ్మవారికి పూజలు, ఆ తర్వాత దీక్ష చేశారు. ఇక రాష్ట్ర, ప్రజల సంక్షేమం కోసం అమ్మవారి ఆశీస్సులు పొందేందుకే పవన్ కళ్యాణ్ ఈ దీక్ష చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 26న ప్రా రంభమయ్యే దీక్ష 11 రోజుల పాటు కొనసాగుతుంద ని, ఈ సమయంలో పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ సుభిక్షంగా ఉండాలని ప్రార్థిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.

# పాలనలో పవన్ కొత్త ట్రెండ్

- సలహాలు ఇవ్వాలంటూ క్యూ ఆర్ కోడ్ రిలీజ్
- పరిపాలనపై తనదైన మార్క్



**విశ్వంభర, అమరావతి:** డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇన్ని రోజులు సినిమాల్లోనే ట్రెండ్ సెట్ చేసేవారు. కానీ ఇప్పుడు ప్రభుత్వంలోకి వచ్చాక తన దైన మార్క్ పాలన అంటే ఏంటో చూపిస్తున్నారు. ఇప్పటికే తన శాఖ అధికారులను ఉరుకులు, పరుగులు పెట్టిస్తున్నారు. జనసేన ఆఫీసులోనే జనతా దర్బార్ ను నిర్వహిస్తున్నారు. ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. ప్రజలను కలుస్తూ వారి సమస్యలను తెలుసుకుంటున్నారు, ఫోన్లలో మాట్లాడి ఆ సమస్యలను త్వరగా పరిష్కారం అయ్యేలా చూస్తున్నారు. పవన్ కళ్యాణ్ మంత్రిగా బాధ్యతలు తీసుకున్నప్పటినుంచి విశ్రాంతి లేకుండా పనిచేస్తూనే ఉన్నారు. ఎంతోమంది ఆయన్ని కలవడానికి, వారి సమస్యలు చెప్పడానికి వస్తున్నారు. దీంతో అందరికి పవన్ కళ్యాణ్ అంటే మరింత గౌరవం ఏర్పడుతుంది. ఏదో మంచి చేస్తాడు, మార్పు తెస్తాడు అనే నమ్మకం కుదిరింది. తాజాగా పవన్ కళ్యాణ్ చేపట్టిన ప్రయోగం అందర్నీ ఆశ్చర్యపరుస్తుంది. ఆ శాఖలకు సంబంధించి మనం ఎలాంటి సూచనలు, సలహాలు అయినా ఇవ్వొచ్చు. దీంతో ఈ ఆలోచనకు అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఇప్పటివరకు ఏ రాజకీయ నాయకుడు ఇలా డిజిటల్‌గా వారి శాఖలకు సంబంధించి సలహాలు సూచనలు తీసుకోలేదు అని, పవన్ కళ్యాణ్ నిజంగానే రాజకీయాల్లో కొత్త మార్పు తీసుకొస్తున్నాడని కామెంట్స్ చేస్తున్నారు. ఇక యువత అంతా ఆన్లైన్ లో ఉంటారు, సోషల్ మీడియా వాడతారు కాబట్టి ఈ గూగుల్ ఫామ్ కచ్చితంగా ఫిల్ చేస్తే మన ఆలోచనలు కూడా వారికి తెలుస్తాయని, ఇలా ప్రజల ప్రభుత్వం అవుతుందని పవన్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు. పవన్ కళ్యాణ్ బాధ్యతలు చేపట్టిన కొన్ని రోజులకే ఇలా కొత్త ప్రయోగాలు మొదలుపెడుతూ, ప్రజల వద్దకు చేరువవుతున్నారు. ఇంకా రాబోయే ఐదేళ్లలో ఎలాంటి మార్పులు తెస్తారో అని ఎదురుచూస్తున్నారు. జనసేన అధికార సోషల్ మీడియా పేజీలలో ఓ ఆసక్తికర పోస్ట్ చేశారు. జనసేనకు మూడు మంత్రి పదవులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ ముగ్గురు మంత్రుల కింద పంచాయితీ రాజ్ శాఖ, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పర్యావరణ, అటవీ శాఖ, సైన్స్ టెక్నాలజీ, పౌర సరఫరాల శాఖ, టూరిజం సినిమాటోగ్రఫీ శాఖలు ఉన్నాయి. అయితే తాజాగా జనసేన పార్టీ.. ఈ శాఖలకు సంబంధించి మీలో ఎవరైనా సూచనలు, సలహాలు ఇవ్వాలి అనుకుంటే ఇవ్వగలరు అని చెప్పి ఓ గూగుల్ ఫామ్ లింక్, క్యూఆర్ కోడ్ ని ఇచ్చారు. ఆ గూగుల్ ఫామ్ లింక్, క్యూఆర్ కోడ్ ద్వారా జనసేన పార్టీ ఇచ్చిన ఫామ్ లో ఆ శాఖలకు సంబంధించి మన సూచనలు సలహాలు ఇవ్వమని తెలుపుతూ పోస్ట్ చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తిని సంతరించుకుంది.




# సెమీస్‌కు ఆఫ్ఘన్

- ఆస్ట్రేలియా ఆశలు గల్లంతు
- బంగ్లాదేశ్‌పై త్రిల్లింగ్ విక్టరీ
- ఎనిమిది పరుగుల తేడాతో ఘన విజయం

**విశ్వంభర, స్పోర్ట్స్:** టీ20 వరల్డ్ కప్ 2024లో ఆఫ్ఘనిస్తాన్ చెలరేగిపోయింది. తన కంటే బలమైన జట్లను మట్టికరిపిస్తోంది. మొన్నటికి మొన్న ఐసీసీ వరల్డ్ కప్ ఛాంపియన్‌ను ఓడించగా ఇప్పుడు బంగ్లాదేశ్ వంతు వచ్చింది. సూపర్ 8 మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను ఓడించిన ఆఫ్ఘనిస్తాన్ సెమీ ఫైనల్స్ లో అడుగుపెట్టింది.. దర్జాగా దీని దెబ్బకు ఆస్ట్రేలియాకు సెమీస్ దారులు మూసుకుపోయా యి. సెయింట్ విన్సెంట్‌లోని కింగ్స్ టౌన్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్తాన్ అదరగొట్టింది. ప్రత్యేకిం చి- బౌలింగ్‌లో సత్తా చాటింది. బౌలర్లందరూ సమష్టిగా రాణించారు. 115 పరుగుల ను కాపాడుకోగలిగారు. ఈ మాత్రం స్కోర్ చేయ డానికి కూడా బంగ్లాదేశ్ గిలగిలలాడిందంటే ఆఫ్ఘన్ బౌలింగ్ డిపార్ట్‌మెంట్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆఫ్ఘనిస్తాన్ నిర్ణీత 20 ఓవర్లల్లో అయిదు వికెట్ల నష్టానికి 115 పరుగులు చేసింది. 43 పరుగుల తో ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్ ఒక్కడే రాణించా డు. ఇబ్రహీం జద్రాన్- 18, అజ్మతుల్లా ఒమర్జాయ్- 10, గుల్బదీన్ నబీ- 4, మహ్మద్ నబీ- 1 పరుగు చేశారు. చివర్లలో కేప్టెన్ రషీద్ ఖాన్ 10 బంతుల్లో మూడు ఫోర్ల తో 19 పరుగులు చేశాడు. ఛేజింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ ప్రారంభంలోనే తేలిపోయింది. ఆఫ్ఘ న్ బౌలర్లను ఏ దశలో కూడా ప్రతిఘ టించలేక పోయింది. 20 ఓవర్ల ల్లో 105 పరుగులకు కుప్పకూలింది. ఓపెనర్ లిట్టన్ దాస్ ఒక్కడే ఒంటరి పోరాటం చేశాడు. 49 బంతుల్లో ఒక సిక్స్, అయిదు ఫోర్లతో 54 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. తన్జిద్ అహ్మద్- 0, నాజ్ముల్ హొస్సైన్ శాంటో- 5, షకీబల్ హసన్- 0, సౌమ్యా సర్కార్- 10, తౌహీద్ హృదొయ్- 14, మహ్మదుల్లా- 6, రషీద్ హొస్సైన్- 0, తన్జిమ్ హస్సన్ షకీబ్- 3, తస్కిన్ అహ్మద్- 2, ముస్తాఫిజుర్ రెహ్మాన్- 0, తన్జిమ్ హస్సన్ షకీబ్- 3, తస్కిన్ అహ్మద్- 2, పరుగులు చేశారు. కేప్టె న్ రషీద్ ఖాన్, నవీను ల్ హక్ నాలుగు చొప్పున వికెట్లు కూల్చారు. గులబ్బదీన్ నబీ, ఫజల్ హక్ ఫారూఖీ ఒక్కో వికెట్ తీసుకున్నారు. ఈ విజ యం తో గ్రూప్ ఏ నుంచి సెమీ ఫైనల్స్ చేరిన రెండో జట్టయింది ఆఫ్ఘనిస్తాన్. టీమిండియా ఇప్పటికే సెమీ ఫైనల్స్ చేరిన విషయం తెలిసిందే. ఇదే గ్రూప్‌లో ఉన్న ఆస్ట్రేలియా ఇంటిదారి పట్టింది. ఇంకా రెండు బెర్తులు ఖాళీగా ఉన్నాయి.



## అంతర్జాతీయ క్రికెట్‌కు వార్నర్ గుడ్‌బై

**విశ్వంభర, స్పోర్ట్స్:** ఆస్ట్రేలియా డాషింగ్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. టీ20 ప్రపంచకప్ 2024 నుంచి ఆస్ట్రేలియా నిష్క్రమించడంతో డేవిడ్ వార్నర్ ఇంటర్నేషనల్ కెరీర్‌కు తెరపడింది. ఈ టోర్నీ ప్రారంభానికి ముందే డేవిడ్ వార్నర్ తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెల్లడించిన విషయం తెలిసిందే. వన్డే ప్రపంచకప్ 2023 విజయానంతరం టెస్ట్, వన్డే ఫార్మాట్‌లకు గుడ్‌బై చెప్పిన వార్నర్.. టీ20 ప్రపంచకప్ 2024 అనంతరం అంతర్జాతీయ క్రికెట్ నుంచి పూర్తిగా తప్పుకుంటానని అప్పట్లో ప్రకటించాడు. టీ20 ప్రపంచకప్ 2024లో ఆస్ట్రేలియా దారుణంగా విఫలమైంది. సూపర్-8 పోరులో అఫ్గానిస్థాన్, భారత్ చేతిలో ఓడిన ఆసీస్... సెమీస్ చేరకుండానే ఇంటిదారి పట్టింది. బంగ్లాదేశ్‌తో జరిగిన చివరి సూపర్-8 మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్ సంచలన విజయం సాధించి సెమీస్ చేరడంతో ఆసీస్ టోర్నీ నుంచి నిష్క్రమించింది.దాంతో డేవిడ్ వార్నర్ కెరీర్‌కు ముగింపు పడినట్లు అయింది. తనకు ఎంతో ఇష్టమైన టీమిండియాతోనే అతను చివరి మ్యాచ్ ఆడాడు. ఈ మ్యాచ్‌లో అతను దారుణంగా విఫలమయ్యాడు. 6 బంతుల్లో 6 పరుగులే చేశాడు. 2009లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన 37 ఏళ్ల వార్నర్.. 15 ఏళ్ల పాటు ఆస్ట్రేలియాకు ప్రాతినిథ్యం వహించాడు. ఆస్ట్రేలియా తరఫున 112 టెస్టులు, 161 వన్డేలు, 110 టీ20లు ఆడి వరుసగా 8786, 6932, 3277 పరుగులు చేశాడు. పార్ట్‌టైమ్ స్పిన్నర్‌గా నాలుగు వికెట్లు పడగొట్టాడు. తన 15 ఏళ్ల క్రికెట్ కెరీర్‌లో 2018 బాల్ టాంపారింగ్ వివాదం మాయని మచ్చగా నిలిచిపోయింది. ఈ తప్పిదం కారణంగా వార్నర్ ఏడాది పాటు నిషేధం ఎదుర్కొన్నాడు. ఆసీస్ జట్టుకు సారథ్యం వహించలేకపోయాడు. ఇక వార్నర్.. ఫ్రాంచైజీ క్రికెట్ మాత్రమే ఆడనున్నాడు. ఐపీఎల్‌తో పాటు పలు దేశాల్లో జరిగే టీ20 లీగ్‌ల్లో అభిమానులను అలరించనున్నాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్‌గా సుదీర్ఘ కాలం ఆడిన వార్నర్.. తెలుగు రాష్ట్రాల అభిమానాన్ని సొంతం చేసుకున్నాడు. వార్నర్ రిటైర్మెంట్‌పై మాజీ క్రికెటర్లు, సహచర ఆటగాళ్లు సోషల్ మీడియా వేదికగా స్పందిస్తున్నారు. అతని భవిష్యత్తు మరింత బాగుండాలని ఆకాంక్షిస్తున్నారు.




## కోల్‌కతాలో బ్రిటానియా ఫ్యాక్టరీ క్లోజ్..

**విశ్వంభర, బిజినెస్ :** దేశంలోని అత్యంత పురాతన వ్యాపార సంస్థల్లో బ్రిటానియా ఇండస్ట్రీస్ కూడా ఒకటి. అయితే కంపెనీ తాజాగా తన ఫ్యాక్టరీని క్లోజ్ చేయాలని తీసుకున్న నిర్ణయం రాజకీయ పార్టీల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. బ్రిటానియా బిస్కెట్స్ దేశంలోని ప్రజలకు పరిచయం అవసరం లేని ఉత్పత్తులు. స్వాతంత్ర్యానికి ముందు నుంచి వ్యాపారం చేస్తున్న ఈ పెద్ద కంపెనీ తాజాగా తన కోల్‌కతా యూనిట్‌ను మూసివేయబోతున్నట్లు వెల్లడైంది. ఈ వ్యవహారంలో ఇప్పటికే అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులకు కంపెనీ సైతం సమాచారం అందించింది. అయితే ఈ వ్యవహారం పశ్చిమ బెంగాల్ లో బీజేపీ-టీఎంసీల మధ్య రాజకీయంగా మాటల యుద్ధానికి కారణమైంది. రాష్ట్రంలోని తారాటాలా ప్రాంతంలో బ్రిటానియా ఇండస్ట్రీస్‌కి పురాతన కర్మాగారం మూతపడటం చరిత్రలో పెద్ద శకానికి ముగింపుగా నిలవనుంది. ప్రస్తుతం వేల కోట్లు విలువైన బ్రిటానియా ఇండస్ట్రీస్ 1892లో కేవలం రూ.295 పెట్టుబడితో వ్యాపారాన్ని ప్రారంభించింది. రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో కంపెనీ వ్యాపారం వేగంగా వృద్ధిని సాధించింది. అయితే తర్వాత దీనిని బ్రిటీష్ వ్యాపారవేత్తల నుంచి వాడియా కుటుంబం కొనుగోలు చేసింది. వీరు బ్రిటానియా బిస్కెట్లను మరింత ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో 1910లో ఎలక్ట్రిక్ మిషన్ సహాయంతో బిస్కెట్లను తయారు చేయడం ప్రారంభించారు. ఆ తర్వాత 1921లో ఉత్పత్తిని పెంచడానికి కంపెనీ ఇండస్ట్రియల్ గ్యాస్ ఓవెన్‌లను దిగుమతి చేసుకోవడం ప్రారంభించింది. వ్యాపారం దినదినాభివృద్ధి చెందటంతో 1924లో కంపెనీ ముంబైలో కొత్త ఫ్యాక్టరీని నెలకొల్పింది. ప్రస్తుతం దేశంలో 13 తయారీ ఫ్యాక్టరీలను కలిగి ఉన్న కంపెనీ ప్రపంచ వ్యాప్తంగా 60కి పైగా దేశాల్లో ఉత్పత్తులను విక్రయిస్తూ వార్షికంగా రూ.9000 కోట్ల ఆదాయాన్ని సంపాదిస్తోంది. కోల్‌కతా నుంచి ప్రారంభమైన ఈ సంస్థ తారాటాలలో ఉన్న చారిత్రాత్మక కర్మాగారాన్ని మూసివేయడం నగర ఆర్థిక చరిత్రకే కాకుండా అందులో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా పెద్ద ఎదురుదెబ్బ. గత ఏడాది మే నుంచి కంపెనీ ఇక్కడ ఉత్పత్తిని నిలిపివేసింది. యూనిట్ మూతపడటంతో 122 మంది శాశ్వత ఉద్యోగులు, 250 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉపాధిని కోల్పోనున్నారు.

## భారీ లాభాలతో ముగిసిన మార్కెట్లు

### ఆగని బుల్స్ జోరు

**విశ్వంభర, బిజినెస్ :** మెగా ర్యాలీ తర్వత దేశీయ స్టాక్ మార్కెట్లు తమ ప్రయాణాన్ని ముగించాయి. రెండు రోజుల విరామం తర్వాత తిరిగి బుల్స్ నేడు దలాల్ స్ట్రీట్ లో తమ పవర్ చూపించారు. నేడు ఇంట్రాడేలో బెంచ్ మార్క్ సూచీలు తమ సరికొత్త జీవితకాల గరిష్ఠాలను తాకాయి. మార్కెట్లు ముగింపు సమయంలో బెంచ్ మార్క్ సూచీ సెన్సెక్స్ 712 పాయింట్ల లాభంతో 78054 పాయింట్ల వద్ద తమ ప్రయాణాన్ని ముంగిచాయి. ఇదే క్రమంలో మరో కీలక సూచీ నిఫ్టీ క్లోజింగ్ నాటికి 183 పాయింట్ల లాభపడి 23721 పాయింట్ల వద్ద తన ప్రయాణాన్ని ముగించింది. ఇదే క్రమంలో నిఫ్టీ బ్యాంక్ సూచీ 902 పాయింట్ల లాభపడగా.. చివరికి నిఫ్టీ మిడ్ క్యాప్ సూచీ మాత్రం 208 పాయింట్ల నష్టపోయింది. ఎన్ఎస్ఈలో శ్రీరామ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, టెక్ మహీంద్రా, హెచ్డీఎఫ్సీ లైఫ్, ఎల్ టి, విప్రో, బ్రిటానియా, బజాజ్ ఫిన్ సర్వ్, ఎస్బీఐ, ఇన్ఫోసిస్, అల్ట్రాటెక్ సిమెంట్స్, రిలయన్స్, టీసీఎస్, కోటక్ బ్యాంక్, దివీస్ ల్యాబ్, సన్ ఫార్మా, ఎస్బీఐ లైఫ్, అపోలో హాస్పిటల్స్ కంపెనీల షేర్లు లాభాలతో తమ ప్రయాణాన్ని ముగించాయి. ఇదే క్రమంలో బీపీసీఎల్, ఐషర్ మోటార్స్, పవర్ గ్రిడ్, ఏషియన్ పెయింట్స్, టాటా స్టీల్, ఓఎన్జీసీ, బజాజ్ ఆటో, కోల్ ఇండియా, అదానీ ఎంటర్ ప్రైజెస్, నెస్లే, టాటా కన్జూమర్, జేఎస్డబ్ల్యూ స్టీల్, మారుతీ, అదానీ పోర్ట్స్, ఎన్టీపీసీ, హిందుస్థాన్ యూనీలివర్, ఎయిర్ టెల్, టాటా మోటార్స్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీల షేర్లు నష్టాలతో టాప్ లూజర్లుగా నేడు తమ ప్రయాణాన్ని ముగించాయి.



## తన ఫేక్ వీడియోలపై స్పందించిన ఆర్‌బీఐ మాజీ గవర్నర్..



**విశ్వంభర, బిజినెస్ :** రోజురోజుకూ సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్న ఈ సమయంలో మోసాలు కూడా అదే స్థాయిలో పెరిగిపోతున్నాయి. నకిలీ వీడియోలను సృష్టించి మహిళలను కించపరుస్తూ పైశాచిక ఆనందం పొందే వారు కొందరైతే, వాటిని క్యాష్ చేసుకునే వారు మరి కొందరు. ఇన్వెస్ట్‌మెంట్ సలహాల పేరిట ఈ తరహా నకిలీ వీడియోల ద్వారా పెట్టుబడిదారులను పలువురు మోసగాళ్లు నట్టేట ముంచుతున్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ గా రఘురామ్ రాజన్ గతంలో సేవలందించారు. ప్రస్తుతం యూనివర్సిటీ ఆఫ్ చికాగో బూత్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆయన పేరిట నకిలీ వీడియోలను క్రియేట్ చేసి పెట్టుబడి సలహాలు ఇచ్చినట్లు తప్పుగా పేర్కొంటున్నట్లు రాజన్ వెల్లడించారు. అవి అనేక సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో చెలామణి అవుతున్నాయన్నారు. ఈ మేరకు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించినట్లు ప్రముఖ మీడియా సంస్థ నివేదించింది. తాను ఎప్పుడూ ప్రజలకు పెట్టుబడి సలహాలు ఇవ్వనని, వ్యక్తిగత స్టాక్స్‌ను ప్రచారం చేయలేదని రాజన్ తెలిపారు. ప్రతి వ్యక్తికి వారి స్వంత ఆర్థిక అవసరాలు మరియు రిస్క్ ఆకలి ఉన్నాయి, అన్నారాయన. అయినప్పటికీ కొన్ని ఫేక్ వీడియోలు హల్ చేస్తున్నట్లు తన లింక్డ్ఇన్ పోస్ట్‌లో వెల్లడించారు. అవి నకిలీవని, ఇందుకు పాల్పడిన వారిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని చూస్తున్నట్లు చెప్పారు. 'పెట్టుబడిదారులు వ్యక్తిగత స్టాక్‌లు లేదా స్టాక్ ఆప్షన్‌లను కొనుగోలు చేయడం కంటే బ్యాంక్ డిపాజిట్లు, బాండ్‌లు, మ్యూచువల్ ఫండ్స్ మరియు ఈటీఎఫ్‌ల ద్వారా వైవిధ్యభరితమైన పోర్ట్‌ఫోలియోలను కలిగి ఉండటం ఉత్తమం. మీరు ఎంత అదృష్టవంతులు, ధనవంతులు అయినా మీరు తీసుకునే నిర్ణయం మిమ్మల్ని పేదలుగా మార్చే అవకాశంఉంది. అందుకే దయచేసి నిర్దిష్ట స్టాక్‌లో పెట్టుబడులు పెట్టమని సూచించే అన్ని వీడియోలను విస్మరించండి' అని రాజన్ సూచించారు.

## ఆ మహిళా ఉద్యోగులకు కేంద్రం గుడ్‌న్యూస్

### ప్రసూతి సెలవులకు ప్రభుత్వం మార్పులు



**విశ్వంభర, బిజినెస్ :** ఎన్నో ఏళ్ల తరబడి పాతుకుపోయిన చట్టాలను కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం గతంలో తవ్వి తీసింది. వాటిలో కొన్నిటికి మార్పులు చేయగా మరికొన్నిటిని పూర్తిగా రద్దు చేసింది. అదే విధంగా ఇప్పుడు 50 ఏళ్లనాటి ఓ నిబంధనకు సవరణలు చేస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఇదికాస్తా ప్రభుత్వ ఉద్యోగుల పాలిట వరంగా మారనుంది. సరోగసీ ద్వారా బిడ్డలకు జన్మనిచ్చిన మహిళా ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రం వెసులుబాటు కల్పించింది. 180 రోజుల పాటు ప్రసూతి సెలవులు తీసుకునేం దుకు అవకాశం ఇచ్చింది. దీనికోసం ఏకంగా సెంట్రల్ సివిల్ సర్వీసెస్ నిబంధనలలో మార్పులు చేసింది. ఆ బిడ్డ తండ్రికి కూడా 15 రోజుల పితృత్వ సెలవులను మంజూరు చేయాలని నిర్ణయించింది. కేవలం ఆ తల్లికే కాకుండా సరోగసి ద్వారా బిడ్డను కనేందుకు గర్భం అద్దెకిచ్చిన మహిళ కూడా ప్రభుత్వ ఉద్యోగి అయితే ఆమెకూ ఈ సెలవులు వర్తిస్తా యని కేంద్రం నిబంధనలు సవరించింది. ఈ అవకాశం కేవలం ఇద్దరు పిల్లల వరకు మాత్రమేనని పేర్కొంది. ఈ మేరకు సిబ్బంది మంత్రిత్వ శాఖ ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా కొత్త నియమాలను నోటిఫై చేసింది. ఇప్పటి వరకు సరోగసీ ద్వారా బిడ్డ పుడితే మహిళా ప్రభుత్వ ఉద్యోగులకు ప్రసూతి సెలవులు మంజూరు చేయాలనే నిబంధనలు లేవు. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఒక ప్రభుత్వోద్యోగిని మరియు ఒంటరి పురుష ప్రభుత్వోద్యోగి తమ సర్వీసులో పిల్లల సంరక్షణ కోసం గరిష్ఠంగా 730 రోజులపాటు సెలవులు తీసుకునేందుకు అనుమతిస్తారు. విద్య, అనారోగ్యం లాంటి పలు కారణాలు ద్వారా వీటిని పొందవచ్చు. కాగా ఇప్పుడు కేంద్రం కొత్త రూల్స్ ప్రవేశపెట్టింది.



# అన్యాయంపై తిరగబడ్డ టెడ్డీబేర్

'ఊర్వశివో రాక్షసీవో' సినిమా తరువాత అల్లు శిరీష్ నటిస్తున్న చిత్రం 'బడ్డీ'. సామ్ అంటోన్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. తమిళ స్టార్ హీరో ఆర్య ప్రధాన పాత్రలో నటించిన 'టెడ్డీ' సినిమాకి రీమేక్‌గా ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. స్టూడియో గ్రీన్ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్మిస్తోన్న ఈ మూవీలో గాయత్రీ భరద్వాజ్, అజ్మల్ అమీర్, ప్రిషా సింగ్, ముఖేష్ రిషి, మహమ్మద్ అలీ కీలక పాత్రల్లో నటించారు. హిప్‌హాప్ తమిజా సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఈ మూవీ నుంచి విడుదలైన ఫస్ట్ లుక్, పాట అభిమానులను అలరించాయి. తాజాగా ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. చరిత్రలో ఇప్పటి వరకు ఎప్పుడు అన్యాయం జరిగినా.. ఎదురు తిరిగిన సింహాన్ని, పులిని చూసుంటారు. అన్యాయం పై తిరగ బడ్డ టెడ్డీబేర్‌ను చూశారా..? అంటూ సాయి కుమార్ వాయిస్ ఓవర్‌తో ట్రైలర్ ప్రారంభమైంది. ట్రైలర్‌లో టెడ్డీబేర్ విలన్లను చితక్కొట్టింది. కాగా.. ఈ టెడ్డీబేర్‌కు సాయం చేసే కెప్టెన్ పాత్రలో అల్లు శిరీష్ కనిపించాడు. పూర్తి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ మూవీ రూపుదిద్దుకున్నట్లుగా ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. మొత్తంగా ట్రైలర్ ఆకట్టుకుంటోంది. ఈ సినిమా జూలై 26న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు చిత్ర బృందం తెలియజేసింది.

## రాయలసీమ వాళ్లకు విజయ్ దేవరకొండ
# సినిమాలో నటించే ఛాన్స్..



ఇంకెందుకు ఆలస్యం మీది రాయలసీమ అయితే, మీకు రాయల సీమ యాసలో మాట్లాడటం వస్తే ఈ ఆడిషన్స్ లో పాల్గొని మీ ట్యాలెంట్ చూపించి విజయ్ దేవరకొండ సిని మాలో నటించే ఛాన్స్ కొట్టేయండి.

విజయ్ దేవరకొండ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ మూడు భారీ సినిమాలు చేస్తున్నాడు. రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో విజయ్ దేవరకొండ హీరోగా VD14 వర్కింగ్ టైటిల్ తో ఓ సినిమాని ప్రకటించిన సంగతి తెలిసిందే. రాయలసీమలో 1854 సంవత్సరం నుంచి 1873 సంవత్సరం మధ్యలో జరిగిన పీరియాడిక్ కథ అని హింట్ ఇస్తూ ఓ యోధుడు ఉన్న పోస్టర్ కూడా రిలీజ్ చేశారు.తాజాగా ఈ సినిమాలో నటించడానికి కొత్తవాళ్ళని తీసుకుంటున్నారు. అందుకోసం ఆడిషన్స్ కూడా నిర్వహిస్తున్నారు. ఈ సినిమా రాయలసీమ నేపథ్యంలో తెరకెక్కుతుండటంతో రాయలసీమ యాస మాట్లాడే వారి కోసం అక్కడే రాయల సీమలోనే ఆడిషన్స్ కూడా నిర్వహించి నటీనటులను తీసుకోబోతున్నారు. తాజాగా ఈ ఆడిషన్స్ డీటెయిల్స్ తెలిపారు.

**ఏ రోజు ఎక్కడ ఆడిషన్స్ ఉన్నాయంటే..**

- జులై 1,2 లో కర్నూల్ లోని జెండా పార్క్ వద్దనున్న ఇందిరమ్మ కమ్యూనిటీ హాల్ లో ఆడిషన్స్ జరగనున్నాయి.
- జులై 3,4 లో కడప మున్సిపల్ హైస్కూల్ పక్కన ఉన్న YSR ఆడిటోరియం లో ఆడిషన్స్ జరగనున్నాయి.
- జులై 5,6 లో తిరుపతి VRR ఫంక్షన్ హాల్ లో ఆడిషన్స్ జరగనున్నాయి.
- జులై 8,9 లో అనంతపూర్ లోని అనంత షిర్డీ సాయి కల్యాణ మండపంలో ఆడిషన్స్ జరగనున్నాయి. ఈ డీటెయిల్స్ తో పాటు మీ డీటెయిల్స్ పంపడానికి ఓ మెయిల్ ఐడి, ఏదైనా సందేహాలు ఉంటే అడగడానికి ఓ ఫోన్ నంబర్ కూడా ఇచ్చారు.






## ఇందిరా గాంధీగా బీజేపీ ఎంపీ..
# రిలీజ్ డేట్ ఫిక్స్

ప్రముఖ బాలీవుడ్ నటి, దర్శకురాలు కంగనా రనౌత్ ఇప్పుడు బీజేపీ ఎంపీ. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా హిమాచల్ ప్రదేశ్‌లోని మండి లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఆమె భారీ మెజార్టీతో గెలుపొందింది. ఇన్నాళ్లు సినీ నటిగా, దర్శకురాలిగా అందరి దృష్టిని ఆకర్షించిన కంగనా ఇకపై ఎంపీగా ప్రజలకు సేవ చేయనుంది. కాగా కంగనా ఎన్నికల్లో పోటీ చేసే ముందు ఇందిరా గాంధీ జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కిన 'ఎమర్జెన్సీ' సినిమాలో నటించింది. అయితే ఎన్నికల కారణంగా ఈ సినిమా విడుదల వాయిదా పడింది. ఇప్పుడీ సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటించారు. సెప్టెంబర్ 6న 'ఎమర్జెన్సీ' చిత్రాన్ని విడుదల చేయనున్నారు కంగనా. కంగనా ఎంపీగా ఎన్నికైన తర్వాత ఈ సినిమా విడుదలవుతుందా లేదా అనే సందేహం నెలకొంది. అయితే ఎట్టకేలకు కంగనా సినిమా విడుదల తేదీని ప్రకటించింది. ఈ సినిమాలో కంగనా ఇందిరా గాంధీ పాత్రలో నటించింది. మాజీ ప్రధానిలోని దృఢమైన వ్యక్తిత్వాన్ని ఈ సినిమాలో ఆవిష్కరించామని కంగనా అంటున్నారు. భారత రాజ్యాంగంలో చీకటి అధ్యాయంగా పేరొందిన ఎమర్జెన్సీ రోజును (జూన్ 25) 'ఎమర్జెన్సీ' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్టు కంగనా ప్రకటించారు. ఈ చిత్రానికి ఆమెనే దర్శకత్వం వహించారు. అలాగే నిర్మాతగా కూడా వ్యవహరించారు. ఇదిలా ఉంటే కంగనా రనౌత్ గత కొన్ని సినిమాలు ఒకదాని తర్వాత ఒకటి పరాజయం పాలయ్యాయి. ఈ సినిమా ద్వారా కంగనా మళ్లీ సక్సెస్ ట్రాక్ లోకి వస్తుందని అంటున్నారు. అలాగే, బీజేపీ ఎంపీగా కంగనా ఇందిరాగాంధీని, ఎమర్జెన్సీని తెరపై ఎలా చిత్రీకరిస్తుందనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. చాలా నెలల క్రితం ఈ సినిమా చిన్న టీజర్ విడుదలైంది., టీజర్‌లో కంగనా రనౌత్ నటన అద్భుతంగా ఉంది. ఆ ఒక్క చిన్న టీజర్ నుంచే సినిమాపై క్యూరియాసిటీ ఏర్పడింది. త్వరలోనే ట్రైలర్ ను కూడా రిలీజ్ చేయనున్నారు.



## కుర్రాళ్లను ప్రేమలో పడేసిన కుర్రది..
# ఆఫర్స్ కోసం ఆరాటం

ప్రియా ప్రకాష్ వారియర్ ఒక భారతీయ నటి, ఆమె ప్రధానంగా మలయాళం మరియు తెలుగు చిత్రాలలో పనిచేస్తుంది. ఒరు అదార్ లవ్ చిత్రంలో ఆమె కన్నుగీటడం వైరల్ అయ్యింది, 2018లో భారతదేశంలో గూగుల్ ద్వారా అత్యధికంగా శోధించబడిన వ్యక్తిగా ఆమె నిలిచింది. ఒక ఒక్క సినిమాతో ఓవర్ నైట్ లో క్రేజ్ తెచ్చుకున్న భామల్లో ఈ మలయాళీ బ్యూటీ కూడా ఒకరు. మలయాళ సినిమా ఓరు ఆధార్ లవ్ (తెలుగులో లవర్స్ డే) అనే సినిమాలో నటించి మెప్పించింది ప్రియా ప్రకాష్ వారియర్. ఈ సినిమాలో ఒక ఒక్క సీన్ తో బాగా పాపులర్ అయ్యింది. ఈ సినిమాలో కన్నుగొట్టి చాలా మంది కుర్రాళ్లను ప్రేమలో పడేసింది ప్రియా ప్రకాష్ వారియర్. ఓరు ఆధార్ లవ్ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయింది. తెలుగులో నితిన్ సరసనా చెక్ అనే సినిమాలో నటించింది. ఈ మూవీ డిజాస్టర్ గా మిగిలింది. 2023లో పవన్ కళ్యాణ్, సాయి ధరమ్ తేజ్ కలిసి నటించిన బ్రో సినిమాలో మెరిసింది. ఈ సినిమాలో తేజ్ కు సిస్టర్ గా కనిపించింది. బ్రో సినిమా మంచి టాక్ ను సొంతం చేసుకున్నపటికి ఈ అమ్మడికి ఈ మూవీలో నటనకి అంతగా గుర్తింపు ఏమి రాలేదు. సోషల్ మీడియాలో ప్రియ అందాలు ఆరబోస్తూ ఆఫర్స్ కు గాలం వేస్తుంది. నిత్యం హాట్ హాట్ ఫోటోలను అప్లోడ్ చేస్తూ నెట్టింట రచ్చ చేస్తోంది. తాజాగా మరోసారి తన గ్లామరస్ ఫోటోలను పంచుకుంది ఈ వయ్యారి భామ.

## పిల్లల్లో ఇమ్యూనిటీ పవర్ పెంచాలంటే
# ఈ జ్యూస్‌లు ఇవ్వండి



వేసవి వేడి కారణంగా వివిధ రకాల బ్యాక్టీరియా మరియు వైరస్‌లు వృద్ధి చెందుతాయి. ఈ బ్యాక్టీరియా మరియు వైరస్‌లు మీ ఫ్లూ, జలుబు మరియు ఇతర అనారోగ్యాల ప్రమాదాన్ని పెంచుతాయి. సరైన ఆహారం తీసుకోవడం, అధిక ఒత్తిడి మరియు మానసిక ఆరోగ్యం సరిగా లేకపోవడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. ముఖ్యంగా వర్షాకాలంలో చిన్నపిల్లలు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉంది. పిల్లల్లో ఇమ్యునిటీ పవర్‌ను పెంచాలంటే ఈ తొమ్మిది రసాలను ఆహారంలో చేర్చండి. రోజుకో జ్యూస్ చొప్పున ఇస్తే.. ఎదిగే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారు.

**పుచ్చకాయ రసం**

పుచ్చకాయలో చాలా నీరు ఉంటుంది. పుచ్చకాయలో విటమిన్ ఎ మరియు సి వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇది హైడ్రేట్ చేస్తుంది మరియు రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

**చియా సీడ్ వాటర్**

చియా గింజలు ప్రోటీన్, విటమిన్లు, ఖనిజాలు మరియు ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు వంటి పోషకాలలో పుష్కలంగా ఉన్నాయి. చియా గింజల్లో ఉండే విటమిన్లు, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్‌లు, యాంటీ ఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో సహాయపడతాయి.

**చారోకోల్ వాటర్**

ఎలక్ట్రోలైట్స్‌లో అధికంగా ఉండే చారోకోల్ వాటర్ మిమ్మల్ని హైడ్రేట్‌గా మరియు శక్తివంతంగా ఉంచుతుంది. ఇందులో పొటాషియం, సోడియం, మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి.

**పసుపు పాలు**

పసుపులో కర్కుమిన్ ఉంటుంది. పసుపు పాలలో శక్తివంతమైన యాంటీ ఇన్ఫ్లమేటరీ మరియు యాంటీఆక్సిడెంట్ లక్షణాలు ఉన్నాయి, ఇవి రోగనిరోధక పనితీరును పెంచడంలో సహాయపడతాయి. ఒక కప్పు గోరువెచ్చని పాలలో ఒక టీస్పూన్ పసుపు పొడిని కలిపి త్రాగాలి.

**బెర్రీ స్మూతీ**

స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీస్ మరియు రాస్ప్బెర్రీస్ వంటి బెర్రీలలో విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు మరియు ఫైబర్ ఉంటాయి. ఇవన్నీ రోగనిరోధక ఆరోగ్యానికి సహాయపడతాయి.

**పుదీనా మరియు దోసకాయ నీరు**

పుదీనా మరియు దోసకాయతో నీరు తేమను పెంచుతుంది మరియు రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

**అనాస పండు**

పైనాపిల్‌లో విటమిన్ సి మరియు బ్రోమెలైన్ పుష్కలంగా ఉన్నాయి. పైనాపిల్ జ్యూస్ రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది.

**కలబంద రసం**

కలబందలో విటమిన్లు, ఖనిజాలు మరియు యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఇందులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు కూడా ఉన్నాయి.

**దుంప రసం**

దుంపలలో విటమిన్లు, ఖనిజాలు మరియు యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. రోగనిరోధక శక్తిని పెంచే విటమిన్ సి కలిగి ఉంటుంది

# గుడ్డులో కంటే ఎక్కువ ప్రోటీన్ ఉన్న ఫుడ్స్ ఇవే..

**విశ్వంభర, ఫీచర్ :** ఆకలి వేసిందని ఏదో తింటున్నామంటే తింటారు చాలా మంది. కానీ కొంత మంది అలా కాదు. వాళ్లు ఏం తింటున్నారు? అందులో ఎలాంటి పోషకాలు ఉన్నాయని లెక్కలు వేసుకుంటూ ఉంటారు. ఇలా చాలా మంది జిమ్ వర్క్ అవుట్స్‌కి వెళ్లే వాళ్లకు ప్రోటీన్ అనేది చాలా అవసరం. అలాంటి వారు బయట మార్కెట్లో లభించే కెమికల్స్ పౌడర్స్ యూజ్ చేయడం కంటే.. ఇలా నేచురల్ ఫుడ్ తీసుకుంటే హెల్త్ చాలా మంచిది. ప్రోటీన్ అనగానే చాలా మందికి గుడ్డు గుర్తొచ్చేస్తుంది. కానీ కోడి గుడ్డులో కంటే ఈ పదార్థాల్లో ఇంకా ఎక్కువగా ప్రోటీన్ అనేది లభస్తుంది. ఇప్పుడు చెప్పే ఈ మూడు గింజల్లో హై ప్రోటీన్ ఉంటుంది. అంతే కాకుండా ఇతర ఆరోగ్య ప్రయోజనాలు కూడా



ఉన్నాయి. ఇవి ఎక్కువగా రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహిస్తాయి. మరి ఆ ఫుడ్స్ ఏంటి? ఎలా తీసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం.

**పల్లీలు:**

పల్లీలను చాలా మంది తక్కువ అంచనా వేస్తారు. కేవలం చట్నీలకు మాత్రమే ఉపయోగిస్తారు. కానీ వీటిల్లో ప్రోటీన్ కంటెంట్ అనేది చాలా ఎక్కువగా లభిస్తుంది. ఇవి ఈజీగా ఎక్కడైనా లభిస్తాయి. వీటిల్లో ఎక్కువగా శాతం ఖనిజాలు అనేవి ఉంటాయి. ఒక ఔన్స్ పల్లీలో రెండు గ్రాముల ప్రోటీన్ లభిస్తుంది. ఇవి మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచేందుకు చాలా హెల్ప్ చేస్తుంది. వీటిని నేరుగా, నానపెట్టుకుని, ఉడికించుకుని ఇలా ఎలాగైనా తినవచ్చు.

**బాదం పప్పు:**

బాదం పప్పులో కూడా చాలా హై ప్రోటీన్ ఉంటుంది. బాదం పప్పును పోషకాల హౌస్ అని కూడా పిలుస్తూ ఉంటారు. ఇవి శరీరానికి కావాల్సిన ఖనిజాలను అందిస్తుంది. అంతే కాదు బాదం పప్పు తినడం వల్ల గుండె కూడా చాలా మంచిది.

# వర్షా కాలంలో ఇంట్లోకి వచ్చే పురుగులకు ఇలా చెక్ పెట్టండి..

ఇలా వర్షాలు మొదలవుతాయో లేదో అలా పురుగులు ఇంట్లో వస్తుంటాయి. అప్పటి వరకు ఎక్కడ ఉండేవో కూడా తెలియని పురుగులు ఒక్కసారి దండయాత్ర చేసినట్లు దూసుకొస్తుంటాయి. సాయంత్రం కాగానే వీధి దీపాల కింద, ఇంట్లో ఉండే లైట్స్ వద్ద కిటకిటలాడుతాయి. దీంతో ఈ పురుగుల వల్ల చికాకు రావడం ఖాయం. మరి ఈ పురుగులు ఇంట్లోకి రాకుండా ఉండడానికి ఏవైనా చిట్కాలు లేవా.? అంటే కచ్చితంగా ఉన్నాయి. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం..

- ఈ కీటకాలను తరిమికొట్టడంలో నిమ్మకాయ, బేకింగ్ సోడా లిక్విడ్ ఎంతగానో ఉపయోగపడుంది. ఇందుకోసం కొంత నీటిలో నిమ్మకాయ రసం, బేకింగ్ సోడాను కలిపి ద్రావణంగా తయారు చేసుకోవచ్చు. ఈ లిక్విడ్‌ను ఒక బాటిల్‌లో పోసి, కీటకాలపై స్ప్రే చేస్తే సరిపోతుంది వెంటనే పారిపోతాయి.
- కీటకాలు నల్ల మిరియాల గాఢతను తట్టుకోవాలి. ఇందుకోసం ముందుగా నల్ల మిరియాలను పొడిగా గ్రైండ్ చేసుకోవాలి. అనంతరం నీళ్లలో పోసి స్ప్రే చేస్తే కీటకాలను తరిమికొట్టొచ్చు.
- ఇక కిటికీల నుంచి వచ్చే వెలుతురుకు కూడా అట్రాక్ట్ అయ్యి కీటకాలు వస్తుంటాయి. కాబట్టి వర్షాకాలంలో కిటికిలకు బ్లాక్ స్క్రీన్‌లను ఏర్పాటు చేసుకోవడం వల్ల పురుగులు ఆకర్షించబడవు.
- కీటకాలను తరిమికొట్టడంలో వేప నూనె కూడా ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇంటి ప్రధాన ద్వారం వద్ద వేప నూనెను జల్లడం వల్ల పురుగులు ఇంట్లోకి రాకుండా ఉంటాయి.
- వీటితో పాటు కీటకాలు ఇంట్లోకి రాకుండా ఉండాలంటే సాయంత్రం కాగానే కిటికీలు, తలుపులు మూసి వేయడం ఉత్తమమైన మార్గం. అలాగే కిటికీల మధ్య ఏవైనా గ్యాప్స్ ఉంటే వాటిని ఫిల్ చేయాలి. ఇక సాయంత్రం పురుగులు వచ్చే సమయంలో ఇంట్లో లైట్స్ ఆఫ్ చేసి బయటి లైట్ ఆన్ చేయడం ద్వారా పురుగులు బయటకు వెళ్లిపోతాయి.
- ఇక లైట్స్ ఉన్న చోట ఆయిల్ రాసన న్యూస్ పేపర్స్‌ను ఏర్పాటు చేసినా పురుగులు వాటికి అతుక్కుపోతాయి. ఇలా కూడా పురుగులకు చెక్ పెట్టొచ్చు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com